అన్నమాచార్యులు
భారతీయ వాగ్గేయకారులు
తులనాత్మక పరిశీలనం
(పరిశోధన పత్ర సంకలనం)

ఆచార్య కె. కుసుమారెడ్డి
తెలుగుశాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ANNAMACHARYULU
BHARATIYA VAGGEYAKARULU
Tulanatmaka Pariseelanam
(An Anthology of Research Articles)



Editor
Prof. K. KUSUMA REDDY
Head of the Dept. of Telugu
Osmania University,
Hyderabad

2007

ANNAMACHARYULU BHARATIYA VAGGEYAKARULU

Tulanatmaka Pariseelanam

(An Anthology of Research Artiles)

Editor : **Prof. K. Kusuma Reddy,**

Head of the Dept. of Telugu, Osmania University, Hyd.

© Copy Rights : Reserved

Copies 1000

First Edition : September 2007

For Copies :

Prof. **K. Kusuma Reddy,**
H.No. 3-13-40/5/1,
East Srinivasapuram,
Ramanthapur, Hyderabad - 13.
Ph: 040- 65442197

DTP & Cover design & Printing:

Sri Uday Printers
#3-5-718/1, Vittalwadi X Roads,
Narayanguda, Hyderabad - 29.
Ph : 040-64511385

డా. వై.యస్.రాజశేఖర రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



సందేశం

తెలుగుజాతి గర్వించదగ్గ వాగ్గేయకారుడు అన్నమాచార్య 600వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం తిరుమల-తిరుపతి దేవస్థానం, తిరుపతిలోని అన్నమాచార్య ప్రాజెక్టు, రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖల సంయుక్త సౌజన్యంతో 2007 ఆగస్టు 3,4 తేదీలలో "అన్నమయ్య-భారతీయ భాషల వాగ్గేయకారులు- తులనాత్మక అధ్యయనం" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తూ, యీ సందర్భంగా ఒక ప్రత్యేక సంచికను వెలువరించడం ముదావహం.

తెలుగుభాష మాధుర్యాన్ని, తెలుగు గడ్డపై వికసించిన సుస్వర సంగీతాన్ని కలబోసి వేలకు వేల పదాలను రచించిన మొదటి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు అన్నమయ్య. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, నేదునూరి కృష్ణమూర్తి వంటి ప్రముఖులు అన్నమయ్య పదాలను ప్రాచుర్యంలోనికి తేవడానికి ఎనలేని కృషిచేశారు.

నేడు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఒకే వేదికపై దేశంలోని వివిధ భాషలకు చెందిన వాగ్గేయకారులతో తులనాత్మకంగా పరిశీలించి, అన్నమయ్య సంగీత-సాహిత్య మేళవింపును అధ్యయనం చేయడం ఎంతైనా హర్షణీయం.

మహత్తర ఆశయంతో చేపట్టిన యీ రెండు రోజుల కార్యక్రమం సాహితీ సంగీత ప్రియులకు, ముఖ్యంగా యువతరానికి స్ఫూర్తిదాయకం కాగలదని ఆశిస్తున్నాను.

(వై.యస్. రాజశేఖరరెడ్డి)

ANAM RAMANARAYANA REDDY
Minister for Information & Public
Relations, Tourism, Culture
Cinematography, Archaeology and
Museums & Archieves

హైదరాబాదు



సందేశం

అచ్చ తెనుగు పదాలతో అత్యంత రమణీయమైన శైలితో వేలాది కీర్తనలు రచించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య తెలుగు సాహిత్య వినీలాకాశంలో ధృవతారగా నిలిచిపోయారు. పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు విరచించిన కీర్తనలు ఎంతో ప్రసిద్ధిగాంచాయి. పాశ్చాత్య దేశాల సంగీతం వెల్లువలో కొట్టుకుపోతూ సాంప్రదాయ సిద్ధమైన అస్తిత్వాన్ని కోల్పోతున్న అధునాతన యువ సమాజానికి సుసంపన్నమైన సాహితీ విలువలతో కూడిన అన్నమయ్య పదాలపై అవగాహన కల్పించేందుకు మరెంతో ప్రయత్నం జరగవలసి ఉంది. అన్నమయ్య, ఇతర వాగ్గేయ కారుల సాహిత్యంపై తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న కృషి అభినందనీయం. “తాళ్ళపాక అన్నమాచార్యులు, భారతీయ భాషా వాగ్గేయకారులు - తులనాత్మక అధ్యయనం” పై టి.టి.డి అన్నమాచార్య ప్రాజెక్టు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ హైదరాబాదులో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించడం ప్రశంసనీయం. ఈ సదస్సు నిర్వహణలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ భాగస్వామ్యం వహించడం సంతోషం కలిగిస్తోంది. అన్నమయ్యతో పాటు త్యాగయ్య, క్షేత్రయ్య, పురందరదాసు తదితర వాగ్గేయకారులపై అధ్యయనం మరింత ముందుకు సాగడానికి ఈసదస్సు స్ఫూర్తి నివ్వగలదని ఆశిస్తున్నాను. సదస్సు విజయవంతం కావాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను.

(ఆనం రామనారాయణ రెడ్డి)

కె.వి. రమణాచారి, ఐ.ఎ.యస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి- 517 502.

అభిలాష

తిరుమల తిరుపతి దేవస్థానములు, అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుపతి; తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు సంయుక్తంగా **"శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు- భారతీయ భాషా వాగ్గేయకారులు"** తులనాత్మక అధ్యయనం పై జాతీయసదస్సును 2007 ఆగస్టు 3,4 తేదీలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించడం, ఆ రెండు రోజుల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో వివిధ విశ్వవిద్యాలయాల నుండి ఆచార్యులు వివిధ సంస్థల నుండి ప్రముఖులు పాల్గొని పరిశోధక పత్రాలను సమర్పించడం హర్షణీయం.

తరతరాలకు స్ఫూర్తిదాయకమైన అన్నమాచార్యుల వారి సాహిత్యం, భారతదేశంలోని ఇతర పదకవుల సాహిత్యంతో పోల్చి చూచినపుడు అంతస్సూత్రంగా, అవిచ్ఛిన్నంగా ప్రవహించే వాహిని భక్తి అనీ అదీ విష్ణుభక్తి అని స్పష్టమవుతుంది. భారతీయ వాగ్గేయకారులందరు నవవిధ భక్తి మార్గాలలో సంకీర్తన మార్గాన్నెంచుకొని తరించిన వారేనని, హరినామస్మరణతో పునీతులైన వారేనని, పరమాత్మకు ప్రజలకు సన్నిహితులై ఆర్తిని ఆనందాన్ని పంచిన వారేనని తెలుస్తుంది.

భారతీయ వాగ్గేయకారుల తత్త్వాన్ని, వేంకటాచలపతి మహాత్మ్యాన్ని చాటుతున్న ఈ పరిశోధక పత్రాల సంపుటిని జిజ్ఞాసువులు, ఆసక్తిగల పాఠకులు అభినివేశంతో చదివి మంచి స్ఫూర్తిని పొందగలరని మా అభిలాష.

(కె.వి. రమణాచారి)

బి.యస్.రెడ్డి (భూమన్)
డైరక్టర్, శ్వేత,
ప్రత్యేక అధికారి, అన్నమయ్య 600 జయంతోత్సవాలు
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి- 517 502.

అభిప్రాయం

అన్నమయ్య 600 జయంతి ఉత్సవాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు, అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ సంయుక్తంగా **"శ్రీమాన్ అన్నమాచార్యులు- భారతీయ భాషా వాగ్గేయకారులు- తులనాత్మక అధ్యయనం"** అనే అంశం మీద జాతీయ సదస్సును 2007 ఆగస్టు 3,4 తేదీలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కాంపస్ హైదరాబాదులో నిర్వహించడం జరిగింది.

అన్నమాచార్యుల సాహిత్యాన్ని భారతదేశం నలుమూలల్లోని వివిధ భాషల్లో ప్రసిద్ధులైన వాగ్గేయకారుల సాహిత్యంలో పోల్చి భేద సాదృశ్యాలను పరిశీలించి వివిధ విశ్వవిద్యాలయాచార్యులు, పండితులు మంచి పత్రాలను సమర్పించారు. అత్యంత వైవిధ్య భరితంగాను, నూతన దృక్పథంతోను సాగిన పత్ర సమర్పణ వాగ్గేయకారుల తత్త్వాన్ని చక్కగా ప్రస్ఫుటం చేశాయి.

తెలుగు,ఇంగ్లీషు, హిందీభాషల్లో సాగిన ప్రసంగాలు శ్రోతలను అలరించటమే గాక,కొంత చర్చకు అవకాశం కూడా కలిగించాయి. ఇటువంటి తులనాత్మక అధ్యయనం వివిధ భాషా సాహిత్యాల మధ్య మంచి అవగాహనకు దోహదం చేస్తుంది. మన సంస్కృతీ సంప్రదాయాలపై కొత్త వెలుగులు ప్రసరింపజేస్తుంది.

ఈ పరిశోధక పత్రాలు పుస్తకరూపంలో వెంటనే ఆవిష్కరింపబడటం అభినందనీయం. ఈ పుస్తకం పాఠకులకు ఆసక్తికరంగా ఉంటుందనీ పరిశోధకులకు ప్రయోజన కరంగా ఉంటుందనీ మా అభిప్రాయం.

(భూమన్)

ప్రొఫెసర్ కె. కుసుమారెడ్డి
అధ్యక్షులు, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

తొలిపలుకులు

పండిత పామర జనరంజకంగా పదకవితలు రచించిన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులు కారణజన్ముడు. నందకాశంలో జన్మించిన ఆయన తన 16వ యేటనే శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షాత్కారం పొంది, రోజుకొక్క సంకీర్తన చొప్పున 32వేల సంకీర్తనలను రచించి, చరితార్థుడయ్యాడు. పల్లవి చరణాలతో కూడిన పద రచనకు మార్గదర్శకుడై 'పద కవితా పితామహుడు' గా కీర్తి గడించాడు.

అన్నమాచార్య కీర్తనల్లో సాహిత్యం, సంగీతం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించి ఉంటాయి. తెలుగు వాగ్గేయ కారులలో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయా క్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత అన్నమయ్యకే దక్కుతుంది.

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయ రీతుల్లో రచించి, సామాన్యులకు అందించే ప్రయత్నం చేశాడు. గ్రాంథిక వ్యవహార భాషా శైలులలో పదకవితలల్లినాడు. జానపదుల జీవద్భాషను వాడి సంకీర్తనా రచనా శైలికి మార్గదర్శకుడైనాడు. అన్నమయ్య పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య కూడా పద రచనలు చేసి, వంశపారంపర్యంగా పదరచనకు పట్టం కట్టారు.

ఇహ పర శ్రేయోదాయకమైన తాళ్లపాక కవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలనే సదాశయంతో తిరుమల -తిరుపతి దేవస్థానంవారు 1978 సంవత్సరంలో అన్నమాచార్య

ప్రాజెక్టును స్థాపించారు. అప్పటి నుండి అన్నమాచార్య ప్రాజెక్టు వారు అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం, పరిశోధన, రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వేల కొలది సాహిత్య సభలను దేశం నలుమూలల జరుపుతున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు వేలకొలది సంగీత కచ్చేరీలు చేస్తున్నారు. తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆడియో కాసెట్లుగా విడుదల చేస్తున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు 1949 సంవత్సరం నుండి అన్నమాచార్య వర్థంతి సభలను, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి సభలను జరుపుతున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు వారు వివిధ విశ్వవిద్యాలయాల సమస్వయంతో తాళ్లపాక కవుల సదస్సులను నిర్వహిస్తున్నారు. తాళ్లపాక కవులపై పరిశోధన చేసే విద్యార్థులకు ఉపకార వేతనమిచ్చి ప్రోత్సహిస్తున్నారు.

అన్నమాచార్య ఆరవ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్కృతిక శాఖల సమన్వయంతో ***"శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు - భారతీయ భాషా వాగ్గేయకారులు - తులనాత్మక అధ్యయనం"*** అనే అంశం పై జాతీయ సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సు 2007 ఆగస్టు 3,4 తేదీలలో ప్రొఫెసర్ జి. రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్లాటినం జూబ్లీ హాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదులో జరిగింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రాత్మకమైంది. దేశ విదేశీయ పండితులతో సుసంపన్నమైంది. ఆయా పండితుల ద్వారా అన్నమయ్య సాహిత్యంతో పాటు తెలుగు సాంస్కృతీ విశేషాల పట్ల జాతీయ-అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తిని కలిగించే లక్ష్యంగా ఈసదస్సు సాగింది. పదకవులు ప్రజాకవులు. ప్రజల నాలుకలపై జీవించే కవులు. భగవంతుని హృదయంలో నిలుపుకొన్న కవులు. వారందరి రచనల్లోని అంతస్సూత్రం భక్తి. వారికి సాధనం సంగీతం. వారి లక్ష్యం బ్రహ్మానంద స్వరూపమైన పరమపదం. అలాంటి కవులను గూర్చిన పరిశీలన ప్రసంగాలు ఎంతో ఆసక్తికరంగా జరిగాయి.

తులనాత్మక అధ్యయనం గీటురాయివంటిది. కవి గుణ విశేషాలను నిగ్గుతేల్చే విధానమిది. భారతీయ వాగ్గేయకారులతో అన్నమయ్యను తులనాత్మకంగా పరిశీలించినపుడు భారతదేశంలో అన్నమయ్య స్థానం నిరూపితమవుతుంది. వివిధ భాషల్లో అన్నమయ్య సాహిత్యానికి విస్తృత ప్రచారం కలుగుతుంది. అనుకరణలు, ప్రభావాలు, సామాజికాంశాలు, సంస్కృతీ విశేషాలు ప్రకటితమవుతాయి. దేశ సమైక్యతకు దోహదం కలుగుతుంది. ఈ సదస్సులో హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయి పండితులు పత్ర సమర్పణ చేశారు.

ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి వివిధ విశ్వవిద్యాలయాల నుండి ఆచార్యవర్యులు, పండితులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కాశీ నుండి కన్యాకుమారి వరకు బెంగాల్ నుండి మహారాష్ట్ర వరకు ఉన్న వాగ్గేయకారులను అన్నమయ్యతో పోల్చి భారతదేశం నలుమూలల నుండి పండితులు పత్ర సమర్పణ చేశారు. అన్నమయ్య సాహిత్యం అపారం. అది తరగని గని. అందులో రత్నాలెన్నో! అందుకున్నవారికి అందుకున్నన్ని. విద్యార్థులు, పరిశోధకులు ఈ సదస్సు లక్ష్యాన్ని సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందారు. ఈ సదస్సు లక్ష్యం శాశ్వతం కావాలని ఈ పరిశోధన పత్రాలు పుస్తక రూపంలో ముద్రించడం జరిగింది. ఈ పుస్తకం తరతరాలుగా సాహిత్య ప్రియులకు, సంగీత ప్రియులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తాను.

కె. కుసుమారెడ్డి

(డా. కె. కుసుమారెడ్డి)

సదస్సు డైరక్టర్

కృతజ్ఞతాభివందన చందనాలు

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ పక్షాన అన్నమయ్య- భారతీయ భాషా వాగ్గేయకారులు – తులనాత్మక అధ్యయనం అనే అంశంపై సదస్సును నిర్వహించాలని నేను సంకల్పించినపుడు నన్ను ప్రోత్సహిస్తూ తమ అపురూపమైన సందేశాన్ని అందించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు డా. వై.యస్. రాజశేఖరరెడ్డి గారికి కృతజ్ఞతాభివందన చందనాలు.

ఈ సదస్సు నిర్వహణకు ఎంతో ఔదార్యంతో ఆర్థిక సహాయాన్ని, హార్దిక సందేశాన్ని అందించిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాలశాఖామాత్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారికి కృతజ్ఞతాభివందనాలు.

సదస్సు నిర్వహణకు నన్ను ఉత్సాహపరచి ప్రారంభ సమావేశానికి విశిష్ట అతిథిగా విచ్చేసి, తమ అమూల్యమైన సందేశాన్ని అందించిన గౌరవనీయులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య శ్రీ సులేమాన్ సిద్ధిఖిగారికి ధన్యవాదాలు.

సదస్సుకు రూపకల్పన చేసింది మొదలు చివరి వరకు అన్నింటా తమ అమూల్యమైన సలహాలతో సహకరించి,ప్రారంభసదస్సును చక్కగ నిర్వహించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్. గోపి గారికి ధన్యవాదాలు.

సదస్సును నిర్వహించడానికి తమ సహాయ సహకారాలను సంయుక్త నిర్వహణకు అనుమతిని మంజూరుచేసి ప్రారంభోత్సవ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి, తమ చక్కటి ప్రసంగంతో సాహిత్యవేత్తలనందరిని ఆనందపరచిన సహృదయులు, గౌరవనీయులు శ్రీ కె.వి. రమణాచారి, ఐ.ఎ.యస్., గారికి ధన్యవాదాలు.

సదస్సు తలపెట్టిన నాటి నుండి అన్ని కార్యక్రమాలు సజావుగా సకాలంలో జరగడానికి సంపూర్ణంగా సహకారాన్ని అందించి, తగిన సూచనలిచ్చి అడుగడుగున నన్ను జాగృతం చేస్తూ సభ దిగ్విజయం కావడానికి కృషి చేసిన సహృదయులు గౌరవనీయులు శ్వేత డైరక్టర్, 600 అన్నమయ్య జయంతి ఉత్సవాల ప్రత్యేకాధికారి శ్రీ భూమన్ గారికి ధన్యవాదాలు.

సదస్సు నిర్వహణకు అడిగినదే తడవుగ తమ అనుమతిని మంజూరుచేసి, సమాపనోత్సవానికి అధ్యక్షులుగ విచ్చేసి, సందర్భోచిత ప్రసంగంతో సదస్యులను సంతోష పరచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎమ్. ముత్తారెడ్డి గారికి ధన్యవాదాలు.

సమాపనోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖులు, అవధానిగా సుప్రసిద్ధులు, తమ అద్భుతమైన ప్రసంగంతో సాహితీ వేత్తలను అలరించిన, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల సంచాలకులు డా. రాళ్లబండి కవితా ప్రసాద్ గారికి ధన్యవాదాలు.

ప్రొఫెసర్ జి. రామిరెడ్డి జూబ్లీ హాలు వేదికగా సభను నిర్వహించడానికి అనుమతించిన ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరక్టర్ ఆచార్య భుజంగరావు గారికి ధన్యవాదాలు.

సభానిర్వహణకు తమ ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించిన ఉస్మానియా విశ్వ విద్యాలయం యు.జి.సి వారికి ధన్యవాదాలు.

సదస్సు విజయవంతం కావాలని తమ ఆశీస్సులందించిన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ & సోషల్ సైన్సెస్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎల్. విశ్వేశ్వరరావుగారికి, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య పి. సుమతీ నరేంద్రగారికి, అభినందనలు అందించిన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ & సోషల్ సైన్సెస్ కాలేజి వైస్-ప్రిన్సిపాల్ ఆచార్య ఉమా రంగన్ గారికి, తెలుగు శాఖ ప్రణాళికా సంఘం అధ్యక్షులు ఆచార్య టి. కిషన్ రావుగారికి, సెమినార్ కార్యక్రమాన్ని సమగ్రంగా నివేదిక రూపంలో సమర్పించిన ఆచార్య ఎం.చెన్నప్పగారికి, కమ్మని భోజనంతో అందరినీ సంతృప్తిపరచిన గెస్ట్‌హౌస్ డైరక్టర్ డా. బూర్గుల కేశవులు గారికి, అన్ని విధాల తమవంతు సహకారాన్ని అందించిన తెలుగుశాఖ అధ్యాపక వర్గానికి పరిశోధనాత్మక పత్రాలను సమర్పించి సెమినార్‌ను దిగ్విజయం చేసిన మిత్రులందరికీ ధన్యవాదాలు.

సెమినార్ పత్రాలను అందంగాను సమయానుకూలంగాను ముద్రించిన ఉదయ్ ప్రింటర్స్ వారికి ధన్యవాదాలు.

కె. కుసుమారెడ్డి

(డా. కె. కుసుమారెడ్డి)
సదస్సు డైరక్టర్

లోపలి పేజీలో...

1.	అన్నమయ్య - త్యాగయ్య	- ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి	1
2.	అన్నమయ్య- క్షేత్రయ్య	- ఆచార్య ఎస్. గంగప్ప	10
3.	అన్నమయ్య- తరిగొండ వెంగమాంబ	- ఆచార్య కె.జె. కృష్ణమూర్తి	18
4.	అన్నమయ్య - సారంగపాణి	- ఆచార్య పి.జి.కుసుమకుమారి	25
5.	అన్నమయ్య-రాకమచర్ల వెంకటదాసు	- డా॥ ఎమ్. బాగయ్య	45
6.	అన్నమయ్య - రామదాసు	- డా॥ బూర్గుల కేశవులు	53
7.	అన్నమయ్య - పోతులూరి వీరబ్రహ్మం	- ఆచార్య ఎమ్. చెన్నప్ప	60
8.	సూరదాసు సాహిత్యం	- ఆచార్య పి. మాణిక్యాంబ	66
9.	అన్నమయ్య - గోదాదేవి	- డా॥ వి. జానకి	72
10.	తాళ్లపాక కవులు- అష్టచాప్ కవులు	- డా॥ ఆర్.సుమన్‌లత	79
11.	అన్నమయ్య - తూము నృరసింహదాసు	- డా॥ ఎం.ఎస్.కె. పూర్ణచంద్	89
12.	అన్నమయ్య - ఆళ్వారులు	- ఆచార్య టి.యస్.గిరిప్రకాశ్	103
13.	అన్నమయ్య - సూఫీ కవులు	- జి.బి. శంకరరావు	111
14.	అన్నమయ్య - జయదేవుడు	- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ	119
15	అన్నమయ్య - పురుషోత్తంచౌదరి	- ఆచార్య టి. జయామనోహర్	131
16.	Kanakadasa and Annamacharya	- Prof. K.G. Narayana Prasad	141
17.	Annamacharya and Sant Tukaram	- Prof. Shobha Deshmukh	150
18.	Annamacharya- Purandaradasa	- Prof. V. Kamalamma	159
19.	Comparative study of works of Saint Namadev & Annamayya	- Prof. Geeta Suresh kate	169
20.	Annmacharya in Sanskrit Lyrics	- Dr. M. Vijayasree	183
21.	A Study of Annamacharya Sringara Sankeertanalu and Tyagaraja's Naukacharitram	- Ms. P. Jayalakshmi	192
22.	अन्नमाचार्य व श्रीचैतन्य के दार्शनिकता का तुलनात्मक अध्ययन	- Dr. Sheela Mishra	215
23.	सन्तशिरोमणि अन्नमाचार्य भक्तिकल्लोलिनी	- Dr. Chotelal Tripati	227
	నివేదిక	- ఆచార్య ఎమ్. చెన్నప్ప	242

1

అన్నమయ్య - త్యాగయ్య

ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి
తెలుగుశాఖాధ్యక్షులు,
ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

తెలుగు సాహిత్యంలో పదకవిత్వానికి ఒక ప్రత్యేకత ఉంది. పద్యకవిత్వం కేవలం పండితుల్ని మాత్రమే అలరిస్తుంది. పద కవిత్వం పామర జనులకు కూడా పారవశ్యాన్ని కలిగిస్తుంది. ఏ వాఙ్మయంలోనైనా పద్య కవిత్వం కంటే పద కవిత్వమే ముందుపుడుతుంది. ప్రాక్తన మానవుడు సుఖదుఃఖాది అనుభూతుల్ని పొందినపుడు, తదనుగుణంగా ఆడిపాడుకోవడం ద్వారా పద కవిత్వం ఆవిర్భవిస్తుంది.

తెలుగు వాఙ్మయ చరిత్రను తెలిపే గ్రంథాలు మనకు అనేకం ఉండగా, పద కవిత్వానికి సంబంధించిన గ్రంథాలు, పరిశోధనలు చాలా తక్కువగా ఉన్నాయి. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము అనే గ్రంథాన్ని రచించిన బాలాంత్రపు రజనీకాంతరావు గారు, 'తెలుగులో పదకవిత' అనే గ్రంథాన్ని రచించిన ఎస్. గంగప్పగార్ల కృషి ప్రశంసనీయమైనది. ఆచార్య ఎస్. గంగప్ప గారు తెలుగులోని పదకవిత్వ యుగ విభజనను సముచిత రీతిలో చేశారు.

తెలుగు పదకవిత్వంలో రెండు ప్రధాన యుగాలకు సారథులై నడిపించిన తాళ్ళపాక అన్నమాచార్యులు, త్యాగయ్యల జీవితాలు సాహిత్యానికే అంకితమయ్యాయి. వీరిరువురూ సంగీత సాహిత్యాలను జంట ప్రవాహాలుగా తమ సాహితీ ఝరిని నడిపించిన వాగ్గేయకారులు. కాలం వేరైనా అన్నమయ్య–త్యాగయ్యల లక్ష్యం ఒక్కటే. అన్నమాచార్య రచనలను సంకీర్తనలన్నా త్యాగయ్య కాలానికి వాటినే కృతులని వ్యవహరించినా వారి రచనల వెనుక ఉన్న పరమార్థం ఒకటే. సంగీతా సాహిత్యాల ద్వారా రసానందాన్ని కలిగించి జగత్తుకు హితం చెయ్యాలనే తపన వారి రచనల్లో అనేకచోట్ల కన్పిస్తుంది.

దేశి సంగీత ప్రబంధాలకు లక్షణం చెప్పడమే కాకుండా వాటికి లక్ష్యాలుగా అసంఖ్యాకమైన సంకీర్తనల్ని రచించి, పదకవితా పితామహునిగా ఖ్యాతి వహించాడు అన్నమయ్య. దేశి పలుకుబళ్ళు గ్రామ్య మధురోక్తులు శృంగార కీర్తనలలో ఎక్కువగా కన్పిస్తాయి. అన్నమయ్య వైరాగ్య కీర్తనల్ని మాత్రం గంభీరంగా ఉండాలని ఎక్కువగా సంస్కృతంలో రచించాడు. పదమనే పేరు అన్నమయ్య రచించిన సంకీర్తనతో సమానార్థకమే అయినా త్యాగయ్య నాటికి సంకీర్తన,కీర్తన, కృతి అనే పదాలు కూడా సమానార్థకాలుగానే వ్యవహరింపబడుతున్నాయి.

అన్నమయ్య 32 వేల సంకీర్తనల్ని రచించినట్లు చెప్తున్నట్లే, త్యాగయ్య కూడా 24వేల కృతుల్ని రచించాడని చెప్తారు. అన్నమయ్య సంకీర్తనల్లో ఉన్న లలితపదజాలం, ఉదాత్తమైన భావాలు, సదాశయాలు, నిత్యజీవితంలోనూ, సంభాషణలలోనూ వాడుకొనే లోకోక్తులు, సామ్యాలు త్యాగరాజు కృతుల్లోనూ దర్శనమిస్తాయి.

ఈరు దియ్యబేను వచ్చు (29-260)

'తల్లికి లేని ముద్దు దాదికా' (8-163) వంటి సజీవ భావబంధుర ప్రయోగాలను అన్నమయ్య ప్రయోగిస్తే త్యాగయ్య

"రూకలు పదివేలున్న చేరెడు నూకలు గతిగాని
కోకలు వెయ్యున్న కట్టుకొనుటకు ఒకటే గాని
ఊరేలిన తా పండుట మూడు మూరతావు గాని
నూరు భక్షణములిచ్చిన నోటికంతె గాని " మొదలగు ప్రయోగాలను తన కృతుల్లో ప్రయోగించాడు.

అన్నమయ్య - త్యాగయ్యలిద్దరూ లోకాన్ని బాగా దర్శించినవారే. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశానికీ అక్షరాకృతినిచ్చారు. ప్రజలలోని విషయలోలత, దాంభికాచారాలు. ధనవంతుల గర్వజీవితం, జారచోరాది దురాచారాలు, అసమానత, కపటవర్తనలు వంటివాటిని తమ కీర్తనలలో ఖండించారు. ప్రతివారు సంసారంలో ఉంటూనే, సదాచారాలను వర్జింపక, సత్ప్రవర్తనతో నియమనిష్ఠలతో ప్రవర్తిస్తూ భగవద్భక్తిని కలిగి ఉండాలని ఉద్బోధించారు.

"హరిపూజ హరి సేవ హరికీర్తనంబు
హరిమననము ధ్యాన మనిశంబుదనకు " అని చిన్నన్న పేర్కొన్న అన్నమయ్య

భక్తితత్వమే త్యాగరాజులోనే దర్శనమిస్తుంది.

" అనేక జగదాధారివి నీవనే మదిని నెరనమ్మితిగా నే

మనే వాడనోయి నీ మది నెంచనే వద్దనుచు నాతని వేదుర" - అని త్యాగరాజు తన తత్వాన్ని పేర్కొన్నాడు.

అన్నమయ్య ఆరాధ్యదైవం శ్రీ వేంకటేశ్వర్వరుడు తాను రచించిన కీర్తనలన్నింటినీ వేంకటేశ్వరునికే అంకితం చేశాడు. త్యాగరాజు ఆరాధ్య దైవం రాముడు. తన కృతుల్ని రామునికే సమర్పించాడు. అన్నమయ్య అనేక దేవతామూర్తుల్ని వర్ణించినా వారందరికీ వేంకటేశ్వరునితో అభేదాన్ని పాటించాడు. త్యాగయ్య అన్ని దేవతామూర్తులలోనూ రాముడ్నే దర్శించాడు.

భక్తితత్వం : ప్రాపంచికమైన బంధాల నుండి విముక్తిని కలిగించే దైవచింతనతో సన్మార్గంలో ప్రజలను నడిపించాలన్నదే అన్నమయ్య ధ్యేయం. నవవిధభక్తి మార్గాలు, ఆరాధనలు, వేదాంతపరమైన విషయాలకు అధిక ప్రాధాన్యాన్నిచ్చి రచించాడు.

" ఇంతకంటె ఘనమిక లేదు

సంతత సౌఖ్యము జనార్ధనుడే "

" వేడుకుందామా వేంకటగిరి వేంకటేశ్వరుని " - మొదలగు అనేక కీర్తనల ద్వారా భక్తి తత్వాన్ని ఉద్బోధ చేశాడు త్యాగయ్య.

" చక్కని రాజమార్గములుండగ

సందుల దూరనేల ? ఓ మనసా

చక్కని పాలు మీగడ యుండగ

చీయన గంగాసాగర మేల - అని చేసిన జ్ఞానబోధలో సన్మార్గాన్ని నిర్దేశించాడు.

అన్నమయ్య - త్యాగయ్య కృతుల్లో లోకజ్ఞత కన్పిస్తుంది. మనం నిత్యం చూసే అనుభవించే సంఘటనల్నే సంకీర్తనల్లో ప్రస్తావిస్తూ కనువిప్పు కలిగించేటటువంటి హిత బోధ కూడా చేశారు.

" నిధి చాల సుఖమా....

రాముని సన్నిధి చాల సుఖమా

నిజము తెల్పుము మనసా" - త్యాగయ్య

" ఊరకయే గల్గునా రాముని భక్తి
సారెకును సంసారమని జొచ్చి
సారమని ఎంచువారి మనసున " - అని త్యాగయ్య అంటే - అన్నమయ్య

"కడలుడిపి నీరాడగాదలచు వారలకు
కడలేని మనసునకు గడమ ఎక్కడిది"
ఇతరులకు నిను నెఱుఁగదరమా
సతత సత్యవ్రతులు సంపూర్ణ మోహ
విరహితులెఱుంగుదురు నిను నిందిరా రమణా" - అంటూ సంసార సాగరంలో చిక్కుకొన్న జీవికి భగవత్ స్వరూపాన్ని తెలుసుకోవడం అసాధ్యమేనన్నాడు.

అన్నమయ్య త్యాగయ్యలిరువురి కీర్తనలలోనూ సంకీర్తనా బాహుళ్యం కన్పిస్తుంది. త్యాగయ్య రచించిన కీర్తననలలో దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు, మేలుకొలుపు, పవ్వళింపు కీర్తనలు, మంగళహారతి కీర్తనలు, నీతిని బోధించు కీర్తనలు మొదలైనవి త్యాగయ్య కృతులలో ఉన్నాయి. మేలుకొలుపులు, సువ్విపాటలు, అల్లోనేరేళ్ళు, గొబ్బిపాటలు, జాజరలు, సోది, తుమ్మెద, చిలక, తందానలు, ఏల, కోలాటం, చందమామ, శోభనం, హారతి, నివాళి, ధవళ, ఉయ్యాల, లాలి, జోల, మంగళ, సాసముఖాలు, కూగూగులు, తాత్త్వికాలు, చాంగుబళాలు వంటి అనేక దేశి ప్రక్రియలకు చెందిన బాణీలను అన్నమయ్య రచించాడు.

అన్నమయ్యలోని శరణాగతి తత్త్వం త్యాగయ్య కృతుల్లోనూ కన్పిస్తుంది. త్యాగయ్యది ఆత్మాశ్రయ రీతి సొగసులు దిద్దుకొంది తనను తానే నాయికగా చేసుకొని శ్రీరాముని నాయుకునిగా భావించుకొని ముద్దిమ్మంటాడు. అన్నమయ్య వేంకటేశ్వరుడు, అలమేల్మంగలను నాయక- నాయికలుగా చిత్రీకరించి శృంగారకీర్తనల్ని రచించాడు.

త్యాగయ్య కీర్తనలలో కూడా అన్నమయ్య సంకీర్తనల వంటి నుడులు, జాతీయాలు ఎక్కువ.

" ఇలలోన సుఖము కలగన్న భాగ్యము
అనురాగములేని మనసున సుజ్ఞానము రాదు
అంబలి తిను వేళ అమృతమబ్బిన రీతి
ఎద్దునకేమి తెలియునటుకుల రుచి " - త్యాగయ్య.

అన్నమయ్య - జాతీయాలు :

" నీటిలో వ్రాత
ఏటిలో పైరు
చీకటి దవ్వుకొను
నీళ్ళు నములు " - మొదలగు అన్నమయ్య కొత్తగా కొన్ని పలుకుబడులను సొంతంగా తయారుచేశాడు కూడా.

" వరదం గలిపిన చింతపండు
వూరు వాడెడు చెలమ
జలధిలో వానలు " - అంటూ

సామెతలు :

" కుక్కకాటుకు చెప్పుటాట
విత్తొకటి వెట్టితేను వేరొకటి మొలుచునో
వెన్న చేత బట్టి నేయి వెదకినట్లు ....."

అన్నమయ్య శిష్ట వ్యవహారం, సామాన్య ప్రజావ్యవహారంలో ఉన్న భాషకు, గ్రాంథికానికి మూండింటికీ ప్రాధాన్యం ఇచ్చాడు. పండితుల్ని మెప్పించడానికి సంస్కృతంలో కొన్ని కీర్తనలు కూడా రచించాడు. జానపదుల్ని అలరించడానికి గ్రామ్యభాషను కూడా ప్రయోగించాడు. తెలుగు భాషలోని దేశిపదాలకు అధికంగా ప్రాధాన్యమిచ్చిన అన్నమయ్య వలెనే త్యాగయ్య కూడా తెలుగుభాషలోని సొగసులతో కీర్తనల్ని రచించాడు.

అన్నమయ్య - త్యాగయ్య ఇద్దరూ సంగీత సాహిత్యాలను భక్తి వేదాంతాలను సరిసమానంగా జీర్ణించుకొన్న ధీశాలులు. వీరిరువురి రచనలలోనూ విశాల దృక్పథం, కులమత భేద నిరసన, సాంఘిక దురాచారాల ఖండన, సమానత్వం, సమతావాదం, సంస్కరణాభిలాష,

లోకకళ్యాణం, జ్ఞానబోధ, చిత్తశుద్ధి, అశ్వాశ్వతమైన సుఖాలను విడిచిపెట్టమని బోధించడం, వంటి అనేక భావాలు సాదృశ్యంగా కన్పిస్తాయి.

వీరిరువురూ అనేక శాస్త్రాలను చదివిన పండితులే. త్యాగయ్య రచించిన ఘనరాగ పంచరత్నాలు, తిరువత్తియూరు పంచరత్నాలు, కోవూరు పంచరత్నాలు అతని పాండితీ ప్రకర్షను తెలియజేస్తున్నాయి. అన్నమయ్య కూడా వేదశాస్త్రాది విజ్ఞాన విశేషాంశాలెన్నింటినో తన సంకీర్తనల్లో పేర్కొన్నాడు.

అన్నమయ్య-త్యాగయ్యల జీవిత చరిత్రలో కూడా కొన్ని సామ్యాలు కన్పిస్తున్నాయి. అన్నమయ్య కాలం క్రీ.శ. 1408-1503. త్యాగయ్య కాలం 1867- 1947.

వీరిరువురి జీవితాలలో, ఆలోచనా విధానంలో భావపరంపరలో కూడా సాదృశ్యాలు కన్పిస్తున్నాయి. వంశపారంపర్యంగా పండిత కుటుంబాలలో జన్మించడం, భక్తితత్త్వం పుట్టుక నుండీ పరిమళించడం త్యాగయ్య జీవితంలో కన్పిస్తుంది. త్యాగయ్య తల్లి జయదేవుని అష్టపదులకు, పురందరదాసు, తాళ్ళపాక అన్నమాచార్యుల కీర్తనలను నేర్పి పాడించేది. ఈ విధంగా అప్పటికే సంకీర్తనా వాఙ్మయంలో జగత్ప్రసిద్ధి పొందిన అన్నమయ్య ప్రభావం త్యాగయ్యపై ఉండడం సహజం. అయితే ఎక్కడా అన్నమయ్య ప్రభావానికి లోనైట్లు కనబడక, స్వతః సిద్ధమైన రచన, మధురమైన భావుకత, సజీవ బంధురమైన భాషా ప్రయోగాలు మధురోక్తులు, స్వీయానుభవాలు ఇవన్నీ కలిసి త్యాగయ్యను అన్నమయ్య ప్రభావం నుండి వేరుచేసి స్వతంత్రంగా నిలబెట్టాయి. త్యాగయ్య కాలానికి అప్పటికే దక్షిణ భారతదేశంలో సంగీత ప్రాబల్యం అధికంగా ఉంది. త్యాగరాజుతో పాటు శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు కర్ణాటక సంగీత చరిత్రను సువర్ణాధ్యాయాలలో లిఖిస్తున్నారు. సంగీతరత్న త్రయమని, సంగీతత్రిమూర్తులని ఖ్యాతి వహించిన ఈ ముగ్గురిలో ఒకడైన త్యాగయ్య తన స్వతంత్రమైన ధాతుకల్పనాత్మకతను కీర్తనలలో ప్రకటించి తన ప్రత్యేకతను చాటుకొన్నాడు.

నారాయణమూర్తి, లక్కమాంబ దంపతులకు పుట్టిన అన్నమయ్య, సీతమ్మ, రామబ్రహ్మం గార్లకు పుట్టిన త్యాగయ్య ఇద్దరూ అవతారపురుషులే.

1. అన్నమయ్య విష్ణు ఖడ్గమైన నందకాంశతో జన్మిస్తే త్యాగయ్య వాల్మీకి, నారద, సరస్వతుల అంశతో జన్మించాడు. (వీరి తల్లిదండ్రులకు తిరువానూరు త్యాగరాజస్వామి స్వప్నంలో కనిపించి ఈ విధంగా చెప్పాడట.)

2. అన్నమయ్య తన 16వ ఏటనే వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొందాడు. త్యాగయ్యకు కూడా ఈ దివ్యపురుషుల సాక్షాత్కారం లభించింది. నారదుడే స్వయంగా యతివేషంలో వచ్చి స్వర్ణార్ణవమనే సంగీత గ్రంథాన్ని ఇచ్చినట్లుగా ప్రతీతి. రామసాక్షాత్కారం కూడా లభించింది.

3. తమ సంకీర్తనలను నరాంకితం చేయడానికి అన్నమయ్య, త్యాగయ్యలిరువురూ అంగీకరించలేదు. నరహరిని కీర్తించిన నోట నరుని కీర్తించనని అన్నమయ్య నిర్ద్వంద్వంగా చెప్తే త్యాగయ్య -

" నిధి చాలా సుఖమా ....
రాముని సన్నిధి చాల సుఖమా
నిజముగ తెల్పు మనసా ....
మమతా బంధనయుత నరస్తుతి సుఖమో
సుమతి త్యాగరాజ నుతుని కీర్తన సుఖమో.... " అని వివేచన చేశాడు.

ఇహలోక సౌఖ్యాల మీద ఆసక్తి లేకపోవడం, ఇరువురిలోనూ కన్పిస్తుంది. ఈ విషయంలో త్యాగయ్య ఘనత కొనియాడదగినది. ఎన్నో కష్టాలుపడుతూ జీవనాధారంలేని స్థితిలో కూడా రెండవ శరభోజి పంపిన కానుకలను తిరస్కరించిన నిరాడంబరజీవి మహాయోగి.

వీరిరువురిలోనూ కనిపించే మరొక సామ్యం క్షేత్రపర్యటన. అనేక దివ్యక్షేత్రాల్ని దర్శించి, అక్కడ ఉన్న అర్చామూర్తులపై కీర్తనల్ని రచించడమనే సామ్యం ఉంది.

అన్నమయ్య తన చుట్టూ ఉన్న రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలను, గుంటూరు, నెల్లూరు జిల్లాలను దర్శించి, ఆయా ప్రాంతాలలో ఉన్న దేవతలపై సంకీర్తనల్ని రచించాడు.

ఓగునూతల నృశింహుని,ఒంటిమిట్ట కోదండరాముని, కోన చెన్నకేశవుని, గాలివీడు వేంకటేశ్వరుని చింతకుంట చెన్నకేశవుని, తిరుమల వేంకటేశ్వరుని, తత్పరిసర దేవతా క్షేత్రాల్ని అనేకమైన వాటిని దర్శించాడు.

సంగీత, సాహిత్యం, జ్యోతిష్య మంత్ర శాస్త్రాలలో అపార పాండిత్యం కల త్యాగయ్యను కాంచీపుర పీఠాధిపతి ఆహ్వానించిన మీద త్యాగయ్య కంచిని దర్శించారు. దారిలో అనేక

క్షేత్రాలను, ఇంకా కోవూరు, నాగలాపురం, తిరుపతి, పుత్తూరు, ఘటికాచలం, నాగపట్టణం, శ్రీరంగం వంటి ప్రాంతాలను సందర్శించిన వారే.

ఇద్దరూ కారణజన్ములు కావడంలో చిరకాలం జీవించి సంగీత సాహిత్యాలకు పుష్టినిచ్చారు. వయోభారాన్ని కూడా లెక్కచేయక ఆశయ సాధన కోసం భక్తి ప్రచారం కోసం కృషి చేసిన ఘనత వీరిదే.

చరమ కాలంలో త్యాగరాజు కీర్తి మహావాగ్గేయకారునిగా పరమ భక్తాగ్రేసరుడైన దేశికునిగా తారాస్థాయికి చేరింది. శ్రీవేంకటేశ్వరునిలో ఐక్యమయ్యేంత వరకు రోజుకో కీర్తనను రచించి సమర్పించిన పదకవితా పితామహునిగా ఖ్యాతివహించాడు.

ఈ ఇద్దరి అవతారపురుషుల అవతార సమాప్తి సంగీత సాహిత్య జగత్తులో దివ్య జ్యోతుల్ని నింపింది. క్రీ.శ. 1503 (దుందుభి సంవత్సర, ఫాల్గుణ, బహుళద్వాదశి) న అన్నమయ్య - క్రీ.శ. 1847 (పుష్యబహుళ పంచమి రోజున త్యాగరాజు దివ్యధామాన్నలంకరించారు.

కాలాలు వేరైనా, ప్రాంతాలు వేరైనా సంగీతం ఒక వేదాంతమని, సాహిత్యం ఒక దివ్య ఔషధమని చాటి చెప్పిన ఘనత వీరిరువురిదే.

అన్నమయ్య కవిత సంగీత, సాహిత్య రంగాలలో సమానంగా ప్రాతినిధ్యం వహిస్తే, త్యాగయ్య కవితలో చక్కని సాహిత్యాంశాలున్నా, వాటిలోని సంగీత శిల్పం అధిక ప్రాచుర్యంలోనికి వచ్చింది. ఏది ఏమైనా వీరిరువురి కృషీ శ్లాఘనీయమైనదే. సమాజానికి సాత్త్వికోదయం కలిగించి సంస్కరించే మహదాశయం కలవి.

" సంగీతమపి సాహిత్యం
సరస్వత్యాః స్తన ద్వయమ్
ఏకమాపాత మధురం
అన్యదాలోచనామృతమ్ "

***

ఉపయుక్త గ్రంథసూచిక

1. అనంతకృష్ణ శర్మ రాళ్ళపల్లి - *ఆధ్యాత్మిక సంకీర్తనలు* - తి.తి.దే. ప్రచురణలు

2. ఆనందమూర్తి వేటూరి - *తాళ్ళపాక కవుల పదకవితలు భాషా ప్రయోగ విశేషాలు*
   ప్రభాకర ప్రచురణలు, హైదరాబాద్-1976.

3. గంగప్ప. యస్ - *తెలుగులో పదకవిత*
   శశీ ప్రచురణలు, శ్రీనివాసనగర్,
   గుంటూరు - 1983.

4. ప్రభాకరశాస్త్రి వేటూరి - *అన్నమాచార్య చరిత్రము, తి.తి.దే. 1949.*

5. శ్రీత్యాగరాజ కీర్తనలు - ఆంధ్రగాన కళాపరిషత్,
   రాజమండ్రివారి ప్రచురణ

6. *శ్రీత్యాగరాజ శతార్షికోత్సవ సంచిక* - ఆంధ్రగాన కళాపరిషత్,
   రాజమండ్రివారి ప్రచురణ

7. రజనీకాంతరావు బాలాంత్రపు - *ఆంధ్రవాగ్గేయకార చరిత్రము,*
   పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
   ప్రచురణ - 2001.

***

అన్నమయ్య - క్షేత్రయ్య

ఆచార్య ఎస్. గంగప్ప
విశ్రాంతాచార్యులు, నాగార్జున విశ్వవిద్యాలయం,
గుంటూరు

తెలుగులో ప్రప్రథమ వాగ్గేయకారుడు అన్నమయ్య. పదకవితా పితామహుడనీ, సంకీర్తనాచార్యుడనీ అన్నమయ్యకు బిరుదులున్నాయి. ఆ మహా వాగ్గేయకారుని తరువాత అంతటి గొప్ప పదకర్త క్షేత్రయ్య. అన్నమయ్య రాయలసీమకు చెందిన మహనీయుడు కాగా, క్షేత్రయ్య దివిసీమకు కీర్తి తెచ్చిన వాగ్గేయకారుడు. ఇద్దరిమధ్యా వందేళ్లు వ్యత్యాసం. అయినా అన్నమయ్య – క్షేత్రయ్యలలో సామ్యాలు, సాధర్మాలు అనేకం. భావంలో, భావనలో పదరచనా శిల్పంలో వర్ణనలో, అలంకార ప్రయోగంలో, భక్తి, రక్తి, మధురభక్తిలో, రసభావాలను వ్యంజించడంలో అత్యంత సన్నిహితంగా ఉంటూనే మరింత ముందుకు వెళ్లి అన్నమయ్య కంటే నూతన సాహిత్య సమ్మేళనంలో అభినయం జోడించిన అభినయవేత్త క్షేత్రయ్య.

మహా గేయ కవి జయదేవుడే 15 వ శతాబ్దంలో అన్నమయ్యగా, తదనంతరం వందయేళ్లకు క్షేత్రయ్యగా జన్మించినట్లు కీ.శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారి భావన. తెలుగు పదకవితా కన్యకు పితామహుడు తాళ్లపాక అన్నమయ్యగారంటిని. కాని జనకుడే క్షేత్రయ్య అని పేర్కొన్న కీ.శే. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారి మాటలు అక్షర సత్యం.

అన్నమయ్య 1408లో జన్మించి, 1503లో దివ్యధామం చెందిన మొదటి వాగ్గేయకారకుడు కడపజిల్లా తాళ్లపాకలో జన్మించి, కాలాంతరంలో శ్రీవేంకటేశ్వర స్వామి మహాభక్తుడై, తిరుమల తిరుపతిలలో నివసిస్తూ ఆస్వామి మీద శ్రీవేంకటేశ్వర ముద్రతో 32వేల సంకీర్తనలు రచించిన మహనీయుడు. అవి శృంగార సంకీర్తనలు, ఆధ్యాత్మిక సంకీర్తనలని రెండు విధాలు. అలివేలుమంగా, శ్రీవేంకటేశ్వరుల అలౌకిక శృంగారాన్ని అభివర్ణిస్తూ, ఆధ్యాత్మ సంకీర్తనల్లో ఆధ్యాత్మిక సంపదనంతా కలబోసి, శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలను ఆడపాడి,

తాను తరించి, ప్రజలను తరింపజేయడానికి సంకీర్తనా వాఙ్మయాన్ని సృష్టించిన మహా దార్శనిక స్రష్ట అన్నమయ్య.

క్షేత్రయ్య మొదటి పేరు వరదయ్య. కృష్ణాజిల్లా దివిసీమలోని మొవ్వలో 1590లో జన్మించి, 1675 దాకా జీవించినట్లు తెలుస్తుంది. మొవ్వలో వెలసిన మువ్వ గోపాలుని పై అదే ముద్రతో, దక్షిణదేశంలోని మధుర, తంజావూరు నాయక రాజుల ఆదరాభిమానాలకు, ఆ వెనుక గోల్కొండ పాదుషా గౌరువాదరాలకు పాత్రుడై అనేక వేలలో శృంగార పదాలు రచించినా, ఈనాడు మనకు మూడు వందల పైగా కొన్ని పదాలు లభిస్తున్నాయి. క్షేత్రయ్య యుగంలో నాటి నుంచి పదమంటే శృంగార పదమని ప్రఖ్యాతి లోకంలో లభించింది. కారణం క్షేత్రయ్య పదాలు కేవలం శృంగార పదాలు మాత్రమే.

అన్నమయ్య పదాలలోని భాష లలిత సుందరంగా ఉండి రసభావ కావ్యంజకమై సంగీతానికి ఒదిగినట్లు విదితమవుతుంది. తిక్కన తరువాత తెలుగుదనానికి అత్యంత ప్రాముఖ్యం ఇచ్చిన మహనీయుడు అన్నమయ్య. అంతకంటే పలుకు పలుకున తేనెలొలుక బలికిన క్షేత్రయ్య పదాల్లోని భాష మరింత మనోహరం, మధురమంజులం. ఈ మహా వాగ్గేయకారుల భాషలో తెలుగు పలుకుబడి, నుడికారం, ఉత్తరోత్తరం బలీయంగా, విశిష్టంగా ఉండడం విశేషం. ఈ వాగ్గేయకారుల భాషా సేవ అనన్య సామాన్యం. పద్య కవుల కంటే ఈ పద కవులు భాషలో సారళ్య, సౌలభ్యాలు సాధించారు.

పద్యకవిత రాజ గౌరవ పాత్రమై రాజ్యమేలుతుండిన రోజులలోనే అన్నమయ్య భక్తి, నీతి, వైరాగ్యాలతో బాటు ఆధ్యాత్మిక చింతనా పారవశ్యంతో ప్రజలను ప్రభోదించడం కోసం పద రచన చేసి వాగ్గేయకారుడుగా ప్రసిద్ధికెక్కాడు. పద్యంకంటే భక్తి ప్రబోధానికి పాట అనువైందని అన్నమయ్య గ్రహించాడు. అందుకే శృంగార పదాలు రచించినా అందులో మధుర భక్తిని సమన్వయించి, జీవాత్మ పరమాత్మలో సమైక్యం చెందడానికి అవసరమైన రీతిలో ప్రభోదించాడు. శృంగార సంకీర్తనల్లో నాయిక అంటే జీవుడు అన్నమయ్యగా, నాయకుడు భగవంతుడు శ్రీవేంకటేశ్వరునిగా భావించి, వివిధ విధాల శృంగార రీతులలో భక్తుడు భగవంతుని చేరడానికి చేసే ప్రయత్న రీతుల్ని అభివర్ణించాడు. ఆధ్యాత్మిక సంకీర్తనల్లో లోక వ్యవహార సముదాచార రీతుల్ని ఉదహరిస్తూ, వివిధ పద్ధతుల్లో భగవద్భక్తిని, సమాజంలో పాటించవలసిన ధర్మాన్ని, నీతిని, చివరి దశలో వైరాగ్యాన్ని పాటించే పద్ధతిని అన్నమయ్య

వేనోళ్ల వర్ణించి, వివరించి తరించాడు. క్షేత్రయ్య కేవలం శృంగార పదాలనే రచించినా, అందులో నాయికా నాయక పతిపత్నీ భావ- సముస్మేషణా శృంగారాన్ని వర్ణించినా, జీవాత్మ పరమాత్మల భావాన్ని మధురభక్తి పరిపూర్ణంగా రచించి, ప్రచారం చేసిన మహనీయుడు. మధుర, తంజావూరులలోనే గాక, దక్షిణ దేశం మొత్తంలో గోల్కొండలోనూ ఆంధ్రదేశమంతటా ఈ శృంగార పదాలకు ప్రచారం తెచ్చిన వాగ్గేయకారసత్తముడు క్షేత్రయ్య.

అన్నమయ్య పదాల్లో సాహిత్యం ప్రధానమూ, సంగీతం, గుణం, క్షేత్రయ్య పదాల్లో సంగీత సాహిత్యాలు సమ్మిళతమై, అభినయం ప్రధానమైంది. త్యాగయ్యలో సాహిత్యం సంగీత ప్రాధాన్యం వహించిందనే పెద్దల మాటల్లో సత్యముంది. కనుకనే తెలుగు జాతి అభినయం కూచిపూడి అభినయం క్షేత్రయ్య పదాభినయంతో పరిపుష్టమవుతున్న విషయం విజ్ఞులకు తెలిసిందే. అన్నమయ్య తదనంతరం రచించిన తక్కువ పదాల్లోనే క్షేత్రయ్య అధికంగా నూతన రాగాలను ప్రయోగించినట్లు సంగీతజ్ఞుల అభిప్రాయం.

ఈ మహావాగ్గేయకారులైన అన్నమయ్య- క్షేత్రయ్యల పదకవితా వైభవం సహృదయ రంజకమై, అత్యంత రసానందభూతుల్ని కలిగించి, పరమానందభరితుల్ని చేస్తుంది. పల్లవి, అనుపల్లవి సామాన్యంగా మూడు చరణాలతో పదం ఒప్పుతూ ఉంటుంది. ఒక్కొక్క పదమూ స్వయం సంపూర్ణమై రససంభరితమై, సహృదయ రంజకమై అనంతానందాన్ని కలిగిస్తుంది. అంటే ఒక్కొక్క పదమూ ఒక్కొక్క ముక్తకం. అన్నమయ్య అనేక పదాల్లో పల్లవి, మూడు చరణాలు ఉంటాయి. సకృత్తుగా అనుపల్లవి కనిపిస్తుంది. క్షేత్రయ్య పదాల్లో పల్లవి, అనుపల్లవి, మూడు చరణాలు ఉంటాయి. ఇది పదలక్షణాన్ని గూర్చిన సామాన్య లక్షణం. కేంద్ర బిందువులైన ఒక భావాన్ని పల్లవిలో ప్రారంభించి, అనుపల్లవిలో ద్విగుణీకృతంచేసి, చరణాల్లో రసభావాలను విస్తరింపజేసి, సహృదయ రం[illegible]కం చేసి, సంగీతంతో అభినయంలో పారవశ్యం చెందించడం ఏ పదంలో అయినా ముఖ్య విషయం.

పద రచనకు ఆద్యుడు అన్నమయ్య. తదనంతరం క్షేత్రయ్య ఆ మార్గంలో పదరచనలో పుష్టిని, తుష్టిని సాధించాడు. అయినా ఈ యిద్దరు పదకర్తల్లో సామ్యాలు గోచరిస్తాయి. వాటిని క్రమంగా పరిశీలిద్దాము.

నాయికా నాయక వర్ణనలో క్షేత్రయ్య సూక్ష్మాతిసూక్ష్మంగా తన ప్రతిభను ప్రకటిస్తూ పదరచన చేశాడు. విరహ జ్వాలతో బాధపడే నాయిక మానసిక స్థితి :

"ఏల వలచితినోయమ్మా ! ఎట్లా వేగింతునే కొమ్మా || పల్లవి ||
ఈలాగౌ తిరుగనైతి - యెదగిరి చెలువ రాయనిపై || అ. పల్లవి||
అన్నాహారములేదు నానబాలు తేనె చేదు...." || ఏల ||

అని విరహోత్కంఠిత అయిన నాయిక వేదనను అతి సూక్ష్మంగా వర్ణించాడు క్షేత్రయ్య.

ఇలాగే అన్నమయ్య నాయికా విరహాన్ని వర్ణించిన తీరు అమోఘం. నాయికా విరహాన్ని గూర్చి చెలులు నాయకునకు తెలపాలనుకొన్న అంశం ఈ కింది పదంలో వర్ణితం.

"ఇందు మీద పతిభావ మెట్లానో యేమా ...
విందుగా జెలువునకు విన్నవించవే ...... || పల్లవి ||
కోకిల కూతకుగానే గుండెజల్లురనె చెలి
పూవక పూచినయట్టు పులకించె
మావి నుండి అంతలోనే మదనభూతము సోకె...
పోవులైన పుప్పొడినే పోయరేబడిమ || ఇందు ||

కుపిత అయిన నాయక చెలులతో నాయకుని గూర్చి చెప్పిన రీతిని ఇద్దరు పదకర్తలు వర్ణించిన తీరు గమనించ దగ్గ విషయం.

క్షేత్రయ్య : *"అడుగరమ్మా యతని పై నేనూరక అలిగినానటరే !*
పదుచు తనము నూని మువ్వగోపాలు రాయుని ఆన బెట్టి ||అడుగురమ్మ ||

ఇదే రీతిలో అన్నమయ్య పదం గమనించగలం.

అన్నమయ్య : *"ఏది నిజమని మీరు యెట్టు వొడబడి ంనారే*
ఆది నుండి యీ కతలు అడుగరే యాతని...."

క్షేత్రయ్య మనోజ్ఞ పద రచనలో మహాశిల్పి. నాయకుని రతి యనంతరం వేషాన్ని తిలకించిన నాయక ఆయన అన్యకాంత భోగ చిహ్నాలను చూసి, తన సరసకు చేరకుమని తోసి పుచ్చుతూ అంది ఈ పదంలో....

" చాలు చాలు ఈ చిన్నెలతో నాదు సరసకు జేరకుర ... || పల్లవి ||
చాలు ఈ చిన్నెలు సాగవు నా వద్ద మువ్వగో
పాలా ! భామ వద్దికే పోర
కన్నుల వీడెముతో కాటుక మోవితో
వెన్నున కీల్జడ వేటుతోను
కన్నియ సంపుల గాజుల నొక్కులతోను
వన్నెకాడ నుదుటను నున్న లత్తుకతోను.... || చాలు ||

నిద్దుర మబ్బుతోను నిందు బదలికతోను
ముద్దియ కలసిన ముదముతోను
నిద్దంపు చెక్కిళ్ళ నెలవంకలతోను
వద్దురా పద్దులు వగకాడ నాతోను.... || చాలు ||

అల దాని కుచముల నలదిన జవ్వాజి
కలయర స్థలము నూగంటి నన్నంటరాకు
బలిమి చేసే వల చాలు మువ్వగోపాల
అల నాడె గూడిన చెలిమి పదివేలు.... || చాలు ||

– ఈ క్షేత్రయ్య పదానికి మూలమేమో అనదగ్గ అన్నమయ్య సంకీర్తన పరిశీలనార్థం.

' ఎవ్వరు నెరుగరంటా యేల బొంకేరు
నవ్వేరు మిముజూచి నలినాక్షు లెల్లను ... || పల్లవి ||
చెలియ నుదిటి మీద చిన్నారి కస్తూరి బొట్టు
చెలువు మీరగ నీ చెక్కుల నంటె
నిలువు నామము నీది నెలత నుదుట నంటె
తల కొన్న గురుతులు తారుమారు లాయను.... ||ఎవ్వరు ||
కాంత కన్నుల బెట్టిన కాటుకెల్లా నీ మోవి
ఎంత బాగులై నేడు వెలసున్నది
రంతులు నీ బాహుపురి రమణి సందిట జిక్కె
యింతలోనే మీ చేత అవ్వలవ్వ లాయను.... " || ఎవ్వరు ||

సరి నలమేల్మంగ చరణముల లత్తుక
పొంది నీ వురమున జూపెట్టెను.....
గరిమ శ్రీవేంకటేశ కౌస్తుభమింతికి సొమ్మై
దొర సె మీ వలువుల తోడు నీడ లాయను ... ॥ ఎవ్వరు ॥

అన్నమయ్య పదాన్ని ఎదుటబెట్టుకొని క్షేత్రయ్య పదరచన చేశాడా అన్నంత సన్నిహితంగా ఉందీ రచన. భావం, భావన, ప్రతిభ, ప్రయోగం అన్ని విధాలా కుదిరి, సమాన స్థాయిలో ఆ మహా వాగ్గేయకారుడొకడేనా అన్నట్లుండడం అబ్బురం గొలిపే అంశం. అయితే అన్నమయ్యలో వాచ్యం పాలు ఎక్కువ. క్షేత్రయ్యలో వ్యంగ్యం, ధ్వని ఉన్నాయి. అన్నమయ్య భాషకంటే క్షేత్రయ్య భాషలో లాలిత్యం, సారళ్యం ఉన్నాయి. అది ఆ మహా వాగ్గేయకారుల్లో కనిపించే ప్రతిభా పాటవం; పదరచనా వైభవం. సహృదయ రంజకమై అనంతానందాన్ని కలిగిస్తూ వారి వారి గొప్పదనం వ్యక్తమవుతుంది.

ఇద్దరు వాగ్గేయకారుల్లో రత్యనంతరం నాయకుల వేషాన్ని గూర్చి తెలుసుకొన్నాం. ఇలాగే రత్యానంతర నాయికా దర్శనమిద్దరు పదకర్తలు చేసిన తీరు అనన్య సామాన్యం. అయితే క్షేత్రయ్య నాయికా కేళికా మందిరం వదలి వెళ్లినట్లు వర్ణిస్తే, అన్నమయ్య నాయిక పరవశించినట్లు చిత్రించాడు. ఇక్కడ కూడ పదవచనంలో సామ్యం గోచరిస్తుంది.

క్షేత్రయ్య :

"మగువ తన కేళికా మందిరము వెడలెన్
వగకాడ మాకంచి వరద తెల్ల వారెననుచు .... ॥ పల్లవి ॥
విడజారు గొజ్జంగి విరిదండ జడతోను
కదు చిక్కువడి పెనగు కంట సరితోను
నిదుద కన్నుల గేరు నిదుర మబ్బుతోను
తొదరి పదయుగమున తడబడెదు నడతోను.... ॥మగువ॥

ఇది క్షేత్రయ్య అత్యుత్తమ పదాల్లో ఒకటి. దీనికి మూలమా అన్నట్లున్న అన్నమయ్య పదం పరిశీలించదగింది.

అన్నమయ్య :

"పలుకుదేనెల తల్లి పవళించెను
కలికి తనముల విభుని గలిసినదిగాన ॥ పల్లవి ॥

నిగనిగని మోము పై నెరులు గెలకుల చెదర
పగలైనదాక దరిజెలి పవళించెను.....
తెగని పరిణతులలో తెల్లవారిన రాక
జగదేకపతి మనసు జుట్టి గొనె గాక ” ॥ పలుకు॥

ఇలాగ అన్నమయ్య – క్షేత్రయ్య ఇద్దరు వాగ్గేయకారులు నాయకా చిత్రాన్ని నాయకుడు చిత్రించు చోట భ్రమతో మరచిపోయి మనోజ్ఞమైన నిర్మలానురాగం పదాలలో చిత్రించిన అక్షర చిత్రకారులు ఈ వాగ్గేయ కారులనడంలో సందేహంలేదు.

క్షేత్రయ్య :

“ఏమి చేయుదు మోహమెటువలె దీరును ॥పల్లవి ॥
భామనీ మణిని యెవ్వరుతోడి తెచ్చేరు ॥ అ.పల్లవి ॥

వెలది నీదు ముఖారవిందంబు లిఖియించి
అలరు వాసనలు వ్రాయగనేర నైతి
కళలొల్కు నీమోవి గదను వ్రాసితిని గాని
నెలత తేనియలుంచ నేర నైతి ॥ ఏమి ॥

అన్నమయ్య :

“ఒకటికొకటియాననుండ జెలి భావిమిది
మొక యెదుటనె నన్ను మోవ వ్రాసెనే ॥ పల్లవి ॥

పొలతి కురులు వ్రాయబోతే తుమ్మిదలాయ
తలకుండ మోము దమ్మి వ్రాసి, నే
కలిగి కన్నులు వ్రాయగ గండు మాలైపొడచూపె,
చెలవచెమాట నీటి చెక్కులు వ్రాసి నే ॥ ఒకటె ॥

ఇలాగ సమాన భావాల వ్యక్తీకరణ గల పదరచన చేసిన ఆ మహావాగ్గేయకారుల ప్రతిభా పాటవాలు అనన్య సామాన్యం; తదనంతరం వెలసిన వాగ్గేయకారులు రామదాసు, సారంగపాణి, త్యాగరాజు మొదలైన తెలుగు వాగ్గేయకారులకు ఆదర్శప్రాయులు.

ఈ మహాపదకవులు శృంగార సంకీర్తనలను పోల్చిచూడడం జరిగింది. కారణం క్షేత్రయ్య కేవలం శృంగార పదాలు మాత్రమే రచించడం వల్ల అన్నమయ్య శృంగార పదాలతో పాటు ఆధ్యాత్మిక సంకీర్తన రచనచేసి భక్తి నీతి వైరాగ్యాలతో ఆధ్యాత్మికతను ప్రబోధించారు.

కాగా అన్నమయ్య- క్షేత్రయ్యల భాష, పదాల ప్రయోగాలు సమానంగా ఉండడం మరో విశేషం. మంచి మేళము, తరితీపు, మోవనాడవద్దు, దక్కగొను, అసురసురను, చెరగుమాసిన, పొంచు వేల వినేకే వదరక, మోదతోపు, యెమ్మెలు, ఎటువంటి వలపొ, మాయికి మాయి, మంకు జేసి చెల్లి తనము, ఇన్నాళ్లవలె గాదమ్మా, ఆయనాయ, సేవాసేవా మొదలైన పదాలు పలు పదాల్లో ప్రయోగించి, ఎంతో విశిష్టతను సాధించారీ వాగ్గేయకారులు.

ఈ విధంగా అన్నమయ్య- క్షేత్రయ్యలు ఉత్తమ వాగ్గేయకారులుగా ప్రసిద్ధికెక్కారు. క్షేత్రయ్య- అన్నమయ్య అంతటి వాగ్గేయకారుడనడం కంటే కొన్ని అంశాలలో అన్నమయ్య కంటే క్షేత్రయ్య ఒకమెట్టు అధిగమించాడన్న తప్పులేదు. సంగీతంలో సాహిత్యంలో, అంతకంటే అభినయంలో క్షేత్రయ్య విషయంలో ఇది వాస్తవమనిపిస్తుంది. పూర్వోక్తమైనట్లు క్షేత్రయ్య ఎన్నో అపురూప రాగాల్ని వాడుకచేసి, అన్నమయ్య తరువాత సంగీతానికి తుష్టిని, పుష్టిని చేకూర్చాడు. అన్నమయ్య సంకీర్తనల్లో అణగి ఉన్న అభినయం, క్షేత్రయ్య శృంగారపదాల్లో ప్రాముఖ్యానికి వచ్చింది. తద్వారా క్షేత్రయ్య అభినయాచార్యుడయ్యాడు. దీనికి కారణం సమకాలికంగా ప్రసిద్ధిపొందిన కూచిపూడి నాట్యం కావచ్చు. నారాయణతీర్థుల తరంగాలు, క్షేత్రయ్య పదాలు కూచిపూడి నాట్యంలో ఒక భాగమని మనందరికి తెలిసిందే. అయినా వయసులో కొంత పెద్దవాడైన నారాయణతీర్థులు, వయసులో కొంత చిన్నవాడైన కూచిపూడి నాట్య స్రష్ట సిద్ధేంద్రయోగి, క్షేత్రయ్యకు సమకాలికులు, దివిసీమవాసులు కావడం ఇందుకు కారణం కావచ్చు. ఏమైనా అన్నమయ్య పదకవితా పితామహుడు, క్షేత్రయ్య పదకవితా చక్రవర్తి. అన్నమయ్య-క్షేత్రయ్యలు ఆంధ్ర మహావాగ్గేయకారుల్లో అమరులు.

***

3

అన్నమయ్య
తరిగొండ వెంగమాంబ

ఆచార్య కె.జె.కృష్ణమూర్తి,
తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు, తి.తి.దే.
తిరుపతి

"కలౌ వేంకట నాయకః" – అని ప్రశస్తిగాంచిన వేంకటరమణుని భక్తాగ్రణ్యుల్లో పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యులది అద్వితీయమైన స్థానం. ఆ శ్రేణిలో ఆ హరికీర్తనాచార్యుని అనంతరం పేర్కొనదగిన మహిత సాహితీమూర్తి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ.

వాఙ్మయప్రపంచంలో సమున్నత శిఖరాలను అధిరోహించిన ఈ యిరువురు సారస్వత మూర్తులను తులనాత్మకంగా సరిపోల్చిచూడటం ద్వారా వారివురి వైశిష్టం సుస్పష్టరేఖలతో సాక్షాత్కరించి, ఆధ్యాత్మిక సాహితీ రసజ్ఞులెల్లరకు స్ఫూర్తిదాయకంగా అరారుతుంది.

తాళ్ళపాక అన్నమాచార్యులు క్రీ.శ. పదునైదవ శతాబ్ది ప్రారంభంలో కడప మండలంలోని తాళ్ళపాకలో జన్మించాడు. తరిగొండ వెంగమాంబ ఒకప్పటి కడప మండలానికి చెందిన, నేటి చిత్తూరు జిల్లాలో తరిగొండలో క్రీ.శ. 1730లో జన్మించింది. అన్నమాచార్యుని తల్లిదండ్రులు తిరుమల యాత్ర కావించిన అనంతరం శ్రీస్వామివారి నందక ఖడ్గం యొక్క అంశతో అన్నమయ్య అవతరించినట్లే, వెంగమాంబ తల్లిదండ్రులు తిరుమలకు వెళ్ళి వచ్చిన అనంతరం వెంగమాంబ జన్మించింది. ఈ యిరువురు నందవర శాఖీయులై ఉండటం మరొక చారిత్రక విశేషం.

ఇరువురికీ దైవానుగ్రహం కారణంగానే విద్యలు లభించాయి. ***"అన్నమాచార్యుని కహినాయకాద్రి వెన్నుని వరముచే విద్యలన్నియును అమితంబులగుచు జిహ్వారంగ సీమ తమ దాముసొచ్చి నర్తనమాడ దొడఁగె"*** – అని చిన్నన్న 'అన్నమాచార్య చరిత్రము'లో రచించి యున్నాడు. ఇదే రీతిగా తరిగొండ వెంగమాంబ వేంకటాచల మహాత్మ్యకావ్యంలో సరస్వతీ దేవి అక్షరాల రూపంలో సాక్షాత్కరించి తన ముఖంలో ప్రవేశించినట్లు పేర్కొన్నది.

"అలఘునభంబు నుండి విమలాక్షర పంక్తుల రీతి వచ్చి నే
నలసతc జెందియున్న తతీ నాననమందు వసించి, జ్ఞానమున్
కలుగcగc జేసి, మానస వికారములన్ తొలcగించి, జిహ్వపై
నిలిచి నటించు శారదను నిత్యము సన్నుతిసేయుచుండెదన్ "
"అక్షీణాక్షర పంక్తిరీతి మును మధ్యాహ్నంబునన్ నాకుc బ్ర
త్యక్షంబై గురు నాది పూరుషునిc బ్రత్యక్షంబు గావించి, చిత్
సాక్షే బ్రహ్మమటంచుc జూపుచు, తదర్థంబున్ కృపంజెప్పి నన్
రక్షింపన్ పనిcబూను భారతిని గీర్వాణిన్ ప్రశంసించెదన్ "

ఇరువురును దైవికమయిన ఒకానొక ఆకస్మిక సంఘటన మూలంగా తిరుమల క్షేత్రాన్ని చేరుకొన్నారు. పొలంలో పశువులకు గడ్డికోస్తూవుండగా కొడవలి తగిలి వ్రేలు తెగిన బాధతో విరక్తుడైన అన్నమయ్య, ఆ సమీపంలో తిరుమలక్షేత్రానికి వెళ్లుతూవుండిన పరుసల వెంట తిరుమల చేరుకొన్నాడు. వెంగమాంబ తరిగొండ గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో గల ఆంజనేయ విగ్రహం వెనుక యోగ సమాధి లీనయై ఉండగా ఆలయార్చకుడు ఆగ్రహంతో ఆమె తలవెంద్రుకలను పట్టుకొని యివతలకు లాగినాడు. ఆ బాధతో ఆమె సమాధిభంగమై, తరిగొండ లక్ష్మీ నృసింహుడే తనను వెళ్లిపొమ్మన్నట్లుగా ఆ సన్నివేశం ద్వారా ఆజ్ఞాపించినట్లు భావించి, ఆమె అడవిదారులగుండా ఒంటరిగా తిరుమల క్షేత్రం చేరుకొన్నది.

అన్నమయ్య తిరుమలలో ఘనవిష్ణువనే యతీశ్వరునిచే శ్రీవైష్ణవదీక్షను స్వీకరించినట్లే, వెంగమాంబ తిరుమలలో హయగ్రీవ మంత్రోపదేశాన్ని పొందింది.

అన్నమయ్య దేశకాల పరిస్థితులననుసరించి, సాళువ నరసింహరాయల ఆగ్రహానికి గురియై, శ్రీవేంకటేశ్వరుని దివ్యానుగ్రహం వల్ల ఇక్కట్టులను అన్నిటినీ అధిగమించినట్లే, వెంగమాంబ పుష్పగిరి పీఠాధిపతి మొదలుకొని, అర్చకుల పెద్దయైన అక్కారాం వెంకట్రామదీక్షితుల వరకు అనేకులచే జీవితంలో చాలా బాధలను పొందినది. ఇందువల్లనే 'శ్రీకృష్ణమంజరి' అనే స్తోత్రంలో -

''చెలరేcగి నాకు వచ్చిన యాపదలకు పరcగ నీవుండcగా బ్రదికితి కృష్ణ !

తల్లిదండ్రులు సహోదరులైన లీల నీ కరణి లాలింపరే! కృష్ణ !!" - అని ఇష్టదైవానికి విన్నవించుకొన్నది.

వెంగమాంబ తిరుమల చేరిన తొలినాళ్లలో అప్పటి మహంతు ఆత్మారాందాస్‌జీ ఆమె నివసించటానికి ఒక కుటీరాన్ని ఏర్పాటుచేయించి, స్వామివారి ఉగ్రాణం (కోవెల వీధి) నుండి వకుళమాలిక పేర 'హూరవెచ్చం' - అనే నెలసరి బత్యాన్ని పంపే ఏర్పాటు కావించారు. తరువాత కొన్నాళ్లకు తాళ్ళపాక చిన్నన్న వంశీయులు తమ యింటి ప్రక్కన ఉన్న చిన్న యింటిని ఆమెకు ఉచితంగా ఇచ్చి సత్కరించారు.

వెంగమాంబ అన్నమాచార్యులవలెనే దైవ దత్తమయిన వాక్శుద్ధి, వాక్సిద్ధి కలది. ఈ విషయమై ఈ మహనీయులిద్దరి జీవితగాథల్లో ఎన్నో నిదర్శనాలు గోచరిస్తూవున్నాయి.

తాళ్ళపాకవారి ఇంటి ప్రక్కన చేరటంతో వెంగమాంబకు ఆ వంశకవీశ్వరులైన అన్నమాచార్యులు, పెదతిరుమాలాచార్యులు, చినతిరుమలాచార్యులు, చిన్నన్న, అన్నమాచార్యుల ధర్మపత్ని తిమ్మక్క మున్నగువారల రచనలను పరిశీలించే సదవకాశం స్వామి సంకల్పంగా లభించింది.

తిమ్మక్క రచించిన 'సుభద్రాకల్యాణం' అనే కృతిచేత ప్రేరణను పొంది, వెంగమాంబ 'రమా పరిణయ'మనే కమనీయమైన పెండ్లిపాటను ద్విపదలో రచించింది. అలాగే అన్నమయ్య రచించిన 'శృంగార మంజరి' యొక్క శైలిలోనే భక్తిరస భరితంగా 'శ్రీకృష్ణమంజరి' అనే కమనీయ స్తోత్రాన్ని వెంగమాంబ రచించింది.

అన్నమయ్య విరచించిన ఆధ్యాత్మిక సంకీర్తనలను, శృంగార సంకీర్తనలను అనుసరించి, పదకవితలను ఆశువుగా అల్లే నైపుణ్యం ఉన్నప్పటికీ, వెంగమాంబ ఆ ప్రయత్నం చెయ్యలేదు. ఇందుకు రెండు కారణాలు : ఒకటి - అన్నమయ్య సంకీర్తనలపై వెంగమాంబకు గల భక్తిభావం, రెండవ కారణం - వేంకటేశ్వరస్వామియే అన్నమయ్యతో ఇలా పల్కినాడట! "భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలింపనని ప్రతిజ్ఞాపించె" - ఈ వాక్యాలు అన్నమయ్య దౌహిత్రుడైన రేవణూరి వేంకటార్యుడు రచించిన 'శకుంతలా పరిణయ' మనే అముద్రిత ప్రబంధం యొక్క అవతారికలో ఉన్నాయి. ఈ అభిప్రాయాన్నే అన్నమయ్య పౌత్రుడైన చినతిరుమలార్యులు 'సంకీర్తన లక్షణం' లోని ఈ క్రింది పద్యంలో ప్రకటించియున్నాడు.

క. నక్తంచరారి తనకును భక్తుండైనట్టి తాళ్లపాకన్నయచా
టూక్తి పదబంధ కవితారక్తుండై ఇతర వాగ్విరక్తుండయ్యెన్ - అని

శ్రీస్వామివారు అన్నమయ్యతో పల్కియుండిన పై నిర్ణయాన్ని తిరుమలలో శిష్ట పరంపర వల్ల చక్కగా గుర్తించియుండిన సుజ్ఞాని తరిగొండ వెంగమాంబ.

అయితే ఈ కవయిత్రి తాను రచించిన యక్షగానాల్లో తాళ్ళపాకవారి భజన సంప్రదాయ పద్ధతికి చెందిన సంకీర్తనలను - నారాయణ ! తే నమో నమో, శరణు శరణు సురేంద్ర సన్నుత ! శరణు శ్రీ సతి వల్లభా - వంటి బాణీలను సమర్థవంతంగా అనుసరించింది. అలాగే అన్నమయ్య ద్విపదలో నూతనంగా రామాయణ కావ్యాన్ని రచింపగా, వెంగమాంబ ద్విపదలోనే 'వాసిష్ఠ రామాయణాన్ని' వెలయించింది.

అన్నమాచార్యులు సంస్కృతంలో వేంకటాచల మహాత్మ్యాన్ని రచింపగా, వెంగమాంబ తెలుగులో వేంకటాచల మహాత్మ్యమనే ఆఱాశ్వాసాల పద్యకావ్యాన్ని అవతరింపజేసింది. ఈ కావ్యం యొక్క అవతారికలో ఈ కవయిత్రి పూర్వ కవీశ్వరులను స్తుతించే సన్నివేశంలో అన్నమయ్యను ప్రాచీన మహాకవుల పంక్తిలో విశిష్టంగా పేర్కొన్నది. ఆ పద్యమిది :

సీ. *ఆది కవీశ్వరుడైన వాల్మీకి కి*
వ్యాసమౌనికిఁ గాళిదాస కవికి
అరయంగ వర లబ్ధ మన్నమాచార్యున
కాంధ్రభాషా కవిత్వాఢ్యులగుచుఁ
దనరు నన్నయకుఁ దిక్కన సోమయాజికిఁ
బోతరాజునకు, సునీతులయిన
కవులకుఁ బండితాగ్రణులకుఁ, బౌరాణి
కులకు భక్తిని మ్రొక్కి కొనుచు నేను

తే.గీ. *వేంకటాచలమహాత్మ్య విభవములను*
పద్యఫణితిని రచియించి భక్తి మెఱయ
శ్రీనివాసుని పాదరాజీవములకుఁ
బొసఁగ నర్పింతు మోక్షంబు పొందు కొఱకు

పై సీస పద్యంలో అన్నమయ్యకు సంస్కృత కవులకు పిమ్మట తెనుగు కవులకు ముందు "వరలబ్ధము" అనే సార్థకమైన విశ్లేషణంతో వెంగమాంబ ప్రశంసించింది. అంటే, అన్నమాచార్యుడు శ్రీవేంకటేశ్వర వరలబ్ధమైన సంస్కృతాంధ్ర కవితా ప్రావీణ్యంగల మహాకవియని వెంగమాంబ అభిప్రాయమైనట్లు వెల్లడౌతున్నది. ఈ కవయిత్రి గాక, ఇంకొకరెవ్వరూ అన్నమయ్యను ఇలా పూర్వకవిగా స్తుతించినవారు లేరనేది ఇచ్చట గమనించ

దగిన సత్యం! చిట్టచివరిదిగా ఈ యిరువురు సాహితీ మూర్తుల వినయ శీలాన్ని వెల్లడిస్తూ వున్న ఒకానొక సన్నివేశం ముఖ్యంగా ఈ సందర్భంలో పరికింపదగినది.

ఇది వేంకటేశ్వరుడు అన్నమయ్యతో సంభాషించిన సన్నివేశం. చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్రలోనిది. వేంకటేశ్వరస్వామి అన్నమాచార్యులతో ఇలా పల్కినాడట!

"ఆ కృష్ణమాచార్యు నధ్యాత్మ వినుతి
రాక గొన్నాళ్లు విరక్తుండనైతి
జగతి నీ శృంగార సంకీర్తనముల
కగపడి మంచి ప్రాయపువాడనైతి -
నని వేంకటేశ్వరుఁ డన్నమాచార్యుఁ
గనుఁగొని వాక్రుచ్చి గౌరవించుటయు -
వేదముల్ పొగడ కోవిదులు నుతింప
ఆ దేవతలు కొనియాడ గోవింద !
నే నిన్నుఁగొనియాడ నెంతటివాఁడ ?
నా నేర్పు, నీ నేరు పరసి చూచినను
పలికెడు వీణలోపలి చక్కఁదనము
పలికించునతనిదై పరఁగిన రీతి "

అని వినుతించి అయ్యంబోదరుని ఁ
దనుఁగన్న తండ్రి నెంతయు మెచ్చఁజేసి ॥

పలికే వీణలోపలి శ్రావ్యమైన చక్కదనం వీణను పలికించే వాడిదే కాని, ఆ వీణకు స్వతంత్రంగా పలికేశక్తి లేదు - అని అభిప్రాయం. ఇటువంటి భావాన్నే వెంగమాంబ వేంకటాచల మహాత్మ్యంలో ఇలా ప్రకటించింది.

"దారు నిర్మిత వీణ నారూఢిఁ బలికించు
గాయక పురుషుని కరణిగాను
పురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నా జిహ్వ
యందుఁదా వసియించి యరుదుగాను
పలికించుఁ గావున భాగవతపురాణ
మమర నే ద్విపద కావ్యంబుగాను
ద్వాదశస్కంధముల్ తగఁజెప్పి హరికి స
మర్పించి, శ్రీవేంకటాద్రి మహిమ "

పై సీస పద్య పంక్తులు "పలికెడిది భాగవతమట! పలికించు విభుండు రామభద్రుండట!" - అనే బమ్మెరపోతనామాత్యుని అభిప్రాయాన్ని జ్ఞాపకపరుస్తాయి.

అన్నమయ్య అహోబల నృసింహుణ్ణి తిరుమల వేంకటేశ్వరుణ్ణి అభేద భావనతో ఆరాధించగా వెంగమ్మ తరిగొండ లక్ష్మీనృసింహస్వామికి, తిరుపతి వేంకటేశ్వరునకు అభేదంగా తన రచనలను అంకితం కావించింది.

'వేంకటేశ్వరుడే నా పతి' - అనే విశ్వాసంతో ఆది నుండీ విరక్తిలో రక్తిని పొందిన మహాత్మురాలు వెంగమాంబ ! మధురభక్తికి సంబంధించిన ఈ నాయికా భావనవల్లనే "నీవు నా స్వామివి, నీ సొమ్ము నేను; కావున బాధ్యమెక్కడఁబోదు కృష్ణ" - అని ఈ కవయిత్రి త్రికరణ శుద్ధిగా ప్రకటింపగల్గినది! ఉదాత్తమైన ఈ నాయికా భావనకు అనుగుణంగా, ఆమె భర్త పేరు కూడా 'వేంకటాచలపతి' యే అయివుండటం ఒక విశేషం ! ఇక అన్నమాచార్యుడు గృహస్థుడుగా ఉంటూనే, ఐహిక విరక్తితో భగవదనురక్తిని అనుభవమునకు తెచ్చుకొన్న మహానుభావుడు!

అన్నమాచార్యులు తన సంకీర్తనలచే శ్రీస్వామి వారి కొలువులో హరికీర్తనాచార్యుడుగా నెలకొనగా, వెంగమాంబ బంగారు వాకిలికి అల్లంత దూరాన్నుండే నిలుచుండి, ఆ గురుశేషగిరివాసుణ్ణి ప్రసన్నుణ్ణి గావించుకొని, తాను సృజించిన సువిశాల సారస్వతంలో ఆ దేవ దేవుణ్ణి సుప్రతిష్ఠితుణ్ణి కావించింది.

ఒక్కమాటలో, ఈ యిరువురు సాహితీమూర్తులు ప్రజల కొఱకై, ప్రజానీకానికి సుబోధమయ్యే భాషలో సహజశైలిలో కవితా సృష్టికావించిన ప్రజాకవులు.

ఇరువురూ జీవితంలో సహస్ర చంద్ర దర్శనం కావించిన పరమ భాగవతోత్తములు. అలాగే జీవితంలో అత్యధిక కాలం తిరుమల క్షేత్రంలో నివసించి, సారస్వతసృష్టిచే స్వామి నారాధించి, ఆ పుణ్యక్షేత్రంలోనే సిద్ధి పొందినారు.

అన్నమయ్య సృజించిన సారస్వతంలోని ప్రతిపదము స్వామివారి కర్పించిన సంపెంగ పూవు; అలాగే వెంగమాంబ సృష్టించిన వాఙ్మయంలోని ప్రతి పలుకూ శ్రీనివాసునికి సమర్పించిన తులసీదళం! శ్రీవేంకటేశ్వర స్వామి యొక్క కోమల దరహాసం (లేలేత చిఱునవ్వు) ఈ యిద్దరి సాహితీ సృష్టికీ స్ఫూర్తి కేంద్రం.

శ్రీవేంకటేశ్వరస్వామి వారి నిత్య సేవలలో చిట్టచివరిది 'ఏకాంత సేవ' . ఈ సేవ ఆధారంగానే "తాళ్ళపాకవారి లాలి; తరిగొండవారి హారతి" - అనే సూక్తి ఆవిర్భవించింది. ఈ సూక్తి యందలి మొదటి భాగానికి అన్నమయ్య మూలకారణంకాగా, రెండవ భాగానికి వెంగమాంబ ఏర్పరచిన కైంకర్యమే కారణం. ఈ భక్త శిఖామణుల సేవలను సమానంగా ఒకే సమయంలో స్వీకరిస్తూ వున్న శ్రీనివాసుడే వీరిరువరి సమానత్వానికి సాక్షి!

తిరుమలలో నెలకొనియుండిన వెంగమాంబగారి మఠంలో 'అష్ట ఘంటములు' అనే పేరిట ఎనిమిదిమంది వ్రాయసకాండ్రు ఉండి, ఆమె రచనలకు తాళపత్ర పత్రులను తయారుచేస్తూ వుండేవారు. తిరుమల యాత్రకు వచ్చే కూచిపూడి భాగవతులు మొదలయినవారు 'విష్ణుపారిజాతం', 'గోపీనాటకం' - వంటి ఆమె యక్షగానాల ప్రతులను గైకొనిపోయి, వాటిలోని రమణీయమైన ఘట్టాలను తమ తమ ప్రదర్శనల్లో ప్రదర్శిస్తూ వుండేవారు.

శ్రీకాళహస్తి, వేంకటగిరి, కార్వేటినగరం మొదలైన సంస్థానాల జమీందారులు వెంగమాంబ రచించిన వేంకటాచల మహాత్మ్యం, శ్రీభాగవతం వంటి రచనల ప్రతులను తెప్పించుకొని తమ తమ గ్రంథాలయాల్లో చేర్చుకుంటూ వుండేవారు.

ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో వెంగమాంబ వైభవంగా నిర్వహిస్తూ వుండిన నృసింహ జయంతి ఉత్సవాలను గోల్కొండ నుండి దిండిగల్లు వరకు గల దేశంలోని జమీందారులు, భూస్వాములు, ధన స్వాములు సామాన్య ప్రజానీకం భక్తి ప్రపత్తులతో వ్రాయించి యిచ్చిన దానపత్రాలు తరిగొండ వెంగమాంబగారి సామాజిక సేవా దృక్పథానికి అక్షర నిదర్శనాలుగా నిలిచియున్నాయి.

మొత్తం మీద ఈ యిరువురు మహనీయ వాఙ్మయమూర్తుల జీవితాల, సాహిత్యాల వల్ల వెల్లడియౌతున్న సందేశ పరమార్థాలు ఒక్కటే.

ఒక్క మాటలో, ఆంధ్రవాఙ్మయ ప్రపంచంలో మరే ఇరువురు మహాకవుల మధ్య గోచరింపని సన్నిహితమైన సాదృశ్యం ఈ యిద్దరు సాహితీమూర్తుల జీవితాల్లోనూ, సృజించిన సాహిత్యంలోనూ సాక్షాత్కరిస్తూ వుండటం యథార్థమైన విశేషం.

***

4

అన్నమయ్య - సారంగపాణి

ఆచార్య డా. పి. కుసుమ కుమారి,
జి.రాజేశ్వరి,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

ఉపోద్ఘాతం :

భారతీయ సాహిత్యం ప్రారంభం కావడమే 'ఏకీకరణ' అనే సూత్రంతో ప్రారంభం అయ్యింది. మనుషులు భూగోళంమీద ఎక్కడ ఉన్నా సరే వారి జీవన సంఘటనలు, సుఖదుఃఖాలు, సామాజిక స్థితిగతులు, చారిత్రక పరిణామాల వంటి విషయాల్లో కొద్దిపాటి తేడాలు ఉన్నప్పటికీ సాధారణ సమానత్వం తప్పనిసరిగా ఉంటుంది. ఇది సాహిత్యంలో కూడా కనిపిస్తుంది. సాహిత్యరంగాన్ని వస్తుపరంగా, కాలపరంగా, ప్రక్రియాపరంగా మనం గమనిస్తే ఇది అవగతమౌతుంది. వివిధ సంస్కృతుల మధ్య, వాటి ప్రతినిధి రూపాలైన సాహిత్యాల మధ్య చేసే అంతస్సాంస్కృతిక విచార చర్చ తులనాత్మక పరిశీలన.

1.2. తులనాత్మక పరిశీలన :

వివిధ సంస్కృతుల మధ్య, సార్వజనీనతత్వాలను (లిటరల్ యూనివర్సల్) అనుశీలించే మెథడాలజీ తులనాత్మక సాహిత్యం "Comparative Literature provides a Methodalogy, a wider perspective and a mere catholic attitude to study several Literatures together" అని తులనాత్మక సాహిత్య అధ్యయన ప్రయోజనాన్ని వివరించడం జరిగింది.

తులనాత్మక పరిశీలన రెండు భాషల మధ్యనే పరిమితం కానక్కరలేదు. ఒకే భాషలోని రెండు రచనల మధ్యనైనా తులనాత్మక పరిశీలన చేయవచ్చు.

తులనాత్మక పరిశీలన ముఖ్యంగా మూడు విధాలైన దృక్పథాలతో జరుగుతుంది. అవి:

1. తులనాత్మక పోకడలను, రచయితల రచనలను పోల్చి చూడడం

2. భాషావ్యాకరణాంశాలను పోల్చి చూడడం

3. సాంస్కృతిక విషయాలను పోల్చడం

సాహిత్యంలోని వివిధ అంశాలను తులనాత్మకంగా పరిశీలించే విధానాన్ని క్రింది విధంగా చెప్పవచ్చు.

1. సాహిత్యధోరణుల తులన
2. ఒక్కో కాల ఖండ తులన
3. రచనల తులన
4. రచయితల తులన
5. పరస్పర ప్రభావాల తులన

ఈ అంశాలని ప్రత్యేకించి పరిశీలించడానికి అవకాశం ఉంది. వాగ్గేయకారులుగా విశేషఖ్యాతి గాంచిన అన్నమయ్య, సారంగపాణిల జీవితం, రచనలకు సంబంధించి తులనాత్మక పరిశీలన చేయడం ప్రస్తుతాంశం.

1.3. అన్నమయ్య- సారంగపాణిల జీవితం : తులన

అన్నమాచార్యులు కడపజిల్లా, తాళ్ళపాక గ్రామవాసి. తాతముత్తాతలు కూడా అక్కడే నివసించారు. అన్నమయ్య నందవరీక బ్రాహ్మణులు, ఋగ్వేదులు, ఆశ్వలాయన సూత్రులు భారద్వాజ గోత్రానికి చెందిన నారాయణ సూరి, లక్కమాంబ పుణ్యదంపతులకు జన్మించాడు. అనేక చర్యలు, వాదోపవాదాలు జరిగిన మీదట అన్నమయ్య జననం 1408 మే నెల 9 తేదీగా నిర్ధారించారు.

చిన్న వయస్సులోనే శ్రీ వేంకటేశ్వరుని దర్శనార్థం తిరుపతి వెళ్తున్న భక్తబృందంతో కలిసి కాలినడకన వెళతాడు. కొండెక్కి వెళ్ళలేక అలసి అక్కడే రాతి బండపై నిద్రపోతాడు. అలిమేలుమంగమ్మ వచ్చి అతని అలుపు తీర్చి ప్రసాదం ఇవ్వగానే అతడు సరస సాహిత్య పారీణుడై ఆశువుగా అలమేలుమంగపై శతకం చెప్తాడు. కొండకి చేరి స్వామిని దర్శించడానికి వెళ్ళగా అచ్చట తలుపులు బిగించి ఉంటాయి. అంతకు ముందు చెప్పిన శతకంలోని పద్యాలు చెప్పగానే తలుపులు వాటికవే తెరచుకుంటాయి. అప్పుడచ్చట ఉన్నవారు అన్నమయ్య సామాన్యుడు కాడని, అవతార పురుషుడనీ కీర్తిస్తారు.

అన్నమయ్యకి సకల వేదాంత పఠనాన్ని నేర్పించిన గురువు శఠగోపముని, శ్రీవేంకటేశ్వరునిపై భక్తితో పదరచన చేసి ఆడిపాడుకుంటూ ప్రసిద్ధికెక్కుతాడు. శ్రీవేంకటేశ్వరుని పై దినానికి ఒక సంకీర్తన చొప్పున రచిస్తూ అతని జీవితకాలంలో 32,000 సంకీర్తనలు రచించాడని ప్రశస్తి.

అక్కమ, తిరుమలమ్మలతో అన్నమయ్య వివాహం జరుగుతుంది. అన్నమయ్య సంసారిగా ఉంటూనే శ్రీవేంకటేశ్వరుని పై కీర్తనలు రచించి తరించాడు. పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడుగా ప్రసిద్ధికెక్కిన అన్నమయ్య 1503లో పరమపదం అలంకరించాడు.

సారంగపాణి :

సారంగపాణి చిత్తూరు జిల్లా మండలంలోని కార్వేటినగరం సంస్థానంలో ప్రసిద్ధి పొందిన పదకర్త, వాగ్గేయకారుడు. ఇతడు చెన్నపురి సమీపంలోని పొన్నేరులో పెరిగి, ఆవెనుక కార్వేటినగరం చేరి, ఆయాస్థానంలో స్థిరపడ్డాడు. వారిచే సంస్కృతుడై ఆస్థాన విద్వాంసుడుగా, విద్యాధికారిగా, వాగ్గేయకారుడుగా సారంగపాణి ప్రసిద్ధికెక్కాడు. వీరి తల్లిదండ్రులు, విద్యా వివరాలకి సంబంధించి సమగ్రమైన సమాచారం తెలియరాలేదు. ప్రప్రథమంగా వాగ్గేయకార చరిత్రను రచించిన సుబ్బరాయ దీక్షితులు సారంగపాణిని గురించి "ఉత్తరదేశీయుడైన తెలుగు బ్రాహ్మణుడు" అని పేర్కొన్నాడు. సారంగపాణి పదాలను పరిశీలిస్తే సంస్కృతాంధ్ర సాహిత్య నిపుణుడనీ, సంగీతాభినయాలలో దిట్ట అని స్పష్టమౌతుంది. సారంగపాణి ఉత్తమ పదకర్త.

సారంగపాణి పదములలో సంగీతసాహిత్యాల మేళవింపు కనిపిస్తుంది. ఈయన ప్రాచీన లక్షణ, లక్ష్య, సాహిత్య, సంగీత నాట్య శాస్త్రాలను అధ్యయనం చేశాడు. సునిశితంగా పరిశీలించాడు. రసజ్ఞుడైన, భావకుడైన గాయకుడు.

సారంగపాణి కీర్తనలలో భక్తి, వేదాంత, వైరాగ్య ప్రబోధం కనిపిస్తుంది.

అన్నమయ్య, సారంగపాణిల వ్యక్తిగత జీవితాన్ని తులన చేస్తే ఈ క్రింది అంశాలు స్పష్టమవుతాయి.

అన్నమయ్య	సారంగపాణి
1. అన్నమయ్య నందవరీక బ్రాహ్మణుడు.	1. ఉత్తరదేశీయుడైన తెలుగు బ్రాహ్మణుడుగా గుర్తించబడ్డాడు.
2. అన్నమయ్య రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లా, రాజంపేట మండలం, తాళ్ళపాక గ్రామనివాసి.	2. సారంగపాణి రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు జిల్లా కార్వేటినగర నివాసి.
3. అన్నమయ్య పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు, వాగ్గేయకారుడు.	3. ఉత్తమ పదకర్త, వాగ్గేయకారుడు.
4. ఆధ్యాత్మిక, శృంగార సంకీర్తనలను రచించాడు. వీటి సంఖ్య 32,000	4. శృంగార దేశీయ, జాతీయ పదాలు, కీర్తనలు రచించాడు వీటి సంఖ్య 200 పైగా
5. శ్రీవేంకటేశ్వర ముద్రాంకితాలు అన్నమయ్య సంకీర్తనలు	5. శ్రీ వేణుగోపాల ముద్రాంకితాలు.
6. తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించుకొని అమరణమూ ఉన్నవాడు.	6. కార్వేటినగర సంస్థానంలో ఆస్థాన కవిగా ఉన్నాడు. చరమాంకంలో పదవీచ్యుతు డైనాడు.
7. అన్నమయ్య తెలుగు భాషలోనే కాక సంస్కృత భాషలోను కీర్తనలు రచించారు.	7. సంస్కృతాంధ్ర భాషాకోవిదుడు.
8. అచ్చ తెలుగు భాషలో కీర్తనలు కనిపిస్తాయి.	8. సామాన్యులు మాట్లాడుకునే భాషలో కీర్తనలు ఉన్నాయి.
9. తెలుగు, ఉర్దూ, కన్నడ, తమిళ భాషాపదాలు ఆయన సంకీర్తనల్లో కనిపిస్తాయి.	9. తెలుగు, తమిళ, సంస్కృత, కన్నడ పదాలు ఆయన పదాల్లో కనిపిస్తాయి.
10. జాతీయాలు, సామెతలు, నుడికారాల వాడుక కనబడుతుంది.	10. సారంగపాణి పదాల్లోనూ జాతీయాలు, సామెతలు, నుడికారాలు కనిపిస్తాయి.
11. స్త్రీగురించి, ఆమె గుణగణాలకు సంబంధించి, రకరకాల వృత్తులకు సంబంధించిన స్త్రీలని, వారి వేషణ భాషలని అన్నమయ్య వర్ణించాడు.	11. సారంగపాణి తన కాలం నాటి సామాజిక జీవనాన్ని వర్ణించాడు.

అన్నమయ్య	సారంగపాణి
12. శృంగారం వివిధ రీతుల్లో వర్ణిస్తాడు	12. సారంగపాణి కీర్తనల్లోనూ స్త్రీల గురించి చెప్పాడు.
13.జానపప బాణీలలోనూ శృంగార, ఆధ్యాత్మిక కీర్తనలున్నాయి.	13.సారంగపాణి కూడా శృంగార పదాల్ని రచించాడు.
14. భక్తితో పాటు పలు సామాజిక అంశాలు కీర్తనల్లో కనిపిస్తాయి.	14. జానపద బాణీలేకాదు, జానపద రీతిలో జాతీయ, దేశీయ పదాలను రచించాడు.
15.అన్నమయ్య జీవిత విశేషాలకు సంబంధించిన సమాచారం అనేక పుస్తకాల ఆధారంగా లభిస్తుంది.	15.సారంగపాణి పదాల్లోనూ ఆనాటి సామాజిక స్థితిగతులు కనిపిస్తాయి. సారంగపాణి జీవిత విశేషాలకి సంబంధించి సమగ్రమైన సమాచారంలేదు.

1.4. అన్నమయ్య - సారంగపాణిల రచనల తులన :

అన్నమయ్య 32,000 పద సంకీర్తనల్ని రచించినట్లుగా తెలుస్తుంది. మొత్తం సంకీర్తనల్ని రెండు విధాలుగా చెప్పవచ్చు.

1. ఆధ్యాత్మిక సంకీర్తనలు 2. శృంగార సంకీర్తనలు

ఇవేకాక శృంగార మంజరి, అలమేలుమంగపై చెప్పిన వేంకటేశ్వర శతకం, ద్విపద రామాయణం, వేంకటాచల మహాత్మ్యం (సంస్కృతం), మరికొన్ని శతకాలు రచించాడు. సంకీర్తన లక్షణం సంస్కృతంలో రచించాడు. అది లభ్యం కావడంలేదు.

సారంగపాణి 200 పదాలను రచించినట్లుగా తెలుస్తున్నది. మొత్తం పదాలు నాలుగు రకాలుగా విభజించారు.

1. శృంగార పదములు - వీటి సంఖ్య 75
2. దేశీయ పదములు - వీటి సంఖ్య 66
3. జాతీయ పదములు - వీటి సంఖ్య 16
4. కీర్తనలు - వీటిలో వైరాగ్య నీతియుక్తంగా ఉండే పదాలు ఉన్నాయి వీటి సంఖ్య 43.

అన్నమయ్య-సారంగపాణి వాగ్గేయకారులే గాక, సంస్కృతాంధ్ర సాహిత్యములతో బాగా పరిచయమున్నవారు. సంగీత, నాట్య, అంకార శాస్త్రములందు నిష్ణాతులు. వీణావాద్య నిపుణులు. సంగీత సాహిత్య సమ్మేళనకర్తలు.

వీరిద్దరి రచనల్లో ప్రధానంగా ఉండే అంశాల్ని కొన్ని ఉపశీర్షికలుగా వింగడించుకుని తులనాత్మకంగా పరిశీలించవచ్చు.

అన్నమయ్య - సారంగపాణి పదాలలో స్త్రీతత్త్వం :

అన్నమయ్య తాను రచించిన శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనల్లో స్త్రీ సంబంధమైన అనేక అంశాలు వర్ణించాడు. స్త్రీకి కోపం పనికిరాదని, మొండితనం కూడదని, పదేపదే సాధింపులు, వేధింపులు ఉండకూడదని, పట్టువిడుపులు ఉండాలని అంటాడు. అనేక హితవులు చెప్తాడు.

స్త్రీకి సిగ్గే మూలధనమనీ, వినయంగా ఉండాలని, భర్త ఎంత స్వేచ్ఛగా మాట్లాడినా స్త్రీ సిగ్గుతో ఉండాలని అదే ఆమెకు అందమని, భర్త తలపెరిగి మెలగడమే తెలివి అని అంటాడు.

సారంగపాణి శృంగార, దేశీయ, జాతీయ పదాలు కీర్తనల్లో ఆధ్యాత్మికత గురించే కాదు ఆ కాలంలో స్త్రీల యొక్క స్థితిగతుల్ని చెప్పాడు. రాజసంస్థానాల్లో ఉండే దేవదాసిల గురించి, కులకాంతల యొక్క విపరీతపు చేష్టల గురించి వర్ణించాడు. వార వనితల నక్కటక్కులు, వింతనయగారాలు, విటులను మోసగించే తీరును చెప్పాడు. స్త్రీలోని సుకుమారత్వాన్ని, ఈర్ష్యాసూయల్ని, కోపాన్ని, దీనత్వాన్ని, విరహాన్ని చక్కగా సారంగపాణి తన పదాల్లో వివరించాడు.

అన్నమయ్య స్త్రీ సౌందర్యాన్ని రకరకాలుగా ప్రకృతిలోని అంశాలతో పోలుస్తాడు. ఇంకా అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీ సౌందర్యాన్ని, స్త్రీని రాశులతో, ఋతువులతో, నవరత్నాలతో, కాలాలతో, పూవులతో, పండ్లతో పోల్చి వర్ణించడం కూడా కనిపిస్తుంది.

అదే విధంగా సారంగపాణి తన పదాల్లో ఔషధాల్ని, పలురకాల చెట్ల కొమ్మల్ని, భిన్న రాగాలని గురించి చెప్పాడు. అంతేకాక ఆ కాలంలో ఉన్న వివిధ ఆభరణాల పేర్లు, ఊర్ల పేర్లు, మానుల పేర్లు కూడా తన పదాల్లో చొప్పించి వర్ణించాడు.

కొమ్మల పేర్లు :

తరుణికేమని దారబోసి వచ్చెనెమద - దంతికొమ్మా - ఎంతో
మురిపెము లేకనే యిచ్చున మరువంపు - మొలక కొమ్మా ॥ త ॥

భామకిమ్మని పంపె భ్రమరముచే పూల - బంతికొమ్మా - అల్ల
సామజయానకు సరిలేదన్నది వక్క - సారెకొమ్మ ॥ త ॥

ఇలా దంతికొమ్మ, మొలకకొమ్మా, బంతికొమ్మా, సారేకొమ్మా, గొట్టికొమ్మా, వంగకొమ్మా, కడపకొమ్మా, కానుగకొమ్మా, కందికొమ్మా అంటూ రకరకాల పేర్లు ఇక్కడ కనిపిస్తాయి. 'కొమ్మ' అన్న మాటలకు చెట్టుకొమ్మ అన్న అర్థంతోపాటు 'స్త్రీ' అన్న అర్థం కూడా ఉంది. అది ఒకరకమైన చమత్కారాన్ని సంకీర్తనకు చేకూర్చింది.

రాగముల పేర్లు :

ఈ సీమల హరిణాక్షులు వలెగా - దీ మోహనాంగీ
కాశీపురి నుండి వచ్చినదీ - కల్యాణీ వేణుగోపాల ॥ ఈ ॥

ఇలా మోహన, కల్యాణి , కన్నడ, దర్బారు, తోడి, సామ, గుజ్జరి, పాడి, సారంగ, నాయకి, గౌరి, వరాళి, మణిరంగు, అసావేరి, లలిత, మలహార, అహరి, శ్రీ, సహానా, పంచమం, మారువ, కాపీ మొదలైన రాగాలను సారంగపాణి ఈ కీర్తనలలో ప్రస్తావించాడు.

ఆభరణముల పేర్లు :

కంకణము గట్టినాడు - గవదే నా మీద సుంత
కొంకు కొసరు లేక వేణు - గోపాలుడీవేళ నా పై ॥ కం ॥

కమ్మలు దానికి వ్రాయ - కారణమేమన్నందుకు
సమ్మతి గాకుండే "ఛో - ఛీ" - పొమ్మనె నిరాకరించి ॥ కం ॥

ఇలా కంకణములు, కమ్మలు, పట్టెడా, మెడపట్టి, గంటీలు, కంటసరి, ముక్కెర, సూర్యచంద్రులు మొదలైన ఆభరణాల పేర్లు ఈ కీర్తనలో కనిపిస్తాయి.

ఊర్ల పేర్లు :

కడప దాటి రానీయకే
అలవాని మాయగంటి వాకిలి దీయకే ॥ క ॥

పడతిరో ఇక్కేరి - పడచుర జేరి నన్ను
విడనాడి పొమ్మనిన - వేణుగోపాలుని ॥ క ॥

మగువరో పుణ్యానికే - మనుచు దరిశించెను
మగరాల కమ్మలా - మదిరాక్షికి ॥ క ॥

ఇలా కడప, ఇక్కేరి, దరిశి, మగరాలు, మదిర, మధుర, నెళవాయ, పేరూరు, నారుతూరై అయిరాల, పళికొండ, గోలకొండ, చిత్రకూటము, పెనుగొండ మొదలైన ఊర్లపేర్లు వాడుక ఈ సంకీర్తనలో కనబడుతుంది.

మానుల పేర్లు :

పడతి నేస్తము వేణుగో-పాలమాను
తడబడక నీవికను - దాని చింతమాను
పంతమున అటు దిక్కు - పదినాళ్ళు పోకమాను
ఇంతకిచ్చేవు సుమీ - ఈతమాను

ఇలా పాలమాను, పోకమాను, కెమ్మోవిమాను, గొండిమాను, వేగిమాను, మద్దిమాను, బిల్వమాను, వొడిసెమాను, సింగరేకుమాను, పూలగుత్తిమాను వంటి పేర్లు ఇక్కడ కనిపిస్తాయి.

శృంగారం వివిధరీతుల్లో వర్ణించడం ఇద్దరు వాగ్గేయకారుల్లో కనిపిస్తుంది. స్వీయ, సామాన్య, నాయికా శృంగార వర్ణన అన్నమాచార్యుల సంకీర్తనల్లో అత్యధికంగా, అత్యున్నతంగా కనిపిస్తుంది. అదే విధంగా సారంగపాణి స్వీయ, పరకీయ, సామాన్య నాయికల శృంగారాన్ని చక్కగా వర్ణించాడు.

అన్నమయ్య :

రమ్మనవే వాని రమ్మనవే యీ
తమ్మి కనుగొనల తళుకుల వాని ॥ పల్లవి ॥

మెలుపున నేను మేడమీద యీ
చిలుక చేరుకొని పిలువగను
అలపున వీధి దానరుగుచును తను
బిలిచినంటూ బలికిన వాని ॥ రమ్మ ॥

(శృం. సం. 12-283)

నాయిక చెలికత్తెలతో తన ప్రియుని తోడితెమ్మని చెప్పే సందర్భం. ఇదే సందర్భాన్ని

సారంగపాణి :

రమ్మనే సామిని రమ్మనే
కొమ్మ నీవే నా మనవిగై
కొమ్మని వేణుగోపాలుని ॥ రమ్మ ॥
మచ్చుమీద నేనుండగ -
మచ్చుమీద జల్లిన వాని ॥ రమ్మ ॥

పడచు వయస్సులోని స్త్రీ యొక్క సోయగములను, కులుకును సారంగపాణి ఈ పదంలో చక్కగా వర్ణిస్తాడు. అదే విధంగా అన్నమయ్య అలిమేలు మంగమ్మ గురించి ....

'అలరులు కురియగ ఆడినదే - అలకల కులుకుల అలమేల్ మంగ
అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అరతెరమరుగున నాడెనదె
వరుసగ పూర్వ దువాళపు తిరుపుల
హరిఁగరఁగింపుచు నలమేలు మంగ ॥ అలరు ॥

లేనిపోని మాటలు ఇంకా ఎందుకు నీకు ? ఉన్న కోరికేది చెప్పరా అంటు ప్రియుని మనోభీష్టాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది నాయిక. అదే విధంగా...

ఏమొకో చిగురుటధరమున నయెడఁగస్తురి నిండెను
బామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా *(3-467)*

పలుకుఁదేనెల తల్లి పవళించెను
కలికితనముల విభునిఁ గలిసినదిగాన *(4-47)*

అన్న అన్నమయ్య కీర్తనలు స్త్రీ మూర్తిమత్వాన్ని మనముందుకు తెస్తాయి.

సారంగపాణి కూడా తన కీర్తనల్లో ...

రమ్మనే యీ మేను వాని సొమ్మనే
కౌగిట జేర్చుకొమ్మనే మోవితేనెలిమ్మనె
బాలనె తమక మణపజాలనె పతిజూపని సొగ
సేలనే యీ జవ్వన మేలనే **(69వ పదం)**

ఈ శరీరమే ఆ స్వామిదని, తమకానికి విరహతాపానికి తట్టుకోలేని భర్త చూడని సొగసు దేనికని, యవ్వనం ఎందుకని నాయిక విరహవేదనని వ్యక్తం చేస్తుందన్న విషయాన్ని సొగసుగా చెప్తాడు.

1.5. అన్నమయ్య - సారంగపాణి భక్తి - వైరాగ్య ప్రబోధ- తులన

హృదయ పూర్వకంగా ఆచరించలేని ఏ పనైనా ఆనందాన్ని కలిగించదు. మనసా వాచా కర్మణా చేసే కార్యంలో కలిగే ఆనందం పరమానందమని పెద్దల ఉవాచ. నలుగురు చేస్తున్నారు కనుక మనం చేయాలన్న ఆలోచనకంటే అందులో ఏముందో తెలుసుకుని చేయడం ఉత్తమం. లేదంటే అది వ్యర్థమే. ఈ విషయాల్ని సారంగపాణి -

భక్తిలేనీ పూజలేమిటికి ప్రతి దొరకగానే
భక్తిలేని పూజలేమిటి ॥ పల్లవి ॥

భక్తిలేని పూజలేమిటికి
భాషించలేని మగడేమిటికి
రక్తపాదని పదమేమిటికి
రహిని వేణుగోపాలుని పాద ॥ భక్తి ॥

జీతము ముట్టని కొలువేమిటికి
చిలుకలేని పంజరమేమిటికి
దాతలు దొరకని యూరేమిటికి
దైవము చేరని గుడియేమిటికి ॥ భక్తి ॥ ***(సారంగపాణి 180)***

శ్రద్ధలేకుండా పూజ చేయడం అనవసరం. మాట్లాడని మగడు, ఆస్వాదించడానికి నోచని పాట వ్యర్థం. జీతంలేని పనిచేయడం, చిలుక లేకుండా పంజరముంచటం, దాతలు లేకుండా వూరుండడం, దైవము లేకుండా గుడి ఉండడం నిష్ప్రయోజనం అని చెప్తాడు. భక్తి కలిగి పూజ చేయడం ఉత్తమమంటాడు సారంగపాణి.

అన్నమయ్య :

నిత్య సుఖానందమిదె నీ దాస్యము
సత్యము లేని సుఖాలు చాలుఁజాలునయ్యా ॥ పల్ల ॥

కన్నుచూపుల సుఖము కడు నీ చక్కని రూపె
యెన్నగ వీనుల సుఖమిదె నీ పేరు
పన్ని నాలుక సుఖము పొదుపు నీ తులసి
వున్న సుఖముల తెరువొడఁబడమయ్యా ॥ నిత్య ॥

అన్నమయ్య కూడా నిత్యం సుఖాన్ని కలిగించేది భగవంతునిపై ధ్యానం అంటాడు. భగవంతుని చక్కని రూపం కంటికి, భగవంతుని పేరు చెవికి, పాదతీర్థం నాలుకకి సుఖాన్ని కలిగిస్తాయి. భగవత్ కైంకర్యానికి ఈ శరీరము, ధ్యానానికి మనస్సు, శ్వాసకి పాదపద్మాల సువాసన సుఖాన్ని కలిగిస్తాయి. ఈ పుట్టుకకి సుఖము భగవంతునిపై భక్తి మాత్రమే అని అన్నమయ్య సెలవిస్తాడు.

వైరాగ్యం :

అయ్యో పోయఁబ్రాయముఁగాలము
ముయ్యంచు మనసుననే మోహమతినైతి
చుట్టంబులా తనకు సుతులుఁగాంతలుఁ జెలులు
వట్టి యాసలఁ బెట్టు వారే కాక
నెట్టుకొని వీరుగదు నిజమనుచు హరినాత్మ
బెట్టనేరక వృథా పిరివీకులైతి ॥ అయ్యో ॥

కాలమంతా వృధా అయిపోయింది. మోహమనస్సు కలిగి ఆలు, బిడ్డలు, చెలులని, చుట్ట పక్కాలని తలచుకొని లేనిపోని ఆశలు కల్పించుకోవడమే. తల్లిదండ్రులని, బంధువులని,

అంతా మంచివాళ్ళని అనుకోవడం తప్పు. అంతా వంతులకీ, పంతాలకీ వచ్చేవాళ్ళే. అసలైన పెన్నధి భగవంతుడే అని చెప్తాడు. భ్రమని విడిచి సత్యాన్ని గుర్తించమంటాడు. అదే విధంగా సారంగపాణి ఈ కీర్తనలో వైరాగ్యభావనను ఇలా ప్రభోదించారు.

అద్దె కొంప వంటిదీ దేహ - మనిత్యమే మనసా
మిద్దెమీద పరుగులు రెణ్ణాళ్ళు
సుమీ వేణుగోపాలుని సాక్షిగ ॥ అద్దె ॥

బందెగొడ్ల వంటిది సంసారము -
భ్రమయకే మనసా
యెవరున్న నదమంత్రమే జీవుని
కెవరు లేరు మనసా ముమ్మాటికి ॥ అద్దె ॥

ఈ దేహము అద్దె కొంప అంటాడు. బందెలదొడ్డి వంటిది సంసారమని, పువ్వు వంటిది యవ్వనమని, సిరిసంపదలు మెరుపు వంటివని గుర్తించమంటాడు. పతితపావనుడైన భగవంతుడి పాద పద్మాలపై మనస్సు నిలుపమంటాడు.

మానవ జీవన విధానానికి సంబంధించిన అంశాలు - అన్నమయ్య

అనుమానపు బ్రదుకది రోతా తన
మనసెనయని కూటమి మరిరోఁతా
అపకీర్తులఁబడి అడికెలోనై
అపవాదియాట అది రోఁత

అనుమానంతో జీవించడం అసహ్యాకరం. మనస్సుకు నచ్చని వాళ్ళతో కలయిక, లేనిపోని పనులతో నిందలు పడడం, నిందలు వేయడం వంటి చేష్టలు ఏ రకమైన శాంతిని, ఆనందాన్ని కలిగించవు. రోత పుట్టిస్తాయి. ఇదే విషయాన్ని సారంగపాణి ఇలా చెప్తాడు.

పాపాత్ముని ధర్మాధికారిగా - బంపే దొకరోత
కోపము జేసె నరనాథు కొలువు -
గొలిచే దొర కోత "ఛీ - ఛీ " ॥ పాపా ॥

వలసిన భాగ్యము లుండి భుజించని
వాని కలిమి రోత - యింట్లో

కులకాంతలు వుస్సురనగ వేశ్యల

గూడేదొక రోతా " ఛీ - ఛీ " ॥ పాపా ॥

పాపాత్ముని ధర్మానికి అధికారిగా పంపడం, అస్తమానం కోపగించుకునే రాజు దగ్గర పని, ఎంత ఉన్ననూ తినడానికి పనికిరాని సంపద, ఇంటి ఇల్లాళ్ళని కాదని వేశ్యాలోలత్వాన్ని ఆదరించే విధానం, పుట్టింట్లో ఎప్పుడూ భార్యను ఉంచడం, ఎక్కడో ఒకచోట అంత తిండి దొరికితే చాలని చుట్టాల ఇళ్ళకి పట్టెడన్నం కోసం వెళ్ళడం, హీనుని ఇంట మహాత్ముని ఉంచడం, తపస్వి అయి ఉండి అరిషడ్వర్గాలకి తగిలి ఉండేది అసహ్యకరమైన రోతని కలిగించే ప్రవర్తనలుగా సారంగపాణి సందేశమిస్తాడు.

హరినామ ప్రాశస్త్యం :

అన్నమయ్య - సారంగపాణి ఇరువురు విశిష్టాద్వైతులు. ఇద్దరు హరినామ సంకీర్తనల్ని రచించారు. అయితే ప్రత్యేకించి అన్నమయ్య సంకీర్తనల్లో ద్వైత, అద్వైత భావాలు గల కీర్తనలు ఉన్నాయి. సారంగపాణి తన యిష్టదైవమైన వేణుగోపాలునికి సంబంధించే పదాలు దాదాపుగా రచించాడు.

అన్నమయ్య :

ఆకటివేళల నలపైన వేళలను

తేఁకువ హరినామమె దిక్కు మఱిలేదు ॥ ప ॥

ఎటువంటి పరిస్థితుల్లోనైనా మనిషికి దిక్కై నిలిచేది భగవంతుడైన ఆ శ్రీహరి అని అతని నామాన్ని మించింది వేరొకటి లేదని, అదే మానవ జీవనగతి అని అన్నమయ్యపై కీర్తన రచించారు. ఇతరుల వల్ల ఆపదలు కలిగినా, పరుల చేతిలో ఏదో రకంగా ఇబ్బందుల్లో ఉన్నా, భయం కలిగినా పాపాలు చేసినా ఏమి ఎప్పుడు ఎలా సంభవించినా వాటి నుండి బయటపడవేయగలిగేది హరినామమేనంటాడు.

హరినామ ప్రాశస్త్యం - సారంగపాణి :

హరినామస్మరణే సేయకుంటే - అవతల గతి యేమి ? ......

వెరవు దెలిసి సత్సంగతి వదలక - వేణుగోపాలుడైన - శ్రీనర ॥ హరి ॥

హరినామ స్మరణ చేయగలిగిన ఓపిక, అవకాశం ఉన్నప్పుడే చేయాలి. తనకుతానుగా గుర్తెరిగి భగవంతుని ధ్యానించాలి. అన్నదమ్ములు వదిలేయక ముందే, భార్య నిష్ఠురాలు పలుకకముందే, కొడుకు కృష్ణారామా అంటూ ఓ మూల కూర్చోరాదా అని అంటూ దండించక ముందే హరినామం చేయాలి. ఉత్సాహంగా ఉన్నప్పుడే, వృద్ధాప్యం రాకముందే, కనులు కనపడేప్పుడు, అంగం తల ఒణకకుండా ఉండేటప్పుడు, శరీరం వ్యాధులతో క్షీణించక ముందే హరిని స్మరించాలని అంటాడు సారంగపాణి.

1.6 అన్నమయ్య - సారంగపాణి రచనలు - జన జీవిత చిత్రణ - తులన:

భగవంతునికి సంబంధించి ఉత్సవాలు, జాతి, కుల, మత భేదం ఉన్నత, నీచ వర్గ వ్యత్యాసం లేకుండా జరిపేవి. ఇవి అందరికీ సంతోషాన్ని కలిగించేవి అలాంటి ఉత్సవాలలో రథోత్సవం, తిరునాళ్ళు వంటివి అనాదిగా జరుగుతున్నటువంటివి. ఈ సందర్భానికి సంబంధించి అన్నమయ్య ఈ కీర్తనలో ఇలా వివరిస్తాడు.

దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలుఁగొలువంగా తిరుతేరు
తిరువీధులేగిని తిరుతేరు

దేవుని తేరు, అది దేవతలందరూ కొలిచేది. అన్ని దిక్కుల్లో తిరుగుతూందని, అది ముత్యాల కుచ్చులతో ఉన్న గరుడవాహనపు తేరిన, మ్రోతలు దద్దరిల్లుతూ రకరకాల వాయిద్యాలతో సాగే ఆ తేరుపై శ్రీ వేంకటేశ్వరుడు అలిమేలు మంగ సమేతుడై వూరేగుతూ కన్నుల పండుగ కలిగిస్తున్న వైనం అన్నమయ్య తన సంకీర్తనల్లో హృద్యంగా వర్ణించాడు. ఇంకా ఈ ఉత్సవానికి సంబంధించి .....

సారంగపాణి :

కదలివచ్చెను జూడరే - వేణు
గోపాలుడు కనులపండుగగాను
పదిలుడై గరుడుని పై నెక్కి భక్తుల
ముదమంద జేయుచు ఇదిగో రాజమార్గమున ॥ క ॥

ఇలాగ సారంగపాణి బండి తిరునాళ్ళగురించి చక్కగా వివరిస్తాడు. పూలమాలలతో బారులు తీరిన బ్రాహ్మణులు, వీరణము (ఒక చర్మవాద్యము) మోతలతో బోగమువాళ్ళ నాట్యాలతో తిరునాళ్ళు మొదలౌతుంది. పూజారి చేతిలో తీర్థం పోసి తలపై శఠగోపము పెట్టి అందరి దగ్గర నుండి దక్షిణ వసూలు చేస్తుంటాడు. ఆ తిరునాళ్ళ సంరంభాన్ని వర్ణించడం, ఊహించడం అలవిగాదంటాడు సారంగపాణి.

అన్నమాచార్యులవలె సారంగపాణి జానపదబాణీలే కాదు జానపద రీతిలో జాతీయ, దేశియ పదాలను రచించాడు. హెచ్చరికలు, లాలిపాటలు, మంగళ ఆరతులు వీరిరువురి రచనల్లోనూ ఉన్నాయి.

సారంగపాణి :

హెచ్చరిక :

హెచ్చరిక పరాకిందిరా రమణా
హెచ్చరికె జతనంపు హేమాబ్జచరణా (197 కీర్తన)

లాలి :

లాలెనుచు వూచేరు లలన లింపున
శ్రీల చెన్నలరు నుయ్యాల పొన్నునను
గోలరుక్మిణీ దేవి కోరి పెంపును
బాళితో వచ్చె నీ పై తలంపుననూ (199 కీర్తన)

మంగళహారతి :

జయ మంగళం నిత్య శుభ మంగళం
ఇందిరా రమణునకు నిభరాజ వరదునకు
మందరోద్ధారునకు మాధవునకూ
నందనందనుడైన నవనీత చోరునకు
కందర్ప శతకోటి సుందరునకూ ॥ జయ ॥ (200 కీర్తన)

అన్నమయ్య :

హెచ్చరిక :

శరణు శరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతి వల్లభా

శరణు రాక్షస గర్వసంహార శరణువేంకట నాయకా (శం. సు. 12-17)

లాలి :

లాలనుచు నూచేరు లలన లిరుగడల

బాలగండవర గోపాల నిను జాల ॥ ప ॥

(అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 63,64)

మంగళహారతి :

మరల మరల జయమంగళము

సొరిది నిచ్చలును శుభమంగళము ॥ ప ॥

కమలా రమణికి గమలాక్షునకు

మమతల జయజయ మంగళము

అమరజననికిని అమరవంద్యునకు

సుముహూర్తముతో శుభమంగళము (అ.సు. 1-448)

ఈ విధమైన కీర్తనలు ఇరువురి రచనల్లోనూ కనిపిస్తాయి. ఇవి జనబాహుళ్యంలో సాధారణంగా వినిపించే కీర్తనలు.

1.7. అన్నమయ్య - సారంగపాణి రచనల్లో సామాజికాంశాల ప్రస్తావన - తులన

సారంగపాణి తన కాలంలో సామాజిక వ్యవస్థలో పతనమైపోతున్న విలువల స్వరూపాన్ని తన పదాల్లో ఎత్తి చూపాడు. ఆంగ్లేయ నాగరికతా ప్రభావంతో సంస్కృతి, సంప్రదాయాలు అడుగంటుతున్న వైనాన్ని చెప్తాడు. ఆనాటి చిత్తూరు జిల్లా పరిసర ప్రాంతాల్లో కులకాంత స్థితిని ఇలా సారంగపాణి ప్రస్తావిస్తాడు.

కులకాంతలు విడిబడి నలుదిక్కుల
వెలరేగే రిదేటి పాపమో అయితే
వెలయాండ్లకు జీవనమేమిక
శ్రీ వేణుగోపాలా సంకరమై ॥ కుల ॥

కులకాంతలు కూడా వేశ్యలుగా మారితే ఇక వెలయాండ్ల జీవనం ఎలా సాగుతుంది. ఊహ తెలియని బిడ్డలను కాదని, భర్త పరువు ప్రతిష్ఠలని ఆలోచించక కాపురాన్ని కూల దోసుకున్నారంటాడు. తల్లిదండ్రుల కష్టపెట్టి, పూటకూళ్ళ ఇళ్లలో తిని వ్యర్థ జీవనం గడిపే పాప కర్ములని, నాటి సమాజ పరిస్థితులను వివరిస్తాడు.

వార వనితలు ఎంతటి అంగ విహీనులనైనా డబ్బు కాసించి చేరదీస్తారని ఆనాటి సామాజిక వ్యవస్థ తీరు అలా ఉండేదని చెప్తాడు. సామాన్యులు దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవించేవారని, సంస్థాన ప్రభువులు అధిక మొత్తంలో పన్నులు వసూలుచేసి ఆంగ్ల ప్రభుత్వానికి చెల్లించేవారని సారంగపాణి తెలియజేశాడు. తంజావూరు, మధుర రాజ్యాల నుండి వలసవచ్చి దేవదాసీలుగా స్త్రీలు కార్వేటినగర ప్రాంతంలో బ్రతుకు గడిపారని చెప్తాడు. కరువువల్ల దొంగతనాలు, దోపిడీలు విస్తృతంగా జరిగేవనీ, నిరుపేద జనాలు అనేక బాధలనుభవించినట్లు చెప్తాడు. చదువు సంధ్యలు లేని పామర జనులు మారుమూల పల్లెలల్లో నివసిస్తూ అనుభవించే కష్ట సుఖాలను వారి భాషలోనే చెప్తాడు. క్రీ.శ. 1747లో కరువు ఏర్పడిందని, బిరుదుబంట్లు కూడా బిచ్చగాళ్ళు అయినారని, మందలు పడమట సీమవైపు మేతకు వెళ్ళాయనీ, తల్లిదండ్రులు బిడ్డల్ని పోషించుకోలేక అమ్మివేసుకున్నారని వారి దయనీయ స్థితిని సారంగపాణి వర్ణిస్తాడు

అన్నమయ్య కాలంలో కులమత భేదాలు ఎలా ఉన్నాయో, జంతుబలుల వంటి దురాచారాలు, స్త్రీ,పురుష వ్యత్యాసాలు ఎలా ఉన్నాయో వివరిస్తాడు, సమాజంలో నెలకొన్న అనేక అస్తవ్యస్త వ్యవహారాల్ని వివరిస్తాడు. ఆనాడు శక్తిపూజలు, గ్రామదేవతల పూజలు విరివిగా జరిగేవి. జంతుబలుల్ని చేసేవారు. అగ్నిగుండాలపై నడిచి తమ భక్తి ప్రపత్తుల్ని చాటుకొనేవారు. అర్థంలేని వ్యర్థాచారాలని అన్నమయ్య నిరసిస్తాడు. ప్రజల సాంఘిక దురాచారాలను మూర్ఖంగా పాటిస్తూ కష్టాలపాలవడం జూచి విచారిస్తాడు.

కాల విశేషమో లోకము గతియో సన్మార్గంబుల
కీలువదలె సౌజన్యము కిందయి పోయినది ॥ కాల ॥

అనే పదంలో కాలప్రభావమో, లోకం తీరో ఏదైనాగావచ్చు మంచితనము సౌమ్యతం తగ్గిపోయింది. ధర్మం, సత్యం, శాంతం, విజ్ఞానం, వివేకం లోకంలో కనిపించడం లేదు. సంసారజీవితం, బ్రతుకు కష్టాలమయమైపోయింది. సమాజంలో ఏ మాత్రం సన్మార్గవర్తనం కనిపించడంలేదు అంటూ అన్నమయ్య బాధపడతాడు.

బ్రహ్మమొక్కటే - పరబ్రహ్మమొక్కటే.... అనే కీర్తనలో భిన్నమతాలు, కులాలు, హెచ్చుతగ్గులు, ఎన్నున్నా అందరూ ఒక్కటే పీల్చేగాలి, అనుభవించే కష్టసుఖాలు, ఎండా, వెన్నెలా, ఇలా ప్రకృతిలో అనేకం అందరికీ సమంగా అనుభవించేందుకే అని చెప్తాడు.

1.8. అన్నమయ్య - సారంగపాణి రచనల్లోని భాషా విశేషాలు - తులన :

1. శృంగార సంకీర్తనల్లో నాయికావస్థలను చిత్రించే విషయంలో అన్నమయ్య, సారంగపాణి రచనల్లో పోలిక కనిపిస్తుంది. భాషలోను, పలుకుబడిలోను, భావ ప్రకటనా విధానంలోను సామ్యం కనిపిస్తుంది.

2. ఇరువురి సంకీర్తనల్లో సామెతలు, గ్రామ్యోక్తులు కనిపిస్తాయి.

సారంగపాణి పదాల్లో సామెతలు :

అందరాని పండ్లకు ఆశించినట్లు, ఆలి మీద లంజరికము, కొండను త్రవ్వి ఎలుకను బట్టుదురా! చక్కిలిగింతలు చట్రాతికి గలదా, ఈతాకు రాలునా ఏయాకురాలినా, ముండ్ల మీద వలువ వలె, పూసలోని దారమువలె, అతి వినయం ధూర్తలక్షణం, కోతి చేతి మాణిక్యము వలె, ఉసురుంటే ఉప్పమ్ముకోవచ్చు, బలవంత మాఘస్నానము, ఇల్లలికితే పండగాయెనా, పుట్టిన బుద్ధులు పుడకలతో సరి, ఎద్దుపుండు కాకికి ముద్దవునా, బూడిదలోని హోమము, అన్నిటికి కాసుకదా దొడ్డది, గురువుకు పంగనామం పెట్టు వంటి సామెతలు అనేకం కనిపిస్థాయి.

అన్నమయ్య సంకీర్తనల్లో సామెతలు :

అందని పండ్లకేల అఱ్రుచాచేవు, అడవిగాచిన వెన్నెల, అల్లము బెల్లమౌనా, ఎంగిలి బూరె కడుగనేల, ఓడవిడిచి వదరు పట్టుట, ఏటివంకలు దిద్ద వశమా, ఏనుగుదిన్న

వెలగపంటి బేసమువలె, కంచములోని కూడు కాలదన్నుదురా, గోరుచుట్టు మీద రోకటిపోటాయె, గడ్డపార మింగితే యాకలి దీరునా, కొండద్రవ్వట ఎలక కొరకా, పిండెంతో నిప్పటి అంతే, మొదలుండగా కొనను నీళ్ళు పోయెనేల, వ్రతము దక్కినను సుఖము దక్కకపోయె, విత్తొకటి చెట్టొకటి యగునా వంటివి అనేకం కనిపిస్తాయి.

మాండలిక పదాలు - సారంగపాణి :

తెలుగు : సంమందము, కనరు, కంకణముకట్టు, ఏచుట, ఎనసి, నిలువరము, అంతులు, నలితిండి, చిడిముడిపాటు, సన్నవేయు, అమ్మకచెల్ల, గంటీలు బెట్టు, సాయము, మెఱమెచ్చులు, పెడసరము, గూటము వలెతిని, సారెసారెకు, కంచి గరుడసేవ, బిర్ర బిగుసుకొని వంటి పదాలు అనేకం.

తమిళం : చిలుము విడిచె, ఇరంపరం, మూళి, ుడుగాడు, సీమాటి చిత్తూరుజిల్లాలో వాడుకలో ఉన్న కొన్ని తమిళ, కర్ణాటక పదాలు కూడా వీర పాటల్లో కనిపిస్తాయి.

అలంకారాలు : సారంగపాణి పదాల్లో రెండు అర్థాలు వచ్చే విధంగా అంటే శ్లేషాలంకారం ఎక్కువగా కనిపిస్తుంది. శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు అనేక విధాలుగా ప్రయోగించారు.

మాండలిక పదాలు - అన్నమయ్య :

మాండలిక పదాలు : అంగడిపెట్టు, ఎడము, ఏకాంగి, తెరవు, చండ, నెఱపు, అల్లిరము, అగ్గువ, ఉలివెచ్చ, ఎకసెక్కము, ఊకొను, కసవు, కమ్మటి, గోడ్దేరు, సదరుకొను, యంపితి.

తమిళం : ఉడయవరు, తిరుమంత్రం, తిరువాముడి వంటి పదాలు.

కన్నడం : బెళకనే పొద్దు, బెళుకు, అప్పణి.

అరబ్బీ, ఉర్దూ, హిందీ : జగడాలు, జూటు.

ముగింపు :

ఈ విధంగా అన్నమయ్య, సారంగపాణిల రచనలను తులనాత్మకంగా పరిశీలిస్తే శృంగారతత్వం, భక్తి వైరాగ్యంలో కవితా మాధుర్యంలో చక్కటి సౌమ్యం కనిపిస్తుంది. కేవలం భగవంతునికి సంబంధించి పదకీర్తనల్ని రచించడమే కాదు, నాటి సమాజంలో ఉండే అనేక దురాచారాలని, దుర్మార్గాలని కూడా అక్కడక్కడా ఇద్దరూ ప్రస్తావించారు. అన్నమయ్య

శ్రీ వేంకటేశ్వరునిపై వేల సంకీర్తనల్ని రచించి పాడి పరవశించి తరిస్తే, సారంగపాణి రాగతాళాలతో వివిధ పదాల్ని రచించి ఆడిపాడి తన్మయుడై, తన్మయింపజేశాడు. వీరిద్దరూ పదసంకీర్తనల్తో చిరస్థాయిగా భక్తి సంగీతాభిమానుల హృదయాల్లో స్థానాన్ని పొందారన్న విషయంలో ఏ మాత్రం సందేహం లేదు.

***

సంప్రదించిన రచనలు :

1. *సారంగపాణి పద సాహిత్యం* - డా. ఎస్. గంగప్ప
2. *అన్నమాచార్యులు ప్రముఖ వాగ్గేయకారులు* - తులనాత్మక అధ్యయనం - డా. ఎస్. గంగప్ప
3. *అన్నమయ్య సంకీర్తనల్లో జానపద గేయ ఫణితులు* - పొన్నా లీలావతమ్మ
4. *అన్నమయ్య సంకీర్తనా జ్యోతి* - పొన్నా లీలావతమ్మ
5. *కార్వేటినగర సారంగపాణి పదములు* - శ్రీఇరువారం, లోకనాథం
6. *తులనాత్మక సాహిత్య వ్యాసాలు*
   వ్యాస సంకలనం : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ
7. *తాళపాక కవుల పదకవితలు - భాషా ప్రయోగ విశేషాలు* - వేటూరి ఆనందమూర్తి
8. *అన్నమయ్య సంకీర్తన సుధ* - డా. ఎస్. గంగప్ప
9. *అన్నమయ్య సంకీర్తనలు* - తి.తి.దే. ప్రచురణ

***

5

అన్నమయ్య రాకమచర్ల వేంకటదాసు

డా. మొరంగపల్లి బాగయ్య
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

అన్నమయ్య క్రీ.శ. 15వ శతాబ్దంలో జీవించినవాడు. ఇతడు రచించిన కీర్తనలు 32,000 అయితే దొరికినవి తక్కువ. వైష్ణవ శిఖామణి, వేంకటేశ్వరస్వామి భక్తుడు అధ్యాత్మిక, శృంగార కీర్తనలు రచించి పాడినవాడు. నాదబ్రహ్మ సంప్రదాయ సంకీర్తనాచార్యుడు.

రాకమచర్ల వేంకటదాసు జానపద బాణీలో పాడుకొన్న కీర్తనలు లక్షకు పైగా వ్రాసినట్లు తెలిసింది. కాని లభించినవి 500 కీర్తనలు. 18వ శతాబ్దిలో నివసించినవాడు. ఇతని ఊరు పాలమూరు జిల్లా అచ్చంపేట తాలుకాలోని పెద్దాపురం అని తెలుస్తున్నది. క్షేత్ర పర్యటన చేస్తూ ముచుకుంద క్షేత్ర ప్రసిద్ధికి నిలయమైన రంగారెడ్డిజిల్లా పరిగి తాలూకా, పెద్ద ఉమ్మెతల గ్రామానికి మూడు కి.మీ. దూరంలో గల రాకమచర్లకు చేరాడు. శ్రీ యోగానంద నరసింహస్వామిని చూచి, చలించిపోయి అక్కడే నిలిచిపోయినాడు. ఈ కవి విష్ణుమూర్తి వర కవితా వాక్పటిమతో, మధురమైన భక్తిరసపూరితమైన కీర్తనలు రచించి తరించిన ఘనుడు.

రాకమచర్ల కవిత పండిత పామర జనాన్ని ఆకర్షించి, ఆకట్టుకొన్నది. నేటికీ పల్లెల్లో భక్త జనులు పాడుకుంటున్నారు. లోకానికి అర్థమయ్యే రీతిలో కీర్తనలు రచించినాడు. తెలంగాణాలో ఈయన కీర్తనలు పల్లె పల్లెలో జానపదులు సహితం అవలీలగా పాడుకుంటారు. ఇతని కీర్తనలు తెలియనివారుండరు. భక్తజన భజన మండళ్లు ఎన్నో ఉన్నవి. వీరి కీర్తనల సారం ముక్తికి సోపానం. దేశ సంచారం చేస్తు పాడుకొన్నవాడు. ఈయన శా.శ. 1751 సిద్ధార్థ నామ సంవత్సరం మార్గశిర శుద్ధ త్రయోదశినాడు పరమపదించాడు. ఈయన సమాధి ఉమ్మెంతల గ్రామంలో శ్రీవారి సన్నిధిలో ఉంది. సమాధిపై ఆలయం కూడా

కట్టించారు. నేటికి దాసజనులు భక్త జనమండలి వారి ఆలయంలో కూర్చుండటానికి వెయ్యిమందికి సరిపడే నిర్మాణం చేసి ఉన్నారు.

రాకమచర్ల అన్నమయ్య వలెనే విష్ణుమూర్తి భక్తుడు. రామునిపై కృష్ణునిపై అధికంగా కీర్తనలు పాడి తరించినవాడు. తనకు ముక్తిని ప్రసాదించుమని వేడుకొన్న ఘనుడు. శ్రీరాముని పై వేంకటదాసు పాడిన కీర్తనలు అనేకం.

భక్తకవి పోతన పద్య కవిత్వంలో రాణిస్తే, రాకమచర్ల అన్నమయ్యలు కీర్తనలచే రాముణ్ణి మెప్పించినారు. రాకమచర్ల గేయ పరంపరతో స్వామిని ఆరాధించినాడు. అన్నమయ్య విశిష్టాద్వైతాన్ని నమ్మినవాడు. పురందరదాసు మధ్వ సంప్రదాయాన్ని ప్రతిపాదించినాడు. రాకమచర్ల వేంకటదాసు దాస సంప్రదాయాన్ని నిలిపినాడు. వీరందరు కూడ దేశీయ కవితా సంప్రదాయ కవులు- గాయకులు సంకీర్తనాచార్యులు. గృహస్థ జీవితాన్ని అనుభవించినవారు. యోగసారాన్ని కోరినవారు.

అన్నమయ్య రాకమచర్ల వేంకటదాసు శ్రీరామునిపై పాడిన కీర్తనలు :

అన్నమయ్య - కీర్తన : ***బౌళిరామక్రియ***

పల్లవి : ***ఇతడే పరబ్రహ్మమిదియె రామకథ***
శతకోటి విస్తరము సర్వపుణ్య ఫలము
చరణము: ***ధరలో రాముడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె***
అరణ్యవాసుల కెల్లానభయమిచ్చె
సారధి ముక్కుఁ జెవులు చప్పనాతిని గోసె
ఖరదూషణులను ఖండించి వేసె ***॥ ఇతడే ॥***

అనే కీర్తనలో అన్నమయ్య దశరథుని పుత్రుడగు రాముడు జన్మించి జనకజను లగ్నమాడి, విశ్వామిత్రాది ఋషుల బాధలు తీర్చెననీ, రావణుని ఖరదూషణాదులను రాముడు సంహరించెననీ రామకథను కీర్తించినాడు.

రాకమచర్ల వేంకటదాసు : "రార రఘువీర దయానిదే చారుమకుట మణిహార ఖరాంతక" – "రామరావదే ! బాధలుతీర్చగ రారాదా! దీనుల కాపాడరావ రామా!" అని కీర్తించాడు.

అన్నమయ్య : కినిసి వాలి జంపి కిష్కింధ సుగ్రీవు కిచ్చె
వనధి బంధించి దాటి వానరులతో
కనలి రావణ కుంభకర్ణాదులను జంపి
వనితఁ జేకొని మళ్లి వచ్చె నయోధ్యకును ॥ఇతడే॥

వాలిని చంపిన రాముడు సుగ్రీవునకు కిష్కింధను ధారాదత్తము చేశాడు. వారధి కట్టి వానరులతో లంకలో చేరి, కోపించి రావణాదులజంపి సీతను అయోధ్యనకు దెచ్చి రాజ్యమేలాడు.

రాకమచర్ల వేంకటదాసు రామునిపై ....

పాలిత ముని జనలోల పరాత్పర ! కరదీనవరీబాల మురాంతకా
జాలమింకేల విశాల దయాళ సునీల శరీర బుధాలి వినుత మునిలోల
మహాత్మక శ్రీలలనా మణిలోల కరుణతో.... ॥ రా ॥

మునిజనరక్ష దయార్ద్ర హృదయుడా ! రామా - బుధులు కొలిచినారు నిన్ను నీల మేఘశ్యామ నన్ను కరుణతో కాపాడుమని ప్రార్థించినాడు.

అన్నమయ్య : కీర్తన-

పల్లవి : రాముడులోకాభి రాముడు వీఁడిగో
వేమారు మొక్కుచు సేవించరో జనులు..... ॥ప ॥

చరణం : చెలువపు రూపమున జితకాముడు
మలసీ బిరుదున సమరభీముడు
పొలుపైన సాకేతపుర రాముడు
ఇలలో ప్రజలకెల్లా హిమధాములు ॥ రాము॥

రాముడు చల్లనివాడు, దయాగుణ సంపన్నుడు ప్రజల కాపాడువాడని చెప్పిన అన్నమయ్య కీర్తనకు రాకమచర్ల వేంకటదాసు కీర్తన :

అప్పారామప్ప దయ గుప్పవేమె
గొప్పదాతావు మనసొప్పవేమె ॥ ప ॥
యప్పుడెప్పుడు నిను తప్పక నుతింపగను

తప్పులెన్నిన మాట జెప్పవే ॥ అ ॥
యందుకనిరావు కనుగొందు నీ సుందరము
సందియము చిత్తమున జెందనేమో ॥ అ ॥
బూటకము లేదు నాతోటి జతగూడుమిక
నాటివలె సూటి మాటడవేమె ॥ అ ॥
నిన్ను కనుగొన్న మది లెన్ని
వినుతించెదను నన్ను బ్రోవావు నా నేరమేమె ॥ అ ॥
సారెకును రాకమచర్ల స్వామివని వేడితిని
గారమున నను జేరవేమె ॥ అ ॥

అని వెంకటదాసు తనదైన దేశీయ భాషాశైలి - జానపద ఫక్కీలో తెలంగాణాలో ముఖ్యముగా రంగారెడ్డి జిల్లా మాండలిక భాషలో ప్రయోగించిన పదములు ఉన్నవి. అప్పా అనేది కన్నడ పదము ఇది పరిగి, వికారాబాదు ప్రాంతంలో అధికంగా తెలుగువారు- ఇతరులు కూడా వాడే మాండలిక భాష ఇది. తండ్రికి బదులుగా అప్పా అనే కన్నడ పదం తెలుగులో చేరిపోయిన ఇందలి పదాలను అర్థాలు కొన్ని :

గుప్పుట = వెదజల్లుట, వేమె = ఏమే (ఈ మాట ప్రేమతో తల్లిని, తండ్రిని, పెద్దవారిని ఆప్యాయంగా పిలిచే పదం) యందుకని = ఎందుకని; జతగూడుమనుట = నన్ను నీలో చేర్చుకొమ్మనుట అనగా ముక్తి కల్పించుమని కోరుట. సారెకును = మాటిమాటికి అనే పదాలు పాలమూరు, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికంగా వాడబడుతున్నవి.

అన్నమయ్య కీర్తన: రామనామం దివ్యౌషధమని పేర్కొనుట :-

పల్లవి : అన్నిటికి నిది పరమౌషధము
ఎన్న నీ నామమే విమలౌషధము

చరణము : చిత్తశాంతికిని శ్రీపతి నామమె
హత్తిన నిజ దివ్యౌషధము
మొత్తపు బంధ విమోచనంబునకు
చిత్తజగురుదే సిద్ధౌషధము - అని హరినామ స్మరణగా రాముని

పావన నామస్మరణగా అన్నమయ్య వేడుకొన్నాడు. దీనికి ప్రతి రూపంగా రాకమచర్ల వెంకటదాసు కీర్తన.

రాకమచర్ల కీర్తన :

రామదశరథరామ పావన నామ శ్రీరామ సదాగుణ ధామ గురు రామ ॥ప॥
శ్రీమదంచిత సోమవదన విరామ మోహన రాధినాయక ॥ రా ॥
దేవహృదయ సంజీవ సంతత భావజ జనకా !
మహాయోగి భావ సంచారకా కేవలానంద సేవకావన కోవిదాశ్రిత శ్రీవరా రఘు
॥ రామ ॥

చారుతర సుకుమార సకలభూభార జగధీరా
భవాంతక భాను సంకాశా !
నీరదాభ శరీర కామ వికారదూర సురారి భంజిత ॥ రా ॥
మానవాంగన సమాన వర్జిత మానితాటోప
కౌసల్య కుమార చిద్రూపా దీనజన సన్నిధాన విమల విజ్ఞాన ధర్మవిధాన కారణ ॥ రా ॥
భాసమాన విలాస వెంకటదాస పరిపాలా
రాకమచర్ల వాస మునిలోలా - భూసురాత్మ వికాస వరద దరహాస
వదన ఖలా సురారాంతక - ॥ రామ దశరథ ॥

రాముని నామమే పావనం. భూభారాన్ని మోసేవాడవు. నీలమేఘశ్యాముడవు. వికారాదులను దూరం చేసే వాడవు. కౌసల్య రాముడవు. దీనుల రక్షించేవాడవు. ధర్మ పరుడవు నీవు రామా! వేంకటదాసుని రక్షింపరావా! అని కీర్తించాడు.

అన్నమయ్య కీర్తన రామునిపై భక్తితో...

పల్లవి : *జిగురువంటివాడె శినకాటి చింత*
శిగురమ్మ c బోనీదె శినకాటి

చరణం : *సేతి కుత్తికవాడు సెడకుండ దాచిన*
పాత పెద్ద విల్లు బలువున
నాతి కొరకు వచ్చి నడిమికి విఱిశిన
శేతలాడుగదె శినకాటి ॥ జిగురు ॥

చేదుకుత్తుకవాడు శివుడు తన విల్లును చెడకుండ దాచినాడు జనకుడు. దానిని విరిచినాడు రాముడు అని కీర్తనలోని భావం.

రాకమచర్ల వేంకటదాసు:

రామా భూపతె ! మహారాజ శ్రీపతే ॥ ప ॥

కామజనక సార్వభౌమ ! కలిత సుగుణ మయ విరామ – అనే కీర్తనలో రాముని విలాస వర్ణన జానపదంలో తెలిపాడు.

అన్నమయ్య :

రావణ కుంభకర్ణాధి రాకాసుల పరిమార్చి
ఈవల అయోధ్యా పట్నమేలిన వాడు
శ్రీవేంకటాద్రి చేరి మాల్యవంతమున
వేవేలు చందములను వెలసినవాడు – అని రాముని ప్రతాపాన్ని అన్నమయ్య వర్ణించి, చివరికి వేంకటాద్రిని చేరినావని కీర్తించగా –

రాకమచర్ల వేంకటదాసు –

నమ్మితిగదరా రామయ్య నన్ను సన్నుతించరా రామయ్య ॥ ప ॥
సిరిగల రాకమచర్ల స్వామి వని నమ్మితి ॥ *గదరా* ॥

నమ్మితి రామా నిన్ను అని రాకమచర్ల స్వామి పై విశ్వాసాన్ని ప్రకటించాడు.

అన్నమయ్య కీర్తన : హిందోళరాగము – తాళం : ఖండం

దేవ దేవం భజే దివ్య ప్రభావం
రావణాసుర వైరి రఘు పుంగవం – అని రాముని మహిమలను కీర్తించగా –

రాకమచర్ల – కీర్తన ; *అట తాళం :*

శరణు శరణు రాఘవా ! మహానుభావా! శరుణు శరణు ॥ ప ॥
వరసుజనావన దురిత నివారణ ! పరమపావన నామ పంకజలోచన –
అని పొగడినాడు.

అన్నమయ్య -

గౌతముని భార్య పాలిటి కామధేనువితడు
ఘాతల కౌశికుపాలి కల్పవృక్షము
సీతాదేవి పాలిటి చింతామణి ఇతడు
ఈతడు దాసుల పాలి ఇహపర దైవము..... - అనగా

రాకమచర్ల వెంకటదాసు -

సీతా సమేత విధాతాదిశేవిత గౌతమ సతి శాపకలుష విహారా - శరణు శరణు రాఘవా! మహానుభావా! శరణు శరణు గౌతముని ఇల్లాని బ్రోచినవాడా! నను బ్రోవరాదా" - అని వేడుకొన్నాడు.

హే రామయ్య ! మ్రొక్కిదవేగరా రామయ్య....
సరస రాకమచర్ల సాక్షిగ నిన్ను మరులు కొన్న మాట మరుగు మాటలాయ !

ఇందులో - రాకమచర్ల మధురభక్తి వ్యక్తమవుతుంది.

జానపదములు కొన్ని - మొలకనవ్వులు, చిలుకపలుకులు, చిన్ని వెన్నెలకన్న, వ్యారరా, న్యారరా, వ్యాసారక - వేసారక, అలసట చెందక, కోరికలూర = కోరికలుగలుగ, కమనియన= కమనీయ, హట్టు జేసెద స్వామి = కట్టడి చేసెద కట్టడి తనమాయె,యన్నటికైన = ఎన్నటికైన యడాగమాలు మెండు; తత్తారమును = తత్సారమును, ఆలస్యమును, వక్కసారి= ఒక్కసారి, చిలుక వయ్యారములు గుల్క , నన్నరమరశాయకు = నన్ను అలక్ష్యం, అశ్రద్ధ చేయకుము ; సాకీన నీవే = రక్షించిన నీవె, చంగలించె= గంతులు వేసే, యెవ్వాళ్ళ = ఏ వేళ, ఏనాడు జల్తారు = జలతారు, పచ్చ శాలు మేనగప్పరయ్య రామయ్య, తావులు గుమ్మరింపగ = పరిమళాలు చల్లగా;

అచ్చపు భక్తిని అనుసరించితిని పచ్చల పీఠము బాగుగ చెప్పెద !! రారా రామయ్య 'పచ్చలు దాపిన పీఠము ' ఇలాంటి అచ్చమైన తెలుగు పదాలు, దేశీయ భాషకు నిదర్శనమైనవి.

రాకమచర్ల వేంకటదాసుకు పాండురంగని పై మెండైన భక్తి ఉంది. మంగళహారతి పేరున ఆయనను దండిగా కీర్తించినవాడు ఒక హారతి మరాఠీ భాషలోను వ్రాసినాడు.

అన్నమయ్య :

పల్లవి : *నిచ్చ నిచ్చ సోబనాలు నెలమూడు సోబనాలు*
హెచ్చు నీకు నింతలోనె ఇవి గదవయ్యా ! – అని

నిత్యం సాగే వేడుకలు కాక, నెలకు మూడు ఉత్సవాలు అధికంగా జరుగుతాయని చెప్పినాడు.

రాకమచర్ల వేంకటదాసు : దేవతలకు ఇచ్చే హారతులు 1. సద్గురు హారతి (ఉమ్మెంత్తల యోగానంద నరసింహ స్వామికి) 2. ఉమ్మెంతల వేంకటనాధుని పేరున హారతి, 3. శ్రీపాండురంగ మంగళహారతి, 4. శ్రీ రుక్మిణీ దేవి హారతి, 5. శ్రీ మారుతి హారతి, 6. శ్రీమాణిక్ ప్రభు హారతి, 7. శివ హారతి (మరాఠి భాషలో) , 8. తుకారాం హారతి. వీటిలో మరాఠీ భాష హారతిస్తుతి చిహ్నముగా గ్రహించితిని : అది

నిర్వికార బ్రహ్మ వ్యక్తి సి ఆలె! యేవుని వాలవంటివి భారహేలే భక్త పుండలీక ధర భణివుకేలే సంతమ్మణ అముచిమనాచి జాహలె! జైదేవ! జై దేవ జై జై విఠలా తుఝె దర్శన మాత్ర బంధన తూటాల ! జై దేవ! తూఝెనామ ఘేతాతర లేకితుకే పాపి సర్వే ముక్త ఝూలే కితూరే ॥ జై దేవ ॥ శివాకర ముకుట కస్తూరి ఫాళి ! కరకటవారి శోభేవన మాళి ! బ్రహ్మ సుఖాచి ఘేవునిని అతి గుండా ప్రాణా జ్యోతి హారతి వోవాళి ॥ జై దేవ ॥

అనే మంగళ హారతినిచ్చి 500 కీర్తనల తర్వాత రచించి ముగించినాడు. ఇట్లు, అన్నమయ్య – రాకమచర్ల వెంకటదాసుల వారి రామనామ స్మరణ జరిగినది.

***

6

అన్నమయ్య - రామదాసు

డా॥ బూర్గుల కేశవులు
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆంధ్ర సాహిత్యంలో ప్రసిద్ధ వాగ్గేయకారులు అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజు రామదాసు ముఖ్యులు. అన్నమయ్య అందరికంటే పెద్దవాడు. వైష్ణవ భక్తాగ్రేసరుడు. వాగ్గేయకార లక్షణాలన్నీ అన్నమయ్యలో మూర్తీభవించినవి. ఇతడే మిగతా వాగ్గేయకారులకు మార్గదర్శకుడు. గురుతుల్యుడు. ఇతడు క్రీ.శ. 1408- 1503 మధ్య కాలంలో జీవించినాడు. ఇతడు వైష్ణవ మత గురువుల దగ్గర శంఖు చక్రాంకితాలను పొంది వైష్ణవునిగా మారినాడు. ఇతని కాలంలో శైవ, వైష్ణవ మతాల వైరుధ్యం ఉండేది. ఇతడు హిందూ రాజు కోరిక ప్రకారం సంకీర్తన పాడనందులకు కోపానికి గురియై సంకెళ్ళు పడినవి. అన్నమయ్య సాటి వాగ్గేయకారులను భగవంతునిగా భావించే మంచి మనస్సు కల్గినవాడు. ఆంధ్రవాగ్గేయకారులకు పితృతుల్యమైన వాగ్గేయాంశాలు ఇతనిలో గోచరిస్తున్నాయి.

బహుళ ప్రఖ్యాతి చెందిన కంచెర్ల గోపన్న రామదాసుగా ప్రసిద్ధుడు. మహానుభావులకు చిన్న సంఘటనతో పేర్లు మారుతాయి. జీవితమే మరో మలుపు తిరుగుతుంది. రామదాసు జీవితం కూడా అట్లే మారింది. రామదాసు 1620-1680 మధ్య కాలంలో జీవించాడు. ఇతని గురువు కబీరుదాసు తారకమంత్రోపదేశం చేశాడు. వెంటనే రామదాసు ***"తారక మంత్రము కోరిన దొరికెను. ధన్యుడనైతిని ఓరన్నా"*** - అని కోరుకున్న వెంటనే తారక మంత్రం దొరికింది నా జన్మ ధన్యమైంది. పుణ్యనదులలో మునుగుట ఎందుకు జన్మ జన్మలలో చూచినగాని, నారాయణుని కథ విన్న అన్ని జన్మలలోని పాపాలు ఈ జన్మలో తొలిగిపోతాయి. ఇదియే కడసారి జన్మ. అని శ్రీరాముని మనస్సులో రామదాసు నిలుపుకొన్నాడు.

అన్నమయ్య శఠగోపముని యొద్ద వేదాంత శాస్త్రం నభ్యసించాడు. పంచ సంస్కారం పొందాడు. అప్పటి నుండి వైష్ణవులతో కలిసి భుజించసాగాడు.

"అదిగో అల్లదిగో శ్రీహరివాసము...
పదివేల శేషుల పడగల మయము "

ఏడుకొండలవాడు వెంకటరమణుడు శ్రీ వేంకటేశ్వరస్వామి. అదిగో చూడు అల్లదిగో ఆ దూరంలోనే కనపడుచున్నదే శ్రీనివాసుని నివాసం. పదివేల పడగల సమూహమే వేంకటేశ్వరుని పర్వతం. భూలోకంలో ఉన్నతమైంది. బ్రహ్మాది దేవతలకు అపురూపమైంది. దేవతల నిజ నివాసం అందున్న మూలధనం. బంగారు శిఖరాలలోను బ్రహ్మాది దేవతలతోను కూడుకున్న ప్రదేశం. వేంకటేశ్వరుని కొండలు సకల సంపదలతో కూడుకున్నవి. ఈ విధంగా అన్నమయ్య పదాన్ని తలపించేదే రామదాసు కీర్తన – *'అదిగోభద్రాద్రి'* అనేది.

అన్నమయ్య సాళువ నరసింగరాయలు తన ఆస్థానంలో స్వామిపై శృంగార సంకీర్తనలను ఇలా గానం చేశాడు.

"ఏమొకో చిగురుటధరమున యెడ నెడగస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా "

మధురాతి మధురంగా పాడినాడు. అటువంటి పాట తనపై ఒకటి పాడమని రాజు కోరాడు. అందుకు అన్నమయ్య తిరస్కరించాడు. రాజు కోపంతో సంకెళ్ళు వేయించాడు.

"ఆకటి వేళల అ పైన వేళలను
తేకువ హరినామమె దిక్కు మరి లేదు
కొఱమాలియున్న వేళ కులము చెడిన వేళ
చెఱవడి యొరులచే చిక్కిన వేళ
ఒఱపైన హరినామ మొక్కటే గతి గాక
మఱచి తప్పిననైన మరిలేదు తెరగు.
ఆపదవచ్చిన వేళ ఆరడి బడిన వేళ
పాపపు వేళల భయపడిన వేళ
ఓపినంత హరినామ మొక్కటే గతిగాక

మాపుదాకా పొరలిన మరిలేదు తెరగు.

సంకెల బెట్టిన వేళ చంపబిలిచిన వేళ

అంకిలిగా నప్పులవా రాగిన వేళ

వేంకటేశు నామమే విడిపించ గలిగాక

మంకు బుద్ధిబొరలిన మరిలేదు తెరగు...”

ఈ కీర్తన పాడగానే సంకెళ్ళు తెగి క్రిందపడినవి. రాయలు కోపంతో మరల సంకెళ్ళు వేయించాడు. పరమభక్తుడగు అన్నమయ్య మరల సంకీర్తనం పాడినాడు. సంకెళ్లు తెగిపోయాయి అన్నమయ్య మహిమను కన్నులారా చూచిన రాయలు క్షమాపణ వేడినాడు. ఇలా అన్నమయ్య స్వామి మహిమ లోకానికి చాటాడు.

రామదాసు పుత్రుడు ప్రమాద వశాత్తూ మరణించాడు. అప్పుడు శ్రీరాముని వేడుకొని ఒక సంకీర్తన పాడినాడు.

“ఎంత పని చేసితివి రామా నిన్నేమనందును సార్వభౌమా

చిన్నలన్నియు దరిగియున్న ఈ చిన్నన్న గ్రన్న నను చూడు మాయన్న రామన్నా”
–అని ఆవేశంతో పాడగా శ్రీరామునను గ్రహంతో బాలుడు బ్రతికినాడు. ఈ విధంగా శ్రీరాముని యొక్క మహిమను రామదాసు లోకానికి చాటి చెప్పాడు.

“నీవు పంపిన తహసిల్ పనిలో నిజముగాను నేనున్నాన్న

భావములో హరిభక్తి విడువగ బహు భద్రముగా నేనున్న

జీవధారుడౌ రాముని కోవెల జీర్ణోద్ధారణ నేను

నీవాడై నే జేసితి హజరత్ నీ ధర్మంబది యనెను

గోపన్న చేసిన కైంకర్యమునకు కొంత తడవు నూహించి

ఏపునమును పటి సుకృతము మనమున నెలమి మీర యోచించి

గోపన్నపై నే కోపము చేయక కొంచెముగా విడిచినను

ఈ పగిదిగ తహసీల్ దార్లందరు నెంచక వదుతురు తుదను”

అని తానీషా రామదాసును ఖైదుకు తీసుకొని పొమ్మని ఉత్తరువు చేసే సమయంలో శ్రీరాముల వారికి ఇలా రామదాసు మొరపెట్టుకున్నాడు.

"ఏడనున్నాడో భద్రాద్రి వాసుదేడనున్నాడో
నా పాలి రాముదేడనున్నాడో
ఏడనున్నాడో వాని జాడ తెలియరాదు
నాడు గజేంద్రుని కీడు బాపిన స్వామి "

రామదాసు బంధిఖానాలో కూడా రామునినే వేడుకుంటూ - **"ఎటు బోతివో రామ,** *నాపై నిందలను బాపిన నీకు మ్రొక్కుతాను స్వామి "* అని ఈ విధంగా అన్నమయ్య మరియు రామదాసులు ఇర్వురు వాగ్గేయకారులు రాజుల యొక్క కోపానికి గురియై బంధింపబడినారు. ఇరువురు తమ ఇష్టదైవాన్ని కీర్తించినారు. అలవోకగా అనేక కీర్తనలు పాడుకున్నారు. అన్నమయ్యకు వేంకటేశ్వర స్వామి వెంటనే దర్శనమిచ్చి కష్టములను బాపినాడు. రామదాసుని యెడల శ్రీరాముడు 12 సం.లకు దర్శనమైనట్లు తెలుస్తున్నది.

"ఊరికే దొరకునా వున్నతోన్నత సుఖము
సారంబు దెలిసెకా జయము చేకొనుట
తలపు లోపలి చింత దాటినప్పుదు గదా
అ లరి దైవంబు ప్రత్యక్షమౌట
కలుషంపు దుర్మదము గడచినప్పుదు గదా
తలకొన్న మోక్షంబు తనకు జేపడుట " - (అన్నమయ్య)

"తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా!
మీరిన కాలుని దూతల పాలిట మృత్యువుయని మదిన నమ్మన్న
మచ్చికతోని తరాంతరంబుల మాయలలో పడబోకన్న
హెచ్చుగ నూటయెనిమిది తిరుపతులెలమి తిరుగపని లేదన్న
ముచ్చటగా నా పుణ్య నదులలో మునుగుట పనియేమిటి కన్న" -

పదాల కూర్పులోను, వర్ణనలోను, భావంలోను, భక్తిలోను అన్నమయ్య ప్రభావం రామదాసుపై కలదనుటకు ఈ కీర్తనలే మనకు నిదర్శనం.

ఇప్పుడిటుల కలగంటి నెల్లలోకములకు
నప్పుడగు తిరువేంకటాదీశు గంటి
అతిశయంబైన శేషాద్రి శిఖరము గంటి

ప్రతిలేని గోపుర ప్రభలు గంటి

శతకోటి సూర్య తేజములు వెలుగగ గంటి

చతురాస్య బొడగంటి చయ్యన మేలుకంటి

అరుదైన శంఖ చక్రాదులిరుగడ గంటి

సరిలేని అభయ హస్తము గంటిని

తిరువేంకటాచలాధిపుని జూడగ గంటి

హరిగంటి గురుగంటినంతట మేలుకంటి –

తిరుపతి వేంకటేశ్వరుని కలలో చూచినాను. లోకంలోనే ఒక విశిష్ఠమైన శేషాద్రి శిఖరంను చూచినాను. వేంకటేశ్వరుని గోపురం వంటి గోపురం లోకంలో మరొక్కటి లేదు. ప్రకాశవంతమైన గోపురపు వెలుగులు చూచినాను. విష్ణుమూర్తి యొక్క శంఖచక్రాదులను చూచినాను. సమానమే లేని వేంకటేశ్వరుని అభయ మొసగే చేతిని చూచినాను. విష్ణుమూర్తిని చూచితిని తిరుమంత్రోపదేశం చేసిన గురువును చూచినాను. విష్ణు భక్తులకు జరుగు మేలును కూడ చూచితిని అని అన్నమయ్య సంకీర్తనల ద్వారా లోకానికి తెలిపాడు.

ఇట్లే రామదాసు కూడా తాను భద్రాచలంలో చూచిన విషయాలను వర్ణించిన తీరు అన్నమయ్య ప్రభావం గోచరిస్తుంది. అన్నమయ్య కీర్తనలను రామదాసు పఠించినాడా అని తోస్తుంది. ఇర్వురు వాగ్గేయకారులు తుల్యమైన వర్ణనలు చేటం మన అదృష్టం.

"కంటి నేడు మారాముల కనుగొంటి నేడు

కంటి నేడు భక్త గణముల మాపాలి మాజంట – భద్రగిరి వంటి యున్నవాని

చెలువొప్పుచున్నట్టి సీతాసమేతుండై కొలువు తీరిన మా కోదండరాము

కమలాప్త తిలకము ఘననీల గాత్రము

కరుణా రసము గురియు కందోయి గలవాని

హుకుమంజి ముత్యాల సరములు మెరయగ

మురిపెంపు చిరునవ్వు మోము గలిగిన వాని

ఘల్లు ఘల్లుమని పైడి గజ్జెలందెలు మ్రోయ

తళుకు బెళుకు పాదతలము గలిగిన వాని

కరకు బంగారు చేల కాంతి జగము గప్ప

శర చాపములు కేల ధరియించు స్వామి
ధరణి శ్రీరామదాసుని రక్షించు
పరమ పురుషుడైన భద్రగిరీశుని-

శ్రీరాముని నేడు చూడ గల్గినాను. స్వామిని తెలుసుకుంటిని. హరిదాసుల బృందంతో గూడుకొని రామ భజన చేస్తూ చాలా పరమానందముతో భద్రశైల శిఖరంలో నున్నటువంటి సీతా సమేతుడైన కోదండరాముని చూచాను. కరుణ రసం కల్గిన కన్నులవాని, చిరునవ్వు మోము కల్గిన వాని, ఘల్లు ఘల్లుమని గజ్జెలందెలు మ్రోయువాని, పాదాలు తళుకుమనెడి వాని, చేతిలో విల్లుధరించిన స్వామి, భూమిపై శ్రీరామదాసుని రక్షించు పరమ పురుషుడు భద్రగిరి రామ చంద్రుడు.

అర్చకులు రాములవారి దర్శనంబిచ్చుటకు తీర్థ తిరుమాల, శరగోపములు రామదాసు కొసంగినారు. అన్నమయ్యను కూడా విప్రుల ద్వారా స్వామి తన దగ్గరకు చేర్చుకున్నాడు. ఇర్వురిని భగవంతుడే తన దగ్గరకు చేర్చుకున్నాడు.

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్య కోనేటి రాయడా
కోరిమమ్ము నేలినట్టి కుల దైవమా, చాల
నేరిచి పెద్ద లిచ్చిన విధానమా....
గారవించి దప్పిదీర్చు కాల మేఘమా, మాకు
చేరువ జిత్తములోని శ్రీనివాసుడా ॥

అన్నమయ్యకు శ్రీవేంకటేశ్వరుడు మసక మబ్బు రూపంలో కనపడినాడు. స్వామి ప్రత్యక్షమైన రూపాన్ని చూచుటకు కూడ తగిన యోగ్యత యుండాలి. అటువంటి యోగ్యత కల్గిన వ్యక్తి అన్నమయ్య.

కల నిజమాయె కలికిరో వినవే
కల నిజమాయెనే
చూపున బాలురే సొగసైన రౌతులే
రేపనరాదే యోరమా మణి నమ్మలేదు
నా మదిలో నను నరులని గానరే
నీ మహిమలోనే నెరుగని వారే ॥

శ్రీరామచంద్రుని అనేక విధముల భక్తి ప్రపత్తులతో ఆడటం, పాడటం, ఊహించుకోవటం నిద్రలో కలకనటం జరిగినది. అదే నిజమైంది. శ్రీరామచంద్రుడు,లక్ష్మణ సహితుండయి నిజదాసుండగు గోపన యొక్క శ్రమ నివారణకు ఆరు లక్షల పైకము చెల్లించి రశీదు తీసుకొనినాడు. ఆ తరువాత ఈ పైకము చెల్లించినవారు రామలక్ష్మణులేనని తానీషాగారు భావించారు. రామలక్ష్మణులు బంధిఖానాలో నిజదాసుడైన రామదాసుని చూచి శ్రమ నివారణ చేసినారు.

అన్నమయ్య, రామదాసుల యొక్క కీర్తనలే దాసర్లకు పరమ పవిత్రములైన భక్తి గీతాలు వీధులలో ఇర్వురి గేయాలు పాడుకుంటారు. పామరజనం ఆటపాటలకు కూడా వారి గీతాలు అనుకూలంగా నున్నవి. వైష్ణవులకు శ్రీరామచంద్రుడు, వేంకటేశ్వరులు వారి ఇలవేల్పులు.

సాహిత్యం, సంగీతం, నృత్యం తోబుట్టువులు. రాగయుక్తముగా పాడుతూ, తన కరచరణాదులను లయబద్ధంగా కదిలినపుడే నాట్యమవతరించినది. మానవుని సహజమైన బ్రతుకుబాటలోనే ఇవి పెనవేసుకుపోయినవి.

వాఙ్మాతురుచ్యతే గేయంధాతురిత్యభిధీయతే।
వాచం గేయం చ కురుతే యః స వాగ్గేయ కారకః ॥

తన భావమును లయ బద్ధముగా నాదముతో పాడగలవాడే వాగ్గేయకారుడని శార్ఙ్గ దేవుడు పేర్కొన్నాడు. తెలుగు వాఙ్మయంలో అగ్రగణ్యుడైన మహాకవి అన్నమయ్య. ఉత్తమ వాగ్గేయకారుడు. పండిత పామరులకు యోగ్యమైన సంకీర్తనములను రచించాడు. అందు వైష్ణవ భక్తియే ప్రధానమైనది.

బహుళ ప్రఖ్యాతి చెందిన కంచెర్ల గోపన్న భద్రాచల రామదాసుగా వాగ్గేయకారులలో సుప్రసిద్ధుడు. వీరి కీర్తనలలో ఆర్తి, భక్తి, భావం, సహజధార, పామరులు సహితం పాడుకొనుటకు వీలుగానున్నాయి. రామదాసు భక్తుడుగా జన్మించినాడు. ఆశువుగా పాడుకుంటే అవి రామకీర్తనలుగా వెలసినవి. ఇవి భజన కూటాల్లో పాడుకొను భజన కీర్తనలుగానే ప్రచారం జరిగినవి. రామదాసు కీర్తనలు బహుజన ప్రయోజనార్థం భజన కీర్తనలుగా నుండుటయే మంచిది. క్షీణిస్తున్న భజన సంప్రదాయాన్ని పుర్జీవింపజేసి రామదాసు కీర్తనలను మనుషుల మందిరంలో నిలబెట్టవలసినవసరం ఎంతయినా ఉన్నది.

***

7

అన్నమయ్య పోతులూరి వీరబ్రహ్మం

ఆచార్య డా. మనస చెన్నప్ప
ప్రొఫెసర్, తెలుగుశాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

ప్రకృతిలోలాగా సమాజంలోనూ మార్పులు అనివార్యం లక్షణం. ప్రపంచ చరిత్ర పుటల్ని తిరగేస్తే ఎందరో మహానుభావులు కనిపిస్తారు. వారివల్ల సమాజంలో ఎన్నో మార్పులు జరిగాయి. ఇవన్నీ సంస్కరణల ఫలితాలే.

ఒక రాముడుగాని, ఒక కృష్ణుడుగాని, యుగాలను ప్రభావితం చేస్తే, రెండు వేల సంవత్సరాలకు అవతల ఎందరో మహాపురుషులు జన్మించి సామాజికంగా మార్పులకు చిత్తేజాన్ని కల్పించారు. భారతదేశానికి సంబంధించినంత వరకు బుద్ధుడు, శంకరుడు, రామానుజుడు, మధ్వుడు, దయానందుడు సమాజంలోని రుగ్మతలకు ఆధ్యాత్మికంగా చికిత్స చేశారు. వీరి మధ్యన నిలవగలిగి తెలుగునాట సామాన్యుల్లోనూ భక్తి, సంస్కరణ బీజాలను నాటటానికి ప్రయత్నించి సఫలులైన మహానుభావులే తాళ్లపాక అన్నమయ్య, పోతులూరి వీరబ్రహ్మం గారు.

మతం అంటే అందని ద్రాక్షపండుగా కాక, అన్ని విధాలా జీవితానికి మార్గోపదేశం చేయగల్గిన ఒక తాత్విక చింతన అని నిరూపించిన వారు అన్నమయ్య - వీరబ్రహ్మం గార్లు.

మూఢనమ్మకాల ఊబిలో కూరుకొని పోయిన తెలుగు సమాజాన్ని భక్తి జ్ఞాన స్రోతస్విసులలో ఓలలాడించిన గౌరవం ఆ ఇద్దరిదే. ఇద్దరి కాలాలు కొంచెం వేరైనా ప్రజల్ని సమైక్య పరచడంలో వారి లక్ష్యం ఒక్కటే. ఇద్దరూ సామాన్య ప్రజల్లో కలిసిపోయినవారే.

అన్నమయ్య 1408-1503 మధ్య కాలంలో జీవించాడు. వీరబ్రహ్మం 17వ శతాబ్దం లోని వాడు. అన్నమయ్య సుమారు ఎనభై ఏండ్లు జీవిస్తే, వీరబ్రహ్మంగారు ఇంకో ఐదేళ్లు ఎక్కువగా జీవించాడు. అన్నమయ్యది విశిష్టాద్వైతం కాగా, వీరబ్రహ్మంది అద్వైతం.

అన్నమయ్య వైష్ణవుడు శ్రీవేంకటేశ్వరుని భక్తుడు. రోజుకొక కీర్తన చొప్పున ముప్పైరెండు వేల కీర్తనలను రచించిన పదకవితా పితామహుడు. ఇవన్నీ రాగిరేకుల మీద చెక్కింపబడ్డాయి. గృహస్థుడుగా ఉండి ముక్తికై ప్రయత్నించిన మహాభక్తుడు. తాళ్ళపాక, తిరుపతి, అహోబలాల్లో నివసిస్తూ కీర్తనలు రచించాడు. శఠగోపమతీంద్రుల దగ్గర వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు.

వీరబ్రహ్మం సిద్ధపురుషుడు. బ్రహ్మజ్ఞాని, కాలజ్ఞాన తత్వాలను, గోవింద వాక్యాలను రచించాడు. ఇవన్నీ తాటాకు పుస్తకాల్లో భద్రపరచబడినాయి. వీరబ్రహ్మం కూడా గృహస్థ జీవనంలో ఉండి ఆత్మజ్ఞానం చేత మోక్షం వైపు వెళ్లటానికి ప్రయత్నించాడు. అల్లాడు పల్లెలోని వీరభద్రస్వామియే వీరబ్రహ్మం గురువని తెలుస్తుంది. వీరబ్రహ్మంగారికి గురువెవరూ లేరనే వాదం కూడా ఉంది.

భక్తిచే కైవల్యాన్ని సాధించవచ్చునని అన్నమయ్య నిరూపిస్తే – వీరబ్రహ్మం రాజయోగం ద్వారా దాన్ని సాధించవచ్చునని తెలియజేశాడు. వీరబ్రహ్మం కమ్మరం వడ్రంగం చేస్తూనే లభించిన దానితో జీవితం గడిపాడు. గుణ కర్మలను బట్టి ఎవడైనా తత్త్వవేత్త కావచ్చునని నిరూపించడమే గాక, మూఢ విశ్వాసాలకు తావులేని ఆచరణకు భక్తిని జోడించాడు. అన్నమయ్య తేట తెలుగులో సంకీర్తనలను రచించగా, వీరబ్రహ్మం కూడా అదే విధంగా కీర్తనలను, తత్వాలను రచించాడు ఇద్దరూ ప్రజల భాషలో రాసి, ప్రజలకు దగ్గరివారయ్యారు.

కుల విద్వేషానికి తావులేని వైష్ణవతత్వాన్ని ప్రబోధించడం ద్వారా అన్నమయ్య ఏ విధంగా తన కాలంలో ప్రసిద్ధికెక్కాడో, అదే విధంగా వీరబ్రహ్మంగారు వేదసమ్మతమైన విషయాలను, ఉపనిషత్తులను వివరించడం ద్వారా తన కాలంలో సుప్రసిద్ధుడయ్యాడు. పద కర్తగా అన్నమయ్య విశిష్టమైన స్థానాన్ని సంపాదిస్తే సంస్కర్తగా వీరబ్రహ్మం పేరొందినాడు.

"శ్రీ వేంకటగిరి చెలగిన నీవే ...
తావున మదిలో తగిలితివి " - తాళ్లపాక పదసాహిత్యము సం.-3
ఆధ్యాత్మ సంకీర్తనలు, కీ. 2) అని అన్నమయ్య అంటే -
'నే జూచినానమ్మ నెలతరో తారకరాజ
యోగమునందు రాజిల్లు నా గురుని " - (కాలజ్ఞాన తత్త్వములు పు.4)
అని వీరబ్రహ్మం అంటాడు.

అవతారవాద వైశిష్ట్యం తెలిసిన అన్నమయ్య

"నరుడా యీతడు ఆదినారాయణుడు గాక

ధరణి కీరితి కెక్కె దశరథసుతుడు " అని ప్రస్తుతించగా

వీరబ్రహ్మం *"నే జూచినానే బ్రహ్మము నాలోనే జూచినానే సద్గురు నాలో నే జూచినానే "* అని నిరాకార పరబ్రహ్మకు కైమోడ్పులర్పిస్తాడు.

ఐతే – అన్నమయ్యకు నిర్గుణ పరతత్వం గురించి తెలియనిది కాదు. "నీవు దేవుడవు నేనొక జీవుడ" అన్న ఒక్క వాక్యం చాలు, దేవుడు జీవుని కంటే వేరైన వాడని చెప్పటానికి. ఇట్లే ఆయన ఒక చోట ఇలా అంటాడు.

"తనువే గుడియట తలయే శిఖరమట

పెను హృదయమే హరిపీఠమట

కనుగొన్న చూపులే ఘనదీపములట

తనలోపలి అంతర్యామికిని పలుకే మంత్రమట" – నిరాకార పరబ్రహ్మనే అంతర్యామిగా చెప్పుకొంటాం.

పుట్టుకతో అద్వైతి అయిన అన్నమయ్య *"అన్నియు నాలో నుండగ అవ్వలనేమి చూచేము?"* అని అహం బ్రహ్మాస్మి తత్వాన్ని ఆవిష్కరించాడు. *"దేవుడొక్కడే గురి తెలిసిన వారికి! యీవలావల చూచినానిక లేదు తెఱుగు"* అన్నప్పుడు సర్వం బ్రహ్మమయమేనన్న సిద్ధాంతం స్ఫురిస్తుంది. *"బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే...."* అన్నప్పుడు అన్నమయ్య హృదయాన్ని మనం అర్థం చేసుకొవచ్చు.

"మనసు మనసున బెనగి మనసు యేకము జేసి మనసు మర్మముగన్న దెఱుక" అంటూ మనసు యొక్క మర్మాన్ని తెలుసుకోవడమే జ్ఞానమని తెలియజేశాడు వీరబ్రహ్మం. వీరబ్రహ్మం విగ్రహారాధనకు విముఖుడు. ఈ విషయంలో ఆయన స్పందన కఠినంగా ఉంటుంది.

"చిల్లర రాళ్లకు మ్రొక్కుచునుంటే చిత్తము చెడిపోనొరే యొరే! చిత్తమునందున చిన్మయ జ్యోతిని చూచుచునుండుట సరేసరే " అని జ్ఞాన స్వరూపుడైన పరమాత్మను కనుగొనుమని చెప్పడమే గాక, అదే సమయంలో ఉపవాసాలు చేయడాన్ని గర్హిస్తాడు.

"ఒక్క పొద్దులని యెన్నుమనుంటే యొనరగ జెడుదువు ఒరే మొరే"
యేకమైన ఆ వైభవ మూర్తిని చూచుచునుండుట సరేసరే" అని .

వైష్ణవదీక్ష తీసుకొన్నవారికి ముద్రాధారణం (రెండు భుజాలపై శంఖ చక్రాలను కాల్చి ముద్రించుకోవడం) పుండ్రం (పొదుగుబొట్టు), నామం (శ్రీనివాస దాసః, రామానుజ దాసః) మంత్రం 'ఓం నమోనారాయణాయ' యాగం (భగవదారాధన పద్ధతి) అనే పంచ సంస్కారాలు ప్రధానమైనవి. వైష్ణవులకు 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరి ఉపాసనా మంత్రం. ఐతే అన్నమయ్య ప్రజామోదాన్ని బహుళంగా పొందడానికి చెప్పిన మంత్రం 'వేంకటేశు మంత్రం'. నారదుడు – నారాయణ మంత్రాన్ని, ప్రహ్లాదుడు నారసింహ మంత్రాన్ని, విభీషణుడు రామ మంత్రాన్ని, ధ్రువుడు వాసుదేవ మంత్రాన్ని, శుకుడు విష్ణు మంత్రాన్ని పఠించగా తాను వేంకటేశు మంత్రాన్ని పఠిస్తున్నట్లు – అది వెన్నెల వంటిదని (4 సం. అధ్యాత్మ సంకీర్తనలు కీ. 438) ప్రత్యేకించి చెప్పాడు.

సామాన్యులకు ఈ మంత్రాన్ని జపిస్తే ఈ లాభం కల్గుతుందని చెబితే వెంటనే నమ్మేస్తారు. వీరబ్రహ్మం కూడా *"పంచాక్షరీ మంత్ర పఠన చేయరన్నా! పఠన చేసిన యముడు పారిపోవునన్నా"* అని పంచాక్షరీ మంత్రాన్ని ప్రబోధించినప్పటికీ ప్రత్యేకించి *"ఓం, హ్రీం, క్లీం, శ్రీం, శివాయ బ్రహ్మణేనమః"* అనే ద్వాదశాక్షరీ మంత్రాన్ని కల్పించి, దాన్ని పన్నెండువేల సార్లు జపం చేస్తే మోక్షం లభిస్తుందని కాలజ్ఞానంలో రాశాడు.

అన్నమయ్య ముక్తికి ఆద్యంతాలు లేవంటాడు.

"కోటి జన్మములు యెత్తిన ముక్తికి
కొన మొదలేమియు గనరాదు" – (సం. 3 కీ. – 446)
వీరబ్రహ్మంగారు –

"చూపుల లోపల పాపాల నడుమను
వెలిగేటి ఆ పరంజ్యోతిని చూచినానమ్మా" (కాల. త.పు. 4)
అని ముక్తి మార్గాన్ని సూచిస్తాడు. అంతే కాదు *"కంటిమయ్యా కైవల్యము కన్నులయందు! వింటిమయ్యా ప్రణవనాదము వీనుల యందు"* – అని తానవలంబించిన యోగ సాధన పరమార్థాన్ని వివరిస్తాడు.

అన్నమయ్యకు శ్రీవేంకటేశుడే గురువూ, దైవమూ. కానీ వీరబ్రహ్మం మానవులకు ముక్తి మార్గాన్ని చూపించాలంటే గురువు తప్పనిసరి అవసరమని తెలిపినాడు.

" ఈ జన్మమిక దుర్లభమురా -
ఓరిసాజన్మ సాకార సద్గురుని గనరా"

"గురువుని చేరి మ్రొక్కితే బ్రతుక నేర్చేరు" - అని కూడా జీవితంలో మానవునికి గురువుతో గల అవసరాన్ని నిర్దేశించాడు.

వైష్ణవ సంప్రదాయంలో దాసభక్తి, శరణాగతి భక్తి ముఖ్యమైనవి. ***"మారు దైవములు లేరు। మరి నన్ను గావ । నిన్ను పేరుకొని శరణంటి । ఎడబాపుమాయ"*** అని అన్నమయ్య తన శరణాగతి భక్తిని ప్రకటించాడు. వీరబ్రహ్మంగారు మాత్రం పతంజలి అష్టాంగ యోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆత్మతత్వాన్ని తెలుసుకొని మార్గాన్ని ఉపదేశించాడు.

"చందమామ చందమామ చందమామ
ఈ సంధి తెలిపె జ్ఞానులెవరె చందమామ
కాయమను పుట్టలోన చందమామ
పాము మాయగానె మెలగుచుండు చందమామ
రామయను కట్టు కట్టె చందమామ
పామును ముక్తిచేసి పట్టవలెను చందమామ
పామును పట్టే యోగి యెవరు చందమామ
ఓహో! అతని పేరు సిద్ధగురుడు చందమామ" (కాల జ్ఞాన తత్వములు పు. 31)

అన్నమయ్య వైష్ణవం - కుల బేధాలకు తావిచ్చింది కాదు.

"ఏకులజుడేమి యెవ్వడైన నేమి
ఆకడ నాతడె హరినెరిగినవాడు " (ఆధ్యాత్మ సంకీర్తనలు సం. 1. కీ. 292)

వీరబ్రహ్మంగారు కేవలం ప్రభోదించిన వాడే కాక ఆచరణలో చూపించిన కర్మయోగి. మహ్మదీయుడైన సిద్ధప్పను, అట్టడుగు కులంలో జన్మించాడని చెప్పబడే కక్కయ్యను శిష్యులుగా చేసుకొని కులమత వైషమ్యాలకు తావులేని సమ సమాజాన్ని నిర్మించటానికి పూనుకొన్నాడు.

అన్నమయ్యగారి *"బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే"* అనే కీర్తనలో ***"నిండారరాజు నిద్రించు నిద్రయునొకటే, అండనే బంటు నిద్రదియునొకటే। మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే। చండాలుడుండేటి సరిభూమి యొకటే "*** అనే పంక్తులు గమనించినప్పుడు ఇంచుమించుగా అతడు వీరబ్రహ్మంగారి లాగానే తన తత్త్వాలను సామాన్య జనంలోకి తీసుకొని వెళ్లి, వారిలో మార్పు తేవటానికి యత్నించినట్లు కనిపిస్తుంది.

వీరబ్రహ్మం వైదిక పద్ధతిలో ఓంకార నాదాన్నే కాదు, సామాజిక సమరసతా నినాదాన్ని కూడా వినిపించాడు. ఎంతోమంది గృహస్థులను శిష్యులుగా, ప్రశిష్యులుగా చేసుకొన్నాడు. వేద విద్యను, ఉపనిషత్ సారాన్ని సామాన్య జనానికి, ముఖ్యంగా స్త్రీలకు చేరువుగా తెచ్చాడు.

భక్తి జ్ఞాన వైరాగ్యాలలో అన్నమయ్య, వీరబ్రహ్మం గార్లకు ఎన్నో పోలికలున్నాయి. ***"ఇది కల్లయనరాదు యిది నిశ్చయింపరాదు । పదిలాన గొలువగా ప్రత్యక్షయమ్యేవు"*** అని ప్రపంచ స్థితిని వచిస్తూ వేంకటేశ్వరుణ్ణే శరణువేడిన అన్నమయ్యను ప్రజలు ఎంతగా ఆదరించారో, ***"వచ్చినాడు వీరబ్రహ్మము ఓహో జనులారా! మీరు చింతలు మాని గురుని కోరుకొనరయ్యా"*** అని గురుకున్న ప్రాశస్త్యాన్ని చాటిన వీరబ్రహ్మం సద్గురువును కూడా అంతే ఆదరించారు.

వీరిద్దరికీ సంబంధించిన మహిమలు కూడా ప్రచారంలో ఉన్నాయి.

సాళువుగుండ నరసింహరాయుని చేత చెరసాలలో ఉంచబడిన అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుణ్ని స్తుతించి బంధ విముక్తుడైనట్లు ప్రచారంలో ఉన్నట్లే - వీరబ్రహ్మంగారు పోలేరమ్మతో నిప్పు తెప్పించడం, కక్కయ్య భార్యను రక్షించడం మొదలైన సంఘటనలు మహిమలుగా ప్రచారంలో ఉన్నాయి.

ఈ మహిమలను ప్రక్కనబెడితే, ఇద్దరి సంకీర్తనలు సామాన్యుల గుండెల్లో ఈనాటికీ వినిపిస్తూనే ఉన్నాయి. తెలుగు సాహిత్య చరిత్రలో ప్రజామోదం పొందిన తత్త్వ కవులుగా ఇద్దరూ వెలుగుతూనే ఉంటారు.

***

8

సూరదాసు సాహిత్యం

ఆచార్య డా. పి. మాణిక్యాంబ
విశ్రాంతాచార్యులు, హిందీశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

హిందీ భక్తి సాహిత్యం సమస్తం గానరస మాధుర్య సమన్వితమే. చాలామంది భక్త కవులు గాయకులే. గాయకులు కాకపోయినా వారి రచనలు సంగీతమయమై పాడుకోవటానికి వీలుగా ఉండి భక్తి గీతాలుగా ప్రచారంలో ఉన్నాయి. కబీర్, రైదాసు, అజ్జబదాస్ మొదలగు తత్త్వకవులు కూడా తమ రచనలను సంగీత బాణీల ద్వారా పాడుతూ ప్రచారం చేస్తూ ప్రజలను ప్రబోధించారు. పరమాత్ముని సాకార రూపంలో నిరంతరం ఆరాధించే రామభక్తులు కృష్ణభక్తులు అయిన కవులు తమ ఆరాధ్య దైవాన్ని భక్తి పారవశ్యాలతో పాడుతూ తన కళ్ళ ఎదుట సాక్షాత్కారింపజేసుకున్నవారే.

సూరదాసు, కంచనదాసు, కృష్ణదాసు, చతుర్భుజదాసు, నందదాసు, పరమానంద దాసు, గోవిందస్వామి, ఛీతాస్వామి – ఈ ఎనిమిది మంది భక్తకవులు హిందీ భక్తి సాహిత్యంలో “పుష్టి మార్గంలో” దీక్ష పొందిన “అష్టఛఅప్” కవులుగా ప్రసిద్ధులు. వీరందరూ వాగ్గేయ కారులే. వీరందరూ శ్రీనాథ మందిరంలో నిరంతర కృష్ణ పరమాత్ముని నిత్య లీలలను గానం చేస్తూ భక్తిరసామృతాన్ని ఆస్వాదన చేసేవారు. దీనిలో కృష్ణుని బాల్య క్రీడలు, ప్రభాత గీతాలు మధ్యాహ్న సేవలు, సాయం సేవలు, గోవర్ధన లీలలు, రాసలీలలు, విరహగీతాలు మొదలైన అనేక సందర్భాలను పరవశంగా తన్మయత్వంలో పాడుకునేవారు.

సూరదాసు హిందీ భక్తి సాహిత్యాకాశంలో సాక్షాత్తూ సూర్యుడే. ఆయన ప్రకాశం దివ్య తేజోమయం. అంధత్వం వలన ఆయన మనో నేత్రాలు మరింత శక్తివంతమైనాయి. ఆ దివ్య చక్షువులతో నిరంతరం శ్రీకృష్ణుని అపురూప సౌందర్యాన్ని ఆహ్లాదకరమైన బాల్య చేష్టలను మాధుర్య భరితమైన రాసలీలను ప్రత్యక్షంగా చూస్తూ, తన్మయత్వంతో గానం చేసేవాడు.

ఈ వ్యాసంలో సూరదాసు యొక్క మధురభక్తి సంబంధమైన గీతాలను మాత్రమే చర్చించటం జరిగింది.

శాండిల్య భక్తి సూత్రాలు, నారదభక్తి సూత్రాలు రూపగోస్వామి రచించిన 'భక్తి రసామృత సింధు మొదలనవి భక్తికి సంబంధించిన శాస్త్రీయగ్రంథాలుగా ప్రసిద్ధి చెందాయి. ఇవి కాక మహాభారతంలోని శాంతి పర్వంలో, నారదపంచరాత్రము, శ్రీమద్భాగవతాలు మొదలైన గ్రంథాలలో భక్తికి సంబంధించిన శాస్త్రీయ చర్చ కనిపిస్తుంది. మధ్య యుగంలోని భక్తి పద్ధతులపై ఈ శాస్త్రీయ గ్రంథాల ప్రచారం ఏదో ఒక రకంగా ఉన్న మాట వాస్తవం. ఈ గ్రంథాలన్నింటిలోనూ ప్రేమతత్వాన్ని భక్తికి మూలంగా పేర్కొనడం విశేషం.

"సాపరాకనురక్తిరీశ్వరే" - శాండిల్య భక్తి సూత్రం

"సాస్వస్మిన్ పరమ ప్రేమ రూపా అమృతస్వరూపాచ" - నారద భక్తి సూత్రం.

శ్రీ వల్లభాచార్యులు కూడ భగవంతుని మహాత్మ్య గానంతో పాటు నిరంతరం దృఢమైన ప్రేమభావాన్ని భక్తిగా పేర్కొన్నారు. సురదాసు కూడ భగవత్ ప్రేమనే భక్తి యొక్క సర్వస్వంగా భావించాడు. ***"హరి పదపంకజ దియౌ ప్రేమబస్ తాహ్ కే రంగ్ రాతే"*** (హరి పదపంకజాల ప్రేమతో దానిలోనే నిరంతరం లీనమై)

భక్తికి సంబంధించిన శాస్త్రీయ గ్రంథాలలో అనేక విధములైన భక్తిని గురించి చర్చ జరిగింది. శాస్త్రీయంగా భక్తి రెండు విధాలుగా పేర్కొనబడింది.

1. గౌణభక్తి 2. పరాభక్తి

గౌణ భక్తిని సాధనాపరమైన భక్తిగా, పరాభక్తిని సిద్ధావస్థకు చెందిన భక్తిగా వివరించడం జరిగింది. పరాభక్తిలోనే భక్తునికి సంపూర్ణమైన మానసిక శాంతి చేకూరుతుందని చెప్పబడింది. గౌణభక్తి మరలా రెండు రకాలుగా విభజించబడింది. 1. వైధీభక్తి, 2. రాగానుగాభక్తి గా పేర్కొనడం జరిగింది. రాగానుగా భక్తి వైధీభక్తి ఈ రెండింటికీ వల్లభ సంప్రదాయభక్తి పద్ధతిలో సమానమైన స్థానం లభించింది. వైధీభక్తిలో నవవిధభక్తి సంప్రదాయం, రాగానుగాలో ప్రేమమూల భక్తి పద్ధతులు వల్లభ సంప్రదాయంలో దీక్షపొందిన భక్త కవులలో సూరదాసు విశేషంగా కనిపిస్తుంది. వైష్ణవ భక్తి సంప్రదాయంలో పంచవిధ భక్తి వివరణ ఉంది.

" ముఖ్యస్తు పంచధాః శాంతః ప్రీతిః ప్రేయంశ్చ వత్సలః
మధురశ్చేత్య జ్ఞేయాః యాధా పూర్వ మనుత్తమాః "

రూపగోస్వామి ముఖ్యభక్తిని పంచవిధాలుగా పేర్కొని (శాంతభక్తి, ప్రీతి భక్తి, ప్రేమోభక్తి, వత్సలభక్తి, మధుర భక్తి) వాటిలో మధురభక్తి శ్రేష్టమని పేర్కొన్నాడు. మధురభక్తి గురించి "ఉజ్వలనీలమణి"లో విశేషంగా వివరించాడు. మధురభక్తి తత్వం భాగవతంలో గోపికాకృష్ణ తత్వాన్ని , వైష్ణవభక్తిలోని రాధామాధవతత్వాన్ని అర్థంచేసుకోవటానికి ఉపకరిస్తుంది.

భగవంతుని ప్రియునిగా తనను ప్రేయసిగా రూపకల్పన చేసుకొని భగవంతుని ఆరాధించటం 'మధురభక్తి' గా ప్రతిపాదించబడింది. సూరదాసు మనస్సు ఈ మధురభక్తిని ఆవిష్కరించటంలో తన్మయం అయిపోయింది. గోపికలతో కృష్ణుని ప్రేమానుబంధం రాధా కృష్ణుల అన్యోన్య అనురాగ సంబంధాలను తాదాత్మ్యంతో సూరదాసు వర్ణించిన పదాలు మధురభక్తి సాహిత్యంలో మణిపూసలు. రాధను స్వకీయనాయిగా గోపికలను పరకీయ నాయికలుగా చిత్రించి మధురభక్తిని ఆవిష్కరించాడు.

లోక - సకుచ కుల - కాని తజీ ।
జైసేనదీ సింధుకో ధావై తైసే శ్యామ్ భజీ ॥ - సూరసాగర్.

(గోపికలు కుటుంబ మర్యాదను, సామాజిక ఆంక్షలను లెక్కజేయకుండా సముద్రాన్ని జేరడాన్కి పరుగిడుతున్న నదిలాగ శ్యామసుందరుని చేరుకున్నారు) రస సిద్ధులై తన్మయావస్థలో ఓలలాడే మహాభక్తులు గోపికలు.

రాధపైగల కృష్ణుని అనురాగం స్వకీయ నాయికాపరంగా ఆవిష్కరించటం సూదరాసు ప్రత్యేకత.

రాధాకృష్ణులు ప్రణయలీలలో మాధుర్యభావాన్ని సూరదాసు అద్భుతంగా అభివర్ణించాడు. ప్రేమ - భక్తి సాహిత్యము - ఆధ్యాత్మము, కావ్యము - తత్వజ్ఞానముల అద్భుతమైన సమన్వయంగా ఈ విలక్షణమైన రాసలీలను అనన్య సామన్యమైన భక్తి భావం ద్వారా సూరదాసు మన కళ్ళ ఎదుట ప్రత్యక్షం చేస్తాడు. రాధామాధవుల ప్రేమ కేవలం యౌవనోద్రేకంతో కూడినది కాదు. బాల్యంలోని స్నేహభావం పరిణతి చెంది, పరిపక్వమైన శృంగార భావనగా మారి వారిద్దరి మధ్య అపురూపమైన బంధంగా ప్రణయం మారుతుంది. సూరదాసు గంధర్వ రీతిని రాధాకృష్ణుల వివాహం కూడా చేయిస్తాడు. చిన్నప్పుడు కృష్ణుడు ఆడుకోవటానికి వెళ్ళితే అక్కడ రాధ కనిపిస్తుంది.

ఖేలన్ నికసే హరి వ్రజఖోరీ
ఔచకి హీ దేఖీ తహరాధా
నైన్ నైన్ మిలి పరీ ఠగౌరీ, - సూరసాగర్

కృష్ణుడు ఆడుకోవటానికి వ్రజ ప్రదేశములోని వీధులలో తిరుగుతుండగా చటుక్కున ఒక అమ్మాయి కనిపిస్తుంది. ఆ అమ్మాయి పేరు రాధ. చూడగానే కళ్ళు కళ్ళు కలిసి ఏదో కనికట్టు జేసినట్లయిపోయింది.

ఆమె సౌందర్యం ఏమని వర్ణించాలి చారెడేసి కళ్ళు. విశాలమైన నుదురు, దానిపై చక్కని బొట్టు, పొడుగైన జడ, నీలిరంగు పరికిణీతో ఆమె దీపకాంతి రెట్టింపుగా కాంతితో కనిపిస్తోంది. ఇటువంటి అందమైన రాధను రసిక శిరోమణి కృష్ణుడు మాటలలోనే ఆకట్టుకుంటాడు.

బూఝుత శ్యామ కౌన్ తూ గోరీ ।
కహాఁ రహతి కాకీ హై బేటీ దేఖీనహీం కబహూ వ్రజ ఖోరీ॥

కృష్ణుడు అడుగుతాడు - ఓ అమ్మాయీ! ఎక్కడ ఉంటావు? నిన్నెప్పుడూ ఇక్కడ (వ్రజ ప్రదేశం) చూడలేదే?

కాహేకో హమ్ వ్రజ తన ఆవతి ఖేలతి రవతి అపనీ పౌరీ
సునతి రహతి స్రవనన్ నంద ఢోటా రత ఫిరతమాఖన్ దధిచోరీ

మేము ఇటువైపు ఎందుకు రావాలి? మా ఇంటి దగ్గరే మేము ఆడుకుంటాము. పైగా ఇక్కడ నందకుమారుడు, పెరుగువెన్నల దొంగతనం చేస్తూ తిరుగుతూ ఉంటాడు. అని వింటూ ఉంటాము. అని రాధ జవాబు చెబుతుంది.

తమ్హార్ కహాఁ, చోరీ హమ్ లెహై ఖేలన్ చలసంగ్ మిలిరి జోరీ,
సూరదాస్ ప్రభు రసికసిరోమని బాతని భురయి రాధికా భోరీ॥

నీ దగ్గర నేను ఏమీ దొంగతనం చేసాను? నడు! మనం ఆడుకుందాము అంటూ రసిక శిరోమణి కృష్ణుడు ముగ్ధ రాధికను మాటలతో మభ్యపెట్టాడు.

హిందీ సాహిత్యంలోనే కాదు, భారతీయ సాహిత్యంలో కూడా రాధాకృష్ణుల ఈ బాల్య క్రీడ దానిని అనురాగ బంధంగా ఇంత మధురంగా చిత్రించిన సన్నివేశాలు లేవని చెప్పాలి.

రాధాకృష్ణుల యౌవన లీలలు, రాసలీలగా భారతీయ సాహిత్యంలో విరివిగా కనిపిస్తుంది. కాని దానికి ప్రాతిపదికగా సూరదాసు మాత్రమే కౌమారావస్థలో స్నేహ బంధాన్ని అత్యంత మనోహరంగా చిత్రించాడు.

సూరదాసు పదసాహిత్యంలో రాధా మాధవ లీలలు మధురభక్తికి ఉదాహరణలు. సూరదాసు భక్తి భావంతో తన్మయత్వంలో గానం చేస్తూ రాధాకృష్ణుల సాక్షాత్కారం పొందిన మహాభక్తుడు. వల్లభాచార్యుని పుష్టి మార్గంలో దీక్ష పొంది కూడా పుష్టి మార్గ సిద్ధాంతాన్ని నిరూపిస్తూ రాయలేదు. భక్తి పారవశ్యంలో రూపొందిన పదాలలో మనసారా నమ్మిన పుష్టి సిద్ధాంతం వ్యక్తమయింది. అలానే మధురభక్తిని శాస్త్రీయంగా ప్రతిపాదించలేదు గాని, దాని వ్యావహారిక రూపం రాధాకృష్ణుల ప్రేమ, శృంగారం వర్ణనలలో అప్రయత్నంగానే వెల్లి విరిసింది.

సూరదాసు వర్ణనలలో ఆ ప్రేమా భక్తి లీలలు అత్యంత హృద్యంగా వ్యక్తమయినాయి. శ్రీకృష్ణుడు ద్వారాకాధీశుడయినాడు. విరహిణి రాధ రూపాన్ని మనస్సు కలిచివేసేటట్లు సూరదాసు కళ్ళముందు ప్రత్యక్షం చేస్తాడు. రాధ కూడ శ్రీకృష్ణ దర్శనం గురించి ప్రభాస తీర్థానికి వెడుతుంది. రథం మీద అతులిత ఐశ్వర్యంతో ప్రత్యక్షమైన జగదేకమోహన మూర్తిని రాధ కళ్ళారా దూరం నుండి చూస్తూ ఉంటుంది. శ్రీకృష్ణుని పక్కన పట్టపురాణి రుక్మిణి కూర్చుని ఉంది. రుక్మిణి రాధను చూపించమని శ్రీకృష్ణుని కోరుతుంది. శ్రీకృష్ణుడు రాధను చూపిస్తూ రథం దిగి రాధ దగ్గరకు వచ్చి రాధను కలవటం జరుగుతుంది. ఇక్కడ రాధా మాధవ తత్వాన్ని సూరదాసు అద్భుతంగా అభివర్ణించాడు.

రాధా మాధవ భేంట్ భయీ ।
రాధా మాధవ్, మాధవ్ రాధా కౌట్ భృంగ్ గతి హై జగయీ
మాధవ రాధాకే రంగ్ రాంచే రాధా మాధవరంగ్ గయీ
మాధవ రాధ ప్రీతి నిరంతర రసనా కహెన గయీ ॥

రాధా–మాధవుల కలయిక మధురమయం. భ్రమర కీటక సదృశ్యంగా రాధా మాధవుడుగా మాధవుడు రాధగా ఏకాకారం అయిపోయారు. మాధవుడు రాధ రంగులో, రాధ మాధవుని రంగులో మునిగిపోయారు. రాధా మాధవుల ప్రేమను వర్ణించటానికి నా శక్తి చాలదు.

మనిద్దరిలో తేడాలేదు. మనం ఇద్దరం ఒకటే అని రాధను కృష్ణుడు మరల వ్రజ ప్రాంతానికి పంపివేయటం వర్ణిస్తూ సూరదాసు రాధామాధవుల వ్రజ విహారాన్ని నిత్యనూతనమని అభివర్ణిస్తాడు.

సూరదాసు సాహిత్యంలో మధురభక్తి తత్వాన్ని అత్యంత మధురంగా ప్రతిపాదించిన ప్రత్యేకత ఏమిటంటే విప్రలంభ శృంగార రస వర్ణనలను కృష్ణలీలలను ప్రత్యక్ష లీలలుగాను, వ్రజ భూమిలో బృందావనంలో ఎల్లవేళల రసాది వివిధ లీలా పరాయణుడైన శ్రీకృష్ణుని సాన్నిధ్యం గోపస్త్రీలకు ఎప్పుడూ సహజ సులభమని ప్రతిపాదించటం ఈ విధంగా మధుర భక్తిని సాహిత్యంలో తనదైన విలక్షణమైన మాధుర్యభరిత బాణీలో చిత్రించి, సూరదాసు హిందీ సాహిత్యంలోనే కాక భారతీయ సాహిత్యంలోనే "మధురభక్తి" మార్గాన్ని అనుసరించిన భక్తాగ్రేసరుడుగా ఖ్యాతిపొందారు.

అన్నమాచార్యుల సాహిత్యంలో కూడా అలివేలుమంగ - వేంకటేశ్వరుల ప్రణయ లీలలను మృదు మధురంగా చిత్రించటంలో ఈ ఇద్దరిలోనూ భావ సామ్యత స్పష్టంగా కనిపిస్తుంది.

***

9

అన్నమయ్య - గోదాదేవి

డా॥ వి. జానకి
రీడర్, తెలుగుశాఖ,
భవన్స్ న్యూ సైన్స్ కాలేజి, హైదరాబాద్

భక్తి భగవత్సంబంధమైనది. మానవుడు తన స్వభావాన్ని సంస్కారాన్ని అనుసరించి భగవంతుని ఒక్కొక్క విధంగా ఆరాధిస్తాడు. వీటిలో శాంత, దాస్య సఖ్య వాత్సల్య మధుర భక్తులు శిష్ట సమ్మతమైనవి. ఇందులో మధురభక్తి మార్గం ఆనందదాయకం. ఆనందంతో కూడిన సాధన. భగవంతుని ప్రాణవల్లభునిగా ఆరాధించి మాధుర్య రసాస్వాధనతో తన్మయత్వంతో గమ్యాన్ని చేరుకునే మాధుర్య మార్గం.

భక్తునికీ భగవంతునికీ నాయికా నాయక బంధాన్ని విశిష్ట అనుబంధాన్ని భావింపజేసిన వైష్ణవ భక్తిభావనా మాధుర్యం అనేక విధాలుగా శాఖోపశాఖలై విస్తరించింది. 'పూమాన్ విష్ణురీతి ఖ్యాతః స్త్రీ ప్రాయమిదం జగత్' అన్న మధురభక్తి సిద్ధాంతానికి ఉదాహరణ గ్రంథాలుగా ఎన్నో వెలిశాయి. ఆ మధుర రచనా సముద్రంలో నుండి మౌక్తిక ప్రాయాలైన తిరుప్పావై, అన్నమాచార్యుల మధుర గేయాలను గురించిన ప్రస్తావనే ఈ వ్యాసరచనోద్దేశ్యం.

"శిశుర్వేతి పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణి" - అన్నట్టు పదకవిత గానయోగ్యమై సర్వ జీవులకు వినికి మాత్రంతోనే ఆనందాన్ని కలిగిస్తూ అలౌకిక ఆనందాన్ని కలిగిస్తాయి. సంకీర్తనాచార్యుడయిన అన్నమయ్య దివ్యపదకవిత ఆబాలగోపాలం మనస్సు రంజింపజేస్తూ అతనిని పదకవితా పితామహా స్థానాలంకృతున్ని చేసాయి.

కలియుగ ప్రత్యక్ష దైవమయిన శ్రీవేంకటేశ్వర స్వామివారి మహత్వాన్ని తత్వవైభవాలను శృంగార సంకీర్తనలుగా రచించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యులు. జీవిత కాలమంతా స్వామి సేవలో గడిపి మధుర భక్తి క్షీరాన్ని ఆర్తులకు అందించిన అపర భక్త చింతామణి.

ఇతని పదాలలో భగవత్సంబంధమైన శృంగారభావం, భక్తి వైరాగ్యాలతో బాటు సంఘ సంస్కరణాభిలాష కూడా కనిపిస్తుంది. పండితులతో బాటు పామరజనాన్నీ అలరిస్తూ గమ్యానికి దారి చూపగలగడం ఇతని పదకవితా వైశిష్ట్యం.

అన్నమయ్య శృంగార గేయాలలో వేంకటేశ్వర స్వామియే నాయకుడు. అలమేల్మంగ నాయిక. శ్రీదేవి, భూదేవి, నీళాదేవుల గూర్చిన వర్ణనలు కూడా ఉన్నవి. ఈ గేయాలలో ప్రధానంగా కవి శృంగార సహకారిగా ఆ దంపతుల పవిత్ర శృంగారాన్ని వర్ణించాడు. అన్నమయ్య కొన్ని చోట్ల తానే నాయికగా విరహవేదన ననుభవించినట్లు కూడా కనిపిస్తుంది.

ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మఱి
యిదిగాక వైభవంబిక నొకటి గలదా
అలివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్షాలన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసనల వోలె నుండె
తరుణీ హృదయము కృతార్థతబొంది విభు మీది
పరవశానంద సంపదకు నిరవాయె
సరసిజానన మనోజయమంద యింతలో
సరిలేక మనసు నిశ్చల మాయె
శ్రీవేంకటేశ్వరునిఁజింతించి పరతత్త్వ
భావంబు నిజంబుగాఁ బట్టెఁ జెలియాత్మ

శృంగారం లౌకికం అలౌకికం అని ఆలంకారికుల మతం. ఒకటి కాంతా విషయకం లౌకికం. రెండవది భగవద్విషయికం. అలౌకికం, జీవాత్మ పరమాత్మ నాలంబనంగా గొని నాయికా నాయకుల పరస్పర శృంగార విలసన రూపంలోన దివ్య శృంగారం రూపొందుతుంది. ఈ దివ్య శృంగారమే మధుర భక్తిగా భక్తులచేత కొనియాడబడింది. ఈ మధురభక్తి అంతరంగ పరిపాకానికి హేతువై భగవత్సాయుజ్యానికి సోపానపంక్తి అవుతుంది. మధురభక్తికి ఆలంబన భగవంతుడు. భక్తుడు తనకు తాను స్త్రీయో లేక తను స్త్రీ స్వభావాన్ని పొందియో భగవంతుని తన వానిగా భావించి కీర్తించినచో పరమానంద స్వరూపమగు మధురభక్తి రసంగా

పరిణమిస్తుంది. ఆ విధంగా మధురభక్తికే వన్నె తెచ్చినది గోదాదేవి ఉత్కృష్టభక్తి. ఆత్మార్పణం చేసుకుని ప్రతిఫలాపేక్షలేని శ్రీకృష్ణుని గానంలో లీనమై స్వామినే వలచి వరించి మధురభక్తికి మారుపేరయింది.

అన్నమయ్య తిరుమలను తన ఆశ్రయ కేంద్రంగా చేసుకున్నాడు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుని, అలమేలుమంగను నాయికా నాయకులుగా గ్రహించాడు అన్నమయ్య. గోదాదేవిది విల్లిపుత్తూరు. తండ్రి విష్ణుచిత్తుడు. మాలకారుడు. ఇతడు గోదాదేవికి సహకారిగా తన ధర్మాన్ని నిర్వహించాడు. అన్నమయ్య- వేంకటేశ్వరుని అమేలు మంగమ్మను మధురభక్తికి అలంబనగా తీసుకుంటే గోదాదేవి స్వామినే వలచి 'సర్వమున్నతని దివ్య కళామయమంచు విష్ణునందుల్లముచేర్చి " అని పోతన అన్నట్లు పరమేశ్వరునిలో తాదాత్మ్యం చెందింది గోదాదేవి. భూదేవి అవతారంగా విష్ణు చిత్తుని పుత్రికగా తాను ధరించి మురిసిన మాలనే స్వామికి ధరింపజేసి స్వామిని వశంచేసుకుని 'చూడికుడుత్త నాచ్చిటయార్' గా మధుర భక్తికే వన్నె తెచ్చిన మహనీయురాలు గోదాదేవి.

వైష్ణవ భక్తి సాహిత్యంలో తిరుప్పావై అత్యంత ప్రచారంలో నున్న మధురగీతాలు. ఈ గీతాలలో శ్రీకృష్ణుని స్తుతి, గోపిక, తోటి గోపికలను మేల్కొల్పడం, వ్రతం వ్రత నియమాలు, ఫలితం, వర్షాధి దేవతను వర్షం కోసం ప్రార్థించడం గోపిక శ్రీకృష్ణుని నామాలను తెలపని చెలికత్తెలను అడగడం, నీరాడదానికి చెలికత్తెలొకరితో ఒకరు సరసాలాడడం, యశోదా దేవికి కృష్ణుడికి నీలాదేవికి మేల్కొల్పులు, శ్రీకృష్ణ నీలల పలకరింపు, శ్రీకృష్ణునికి గోపికల హృదయ నివేదనం మంగళాశాసనంతో పాశురాలు ముగుస్తాయి.

మధుర భక్తితో స్వామిని సేవించి కైవల్యం పొందదానికి అందరూ అర్హులేనని జాతి, కుల భాషా భేదాలు లేవని గోదాదేవి విల్లిపుత్తూరులోని మాలాకారుడి ఇంట పెరిగి స్వామిలో లీనం కావడమే నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ భావాన్నే అన్నమయ్య కీర్తనలోను చూడవచ్చు.

"నిండార రాజు నిద్రించు నిద్రయు ఒకటే
అండనే బంటు నిద్ర అదియునొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి ఒకటే
ఛండాలుడుండేటి సరిభూమి ఒకటే...... "

అన్నమయ్య కీర్తనలలోను గోదాదేవి పాశురాలలోను మధురభక్తికి సంబంధించిన సామ్యం కనిపిస్తుందనడానికి ఉదాహరణ....

"గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కదమా నీకు
కమలజ చల్లని కౌగిటదగిలి
సమరరతి బాయగ జాలవూ
కమల భవాదులు కదనుతియింపగ
విమలపు శయనము విడువగలేవు
భూసతి తోడుత పొందులు మరిగి
వేసరవిదే నీ వేడుకలా
వాసవ ముఖ్యులు వాకిట నుందగ
పాసి వుండనని పవళించేవూ
నీళా మనసిజ లీలల తగిలి
నాలితోడ మానగ లేవు
వేళాయన శ్రీవేంకటనాథుడ
పాలించి దాసుల బ్రతికించగను

ఈ భావాలనే గోదాదేవి పాశురంలోనూ చూడవచ్చు.

ముప్పత్తు మూవర్ అమరర్కుమున్ శైను
కప్పం తవిర్కుం కలియే తుయిలెళాయ్ !
శెప్పముడైయాయ్ ! తిఱలుడైయాయ్ ! శెట్రార్కు
వెప్పం కొడుక్కుం విమలా! తుయిలెళాయ్ !
శెప్పన్న మెన్ములై శెవ్వాయిచ్చిరుమరుఙ్గల్
నప్పిన్నై నఙ్గయ్ ! తిరువే ! తుయిలెళాయ్
ఉక్కముం తట్టో లియుం లన్దు ఉన్మణాళనై
ఇప్పోదే ఎమ్మైనీ రాట్టేలోరెమ్బావాయ్

పై పాశురంలో

ముప్పై మూడు కోట్ల దేవతలకు భయాలు కలగడానికి ముందే వారి దగ్గరకు వెళ్ళి వారి ఆపదలను తొలగించే ఓ గోపాలకృష్ణా! ఇక నిద్దుర మేల్కొనవయ్యా!

స్వర్ణకలశాల వంటి వక్షోజాలు, పగడాల వంటి ఎర్రని పెదవులు, సొంపైన సన్నని నడుము గలిగి శ్రీమహాలక్ష్మి వంటి సౌందర్యం గలిగిన ఓ నీలాదేవీ! నీవైనా నిద్రమేల్కొనవమ్మా! మా నోముకు కావలసిన అద్దం మొదలగునవి ఇచ్చి నీ ప్రియుడైన కృష్ణునితో పాటు మమ్మల్ని ఇప్పుడే నీరాడజేయవమ్మా! మేము చేస్తున్న ఈ నోమును ఫలింప జేయవమ్మా!

అన్నమయ్య కీర్తనలోను గోదాదేవి పాశురంలోను సామ్యం స్పష్టం. ఇదే భావం ఇంకొక్క పాశురంలో కూడా కానవస్తుంది.

కుత్తువిళక్కెరియక్కోట్టుక్కాల్ కట్టాల్ మేల్
మెత్తెన్రపఞ్చశయనత్తిన్ మేలేరి
కొత్తలర్ పూజ్గళల్ నప్పిన్నై కొంగై మేల్
వెత్తుక్కిడన్ద మలర్ మార్పా ! వాయ్ తిరవాయ్
మెత్తడజ్గణ్ణినాయ్ నీ యున్మణాళనై
ఎత్తనైపోదుమ్ తుయిలెళ ఒట్టాయ్కాణ్
ఎత్తనై యేలుమ్ పిరివాత్త గిల్లాయాల్
తత్తువ మన్రుత్తగవేలో రెమ్బావాయ్

నాలుగు మూలాల్లో దీపపు సెమ్మెలు వెలుగుతుండగా, దంతపు కోళ్ళ మంచంమీద సుతిమెత్తని దూది పరుపుపై, జడలో గుత్తులు గుత్తులుగా వికసించిన పువ్వులను పెట్టుకున్న నీలాదేవి కౌగిలిలో నిద్రిస్తున్న కృష్ణదేవా! నోరు తెరచి ఒక్కమాటైనా మాటాడరాదా!

కాటుక పెట్టుకున్న అందమైన కన్నులుగల నీలాసుందరీ! ప్రేమాస్పదుడైన నీ పతిని ఎంత పొద్దుపోయినా నిద్రలేపేందుకు నీకు మనసొప్పనే లేదా! నీ స్వామి క్షణకాలమైనా నీవు విడిచి పెట్టేదానివిగా కన్పడదంలేదు. ఇది నీ స్వభావానికి తగని పని.

అమ్మా! నీలాదేవి! స్వామి వారితో కూడా మేల్కొని మా నోమును ఫలింజేయవమ్మా!

అన్న భావం స్పష్టం.

అన్నమాచార్యుల కీర్తనలలో రామాయణాన్ని గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

ధరలో రాముడు పుట్టి ధరణిజ బెండ్లాడె అరణ్యావాసుల కెల్లా నభయమిచ్చే

"పుళ్ళిన్ వాయ్ కీణ్డానై పొల్లా వరక్కనై

క్కిళ్ళి క్కళైందాన్నై క్కీర్తిమై పాడిప్పోయ్

ఓ గోపికా! ఒక రాక్షసుణ్ణి చీల్చి చెండాడిన శ్రీకృష్ణభగవానుని, రావణాసురుని సంహరించిన శ్రీరామచంద్రుని కళ్యాణలీలలను ప్రకటించే పాటలను పాడుకొంటూ అందరూ నోమునోచే చోటికి వెళ్ళిచేరారు.

విష్ణుమూర్తి లీలలను మహిమలను దుష్టశిక్షణ శిష్టరక్షణా రీతులను ఇరువురి కవితలోను గమనింపవచ్చు. ఉదా:

అన్నమయ్యకీర్తన :

సురలకు నరులకు శుభమాయె
హరినీ చేతలు ఆనందమాయె
కినిసి రావణుని గెలిచిన గెలుపు
చెనకి బాణుని గెలిచిన గెలుపు
పొనిగి హేమకశిపుని గెలిచిన గెలుపు
వెనక ముందరికి వేదములాయె
కలన కంసునటు గెలిచిన గెలుపులు
చెలగిబలిని గెలిచిన గెలుపు
అ ల శిశుపాలుని గెలిచిన గెలుపులు
బలు పుణ్య కథా భారతమాయె
కెరలియసురలను గెలిచిన గెలుపులు
సిరులనందరి గెలిచిన గెలుపు
యిరవగు శ్రీ వేంకటేశ మహిమలు
సరవితో బురాణములాయె

ఇదే విధంగానే గోదాదేవి పాశురంలో కూడా విష్ణు కథల స్తుతి కనిపిస్తుంది.

అన్రివ్వులగ మళన్దాయ్ అడిపోత్తి
చెన్రజ్జత్తెన్నిలజ్జైశెత్తాయ్ । తిఱల్ పోత్తి
పొన్రచ్చగడ ముదైత్తాయ్ । పుగళపోత్తి
కన్రు కుణిలా వెఱిన్దాయ్ । కళలో పోత్తి
కున్రుకుడైయా వెడుత్తాయ్ । కుణకు పోత్తి
వెన్రు పగైక్కెడుక్కుయ్ నిన్కైయిల్ వేల్పోత్తి
ఏన్రైన్రున్ శేవగమే యేత్తిప్పఱై కొళ్వాన్
ఇన్రుయామ్ వన్దోం ఇరజ్గేలో రెమ్బావాయ్

పూర్వం లోకాలన్నిటినీ నీ అడుగలతో కొలచిన స్వామీ! నీ పాదాలకు మంగళం! లంకలో రక్కసుల్ని అందర్నీ మట్టుపెట్టిన వాడా! నీ బాహుబలానికి శుభమంగళం! శకటా సురుణ్ణి చిన్న పాదాలతో తన్నిన స్వామీ! నీ కీర్తికి మంగళం! వత్సాసురుణ్ణి బడి సెలరాయి వలె విసిరి వేసి, కపిత్థాసురున్ని కూల్చివేసిన బలశాలీ! నీ అడుగులకు మంగళం! శుభమంగళం! గోవర్ధన గిరిని గొడుగుగా ఎత్తి కాపాడిన స్వామీ ! నీ కృపకు దివ్య మంగళం! శత్రువులను కూల్చే నీ చేతి దివ్యాయుధానికి జయమంగళం! నిత్య శుభమంగళం! –

సంకల్పబలం ఉండే సాధించలేనిది లేదని ఇటు అన్నమయ్య కీర్తనలు అటు తిరుప్పావై నిరూపించాయి. జాతికి ఒక చక్కని భక్తి సందేశాన్ని ఇవ్వగలిగాయి. కావ్యం 'కాంతాసమ్మితతయా ఉపదేశయుజే' అన్నట్లు శృంగారం ప్రజల్ని ఆకర్షించే సహజ ప్రకృతి ధర్మం. అటువంటి శృంగారపు మాటల ద్వారా ప్రజలను తమ కవితలు చదివేలా చేసి భక్తిని ప్రబోధించి, గమ్యానికి దారి చూపగలిగిన అన్నమయ్య కీర్తనలు, గోదాదేవి పాశురములు ఆచంద్రార్కము ప్రజలకుపకరిస్తూ తద్రచయితల కీర్తిని ఇనుమడింపజేస్తున్నాయి. చేస్తాయి అన్నది నిత్య సత్యం.

***

10



అష్టఛాప్ కవులు తాళ్లపాక కవులు

డాక్టర్ ఆర్. సుమన్‌లత
రీడర్, హిందీమహావిద్యాలయం,
నల్లకుంట, హైదరాబాదు.

సంపూర్ణ భారతీయ సాహిత్యం ఒక అనంతమైన మహాసాగరమయితే విభిన్న భారతీయ భాషలలో రచింపబడుతున్న సాహిత్యాలను ఆ సాగరంలో సంగమించే జీవనదులుగా భావించవచ్చు. సుమారు 14,15 శతాబ్దాలలో భారతదేశమంతటా రచించబడిన భక్తి సాహిత్యాన్ని అనంత సాహితీ సాగరంలో పడిలేచే ఉత్తుంగ తరంగాలతో పోల్చుకోవచ్చు.

ఈ 14,15 శతాబ్దాలలో ఉత్తర భారతదేశంలో ప్రముఖ కృష్ణ భక్త కవులయిన సూరదాసు, కుంభదాసు, పరమానందదాసు, కృష్ణదాసు, నందదాసు, చతుర్భుజ స్వామి, గోవిందస్వామి, ఛీతస్వామిలను 'అష్టఛాప్' కవులుగ వ్యవహరిస్తారు. మహాప్రభు వల్లభాచార్యుల వారి 'పుష్టి' మార్గానికి, శుద్ధాద్వైత వేదాంతానికి పుష్టినిచ్చి, పోషించి, స్థాయిత్వాన్ని ప్రసాదించిన ఘనత ఈ ఎనిమిది మంది కవులకే దక్కుతుంది. వల్లభ సాంప్రదాయపు సాహితీ రూపమే 'అష్టఛాప్' అని, దీని ప్రభావం హిందీ సాహిత్యాలపైన పడిందని పండితులందరూ ముక్తకంఠంతో ఒప్పుకున్న సత్యం. ఆనాటి రాజకీయ, సాంఘిక, మత పరిస్థితులలో దౌష్ట్యం, ఘర్షణ, పరస్పర కలహాలు నాలుగు చెఱుగులా వ్యాపించిన వేళ 'అష్టఛాప్' కవులు తమదైన రీతిలో – అభివ్యక్తులతో అందరికీ సమ్మతమైనదే తమ మతమని చాటిచెప్పారు. 'భక్తి' అనే సిరాలో ముంచిన వారి కలం నుండి (కాదు వాక్కు నుండి) వెలువడిన కావ్యం, సంగీతం ద్వారా అమలినమైన మధుర జీవధారగా నిలిచింది. ఇన్ని శతాబ్దాలు గడిచినా, సహృదయులైన సాహితీ ప్రియులు నేటికీ ఆ సంగీత– సాహిత్య మాధురిని ఆస్వాదిస్తూ పులకించిపోతున్నారు. వీరి ప్రేరణ వలనే ప్రజల హృదయాలు కృష్ణ భక్తిలో మునిగాయంటే అతిశయోక్తి కాదు. నాలుగు దిక్కులా కృష్ణలీలా తరంగాల గాన మాధురి చుట్టుముట్టింది. వల్లభాచార్యుల వారు

ప్రతిపాదించిన 'శుద్ధాద్వైత సిద్ధాంతాలకు ఒక నిర్దిష్టమైన రూపునిచ్చేందుకే ఆయన పుత్రుడైన విఠల్‌నాథ్ ఈ 'అష్టఛాప్' అనే ఎనిమిది మంది కవులనూ ఒకతాటిపైకి తెచ్చారు. పైన పేర్కొన్న 8 మంది కవులలో మొదటి నలుగురూ వల్లభాచార్యుల వారి ప్రియుశిష్యులు. అలాగే తక్కిన నలుగురూ విఠల్‌నాథ్ గారి అనుయాయులు. ఈ ఎనిమిది మంది కవులూ అనన్యతకూ, తన్మయత్వానికీ పెట్టింది పేరు. హృదయానుభూతి వలన ప్రేరేపింతులై తమ భావాలను సంగీత బద్ధంగా అభివ్యక్తీకరించటమే కాక, వాటిని మధురమైన కంఠంతో పాడగలిగే శక్తి కలిగిన సంకీర్తనకారులుగా వీరు ప్రసిద్ధికెక్కారు. సంగీత- సాహిత్యాలను సమతూకంలో నడిపించ గలిగే ఈ కవులకు ఆనాటి వ్రజభాషపైన చక్కటి పట్టు ఉండేది. శ్రీకృష్ణుడు జన్మించి, ఆడి - పాడి తన లీలలను చూపించిన వ్రజభూమి అన్నా, వ్రజభాష అన్నా ఈ కవులలకు ప్రాణం. సంకీర్తనకారులుగా, గాయకులుగా ప్రసిద్ధికెక్కిన అష్టఛాప్' కవులు శ్రీకృష్ణునితో, గోపాలకులతో, యశోదా - నందులతో మమేకం చెంది, 'స్వాంతః సుఖాయ' కోసమే రచనలు చేశారు. అక్కడికి చుట్టు పక్కల ప్రదేశాల నుండి వచ్చి వ్రజభూమిలో నివసించి సంకీర్తనకారులుగా తమ జన్మను ధన్యం చేసుకున్నారు. వీరిని సాక్షాత్తూ శ్రీకృష్ణుని 'అంతరంగ సఖులు' గా వ్యవహరించటం కద్దు.

హిందీ సాహిత్యాకాశంలో, ధగ ధగ మెరిసే సూరీడు - మహాకవి సూరదాసు. అంధుడైన ఈయన వల్లభాచార్యుల వారి ప్రబోధాన్ని అనుసరించి కృష్ణభక్తిలో పద సాహిత్యాన్ని రంగరించి ధన్యుడయ్యాడు. ఈయన శ్రీమద్భాగవతం ఆధారంగా రచించిన సంకీర్తనల సంఖ్య సుమారు లక్షం పావు ఉంటుంది. కాని అందులో సుమారు 30 వేల వరకే లభ్యమవుతున్నాయి. "సూర్‌సాగర్" పేరుతో ఆయన కీర్తనలు ప్రసిద్ధికెక్కాయి. వాత్సల్య, సఖ్య, శృంగార భక్తి రసాలను ఈ అంధకవి నిర్వహించినట్లు వేరెవ్వరూ రచించలేరన్నది నిర్వివాదాంశం. శ్రీకృష్ణుని బాల్య కాలపు లీలలు, రాసలీలు ఈయనకు ప్రియమైన అంశాలు. వాటిని రచించటంలో నూటికి రెండు వందల పాళ్లు సూరదాసు కృతకృత్యులయ్యాడు. వల్లభాచార్యుల వారి ప్రాపు వలన ఇల్లు - వాకిలీ లేని సూరదాసుకు దైన్యాన్ని నింపుకున్న ఆయన పాటలకు ఒక స్థిరమైన భావం దిశ లభించాయి. చెదిరిన సంగీతమనే వీణ తీగలకు శృతి దొరికింది. ఆయనకు చక్కని కావ్య వస్తువూ లభించింది. ఆయన అంతః చక్షువులతో దర్శించుకున్న శ్రీకృష్ణుడు సంగీత- సాహిత్య ప్రియులందరికీ లభించాడు. మరీ ముఖ్యంగా

కేవలం వాడుకలో ఉన్న 'వ్రజమాండలీకం' కాస్తా 'వ్రజభాష' గా సాహితీ శిఖరాలనందుకుంది. ఆత్మాశ్రయ శైలి (సబ్జెక్టివ్ స్టైల్) లో రచించిన సూరదాసు పదాలు చక్కని – చిక్కని వెన్నముద్దలు.

నందదాసు తప్ప తక్కిన కవులంతా కేవలం సంకీర్తనలను రచించి గానం చేయటంలోనే తరించారు. నందదాసు మాత్రం కీర్తనలతో బాటు రసమంజరి, అనేకార్థమంజరి, మానమంజరి, విరహమంజరి, రసపంచాధ్యాయి, సిద్ధాంత పంచాధ్యాయి వంటి ఎన్నో రచనలు చేసి తన పాండితీ ప్రతిభను చాటుకున్నాడు. రాశిలోనూ, వాసిలోనూ కూడా మిన్న అనిపించుకున్నాడు. వ్రజ భాషతోబాటు సంస్కృతంలోనూ నందదాసు అందవేసిన చెయ్యి.

అష్టఛాప్ ' కవుల్లో కుంభన్ దాసు అందరికన్నా జ్యేష్ఠుడయితే నందదాసు అందరిలోకీ చిన్నవాడు. కావ్య సౌందర్యంలో సూరదాసుది మొదటి స్థానమయితే నందదాసుది ద్వితీయ స్థానం. ఇంపైన పదాల రచన దృష్టితో పరిశీలిస్తే పరమానందదాసును సూరదాసు తరువాత లెక్కించవచ్చు. గోవింద స్వామి సంగీత మర్మాలను తెలిసినవాడు. శ్రీకృష్ణుని గుడిలో ఈ ఎనమండుగురు కవులూ ఎనిమిది జాములలో సంకీర్తనలను పాడుతూ తమ జీవితాలను శ్రీకృష్ణునితో మమేకం చేసుకున్నారు. తద్వారా ఎంతో ఉత్కృష్టమైన సాహితీ సంపదకు భారతీయులను వారసులుగా చేశారు.

తెలుగు భాషలో పదకవితా మహునిగా నిలిచిన తాళ్లపాక అన్నమయ్య సంకీర్తన సేవవలన మూడు తరాల వారికి శ్రీవేంకటేశ్వరుని దివ్య మంగళ రూప సందర్శన భాగ్యం లభిస్తే ఏడుతరాల వారికి నేరుగా ముక్తి లభించింది. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా, రాజంపేట తాలూకాలోని తాళ్లపాక గ్రామంలో జన్మించి, తెలుగు – సంస్కృత భాషలలో శ్రీ వేంకటేశ్వరుని వెయ్యి విధాల కీర్తించటం అన్నది తెలుగు వారి పూర్వజన్మ సుకృతం. తెలుగు భాష చేసుకున్న అదృష్టం. సప్తగిరులను చూసి పులకించి, "అదివో అల్లదివో" అని ఎలుగెత్తి శ్రీవేంకటేశ్వర శతకాన్ని, అమ్మకొక శతకాన్ని సమర్పించుకొన్న అన్నమయ్య ఆశుకవిత, పదకవితా పితామహునిగా' ఎన్నో శిఖరాలను ఎక్కించి ఆయననే కాదు తెలుగు భాషనూ నిలబెట్టింది. శ్రీరామానుజాచార్యుల వారు ప్రతిపాదించిన విశిష్టాద్వైత సిద్ధాంతంలో, శ్రీ సంప్రదాయంలో ఘన విష్ణువనే వైష్ణవ గురువు వద్ద అన్నమయ్య దీక్షను తీసుకున్నాడు. తన పదహారవ సంవత్సరం నుండీ, జీవితాంతం ఆయన తన ఆరాధ్య దైవానికి రోజుకొక సంకీర్తన, పుష్పాన్ని సమర్పించుకుని, వాక్ప్రసూనాలతో అర్చించుకుని ధన్యుడయ్యాడు.

ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా ఆయన సుమారు 32 వేల కీర్తనలను రచించి గానం చేసినా, ఈనాడు కేవలం 14-15 వేలు మాత్రమే లభిస్తున్నాయి. ఆయన సంకీర్తనలను సారస్వత క్షీర సాగరమని విద్వాంసులు కొనియాడారు. "ఆడిన మాటెల్ల అమృత కావ్యముగా, పాడిన పాటెల్ల పరమ గానముగా" ఆ మహాకవి జీవితం మధుర రాగాలాపనగా, రసవత్కావ్యంగా సాగిపోయింది. తాళ్లపాక నివాసియైన అన్నమాచార్యులు తన ఆరాధ్య దైవమైన శ్రీవేంకటేశ్వరుని ప్రశంసిస్తూ, తిరుపతి క్షేత్ర మహిమను కొనియాడుతూ, శ్రీవారి వైభవాన్ని మరింత వైభవోపేతం చేస్తూ రచించిన సాహిత్యం మృదుమధురం. పుట్టపర్తి నారాయణా చార్యుల వారి మాటల్లో చెప్పాలంటే - "అన్నమయ్య సాహిత్యం చక్కెర బొమ్మలాంటిది. ఎక్కడ ఆస్వాదించినా మధురమే కదా! ఆయన హరి సంకీర్తనాచార్యుడు, పంచమాగమ సార్వభౌమునిగాను బిరుదులందుకున్నాడు.

ఈ సంకీర్తన సేవ కేవలం తాళ్లపాక అన్నమయ్యతో ఆగిపోక ఆయన తరువాత సుమారు నాలుగు తరాల వరకూ నిరాటంకంగా బలంగా కొనసాగింది. యోగ్యుడయిన తండ్రికి యోగ్యులయిన సంతానం జన్మించటమన్నదీ గొప్ప యోగం. అన్నమయ్యగారి అర్ధాంగి తాళ్లపాక తిమ్మక్క ***'సుభద్రా కళ్యాణమనే'*** ద్విపద కావ్యాన్ని రచించి, అన్ని విధాలా భర్తకు తగిన సహధర్మచారిణి అనిపించుకుంది. తెలుగులో మొట్టమొదటి కవయిత్రిగా నిలిచిపోయింది. తాళ్లపాక కవుల వంశవృక్షాన్ని గమనించగలరు.

తెలుగు సాహిత్య రీతులన్నిటిలోనూ రచనలు చేసి, రాజులు- ప్రజల అభిమాన్ని సమానంగా సంపాదించుకున్న తాళ్లపాక పెద తిరుమాలాచార్యుడు చేసిన అద్భుతమైన కార్యం - " సంకీర్తన భండాగారాన్ని" స్థాపించటం తమ సాహిత్యాన్ని చిరస్థాయిగా నిలిపేందుకు చేసిన ప్రయత్నమే రాగిరేకులపైన తన తండ్రిగారి పదాలను, తన పదాలను చెక్కించి దాచటం. ఒక్కొక్క కీర్తనకూ ఆరేసి- ఏడేసి ప్రతులను వ్రాయించి వైష్ణవ క్షేత్రాలకు పంపించి, ఈ పనులలో చేదోడు- వాదోడుగా ఉన్నవారికి ఆదరవు చూపించి పెద తిరుమలయ్య కొనసాగించిన కార్యకలాపాలు వేన్నోళ్ల పొగడతగినవి. ఈనాటికీ తిరుమ మందిరంలోని బైట ఆవరణలో హుండీకి కుడివైపు 'తాళ్లపాక వారి అరను" దానిపై తాళ్లపాక అన్నమయ్య - పెద తిరుమలయ్యగారి విగ్రహాలను మనం చూడగలం. ఎంతో నమ్మకంగా అన్నమయ్య 'తను స్వామి వారిని సంకీర్తన పుష్పాలతో పూజిస్తున్నాని చెప్తూ , ఒక్కకీర్తనే చాలు మమ్ములను

ఉద్ధరించేందుకు; తక్కినవి భాండాగారాన పడి ఉండనీ' అన్న సంకీర్తన ఆధారంగా విద్వాంసులు, పండితులూ అయిన శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారి పరిశోధన వలన భాండాగారం, ఆయన కర స్పర్శ వలన చీకటిలో పడివున్న పదాలు వెలుగు చూశాయి. శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారి లాంటి మహానుభావులు చేసిన కృషి వలన తాళ్లపాక కవుల పదాలు రాగాల వెల్లువై జాలువారాయి. అయితే, తుచ్ఛమైన రాగి కోసం అపురూపమైన రాగాలను కరిగించుకుని సాహిత్యానికి, సంగీతానికి, మన జాతికి మనం చేసిన లోటు పూడ్చలేనిది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈనాడు రాగి రేకుల పరిరక్షణకు చేస్తున్న కృషి శ్లాఘనీయం.

వ్రజ భాషలో రచించిన అష్టఛాప్ కవులు, సంస్కృతాంధ్ర భాషలలో రచించిన తాళ్ళపాక కవులు కూడా భక్తి, ఉపాసన రంగాల్లో పూర్తిగా 'మునిగి' - 'తేలినవారు'. స్థూలంగా చూస్తే వీరి భాషలు వేరు కావచ్చు. నివసించిన ప్రదేశాలు వేరుకావచ్చు. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే వీరి భక్తిలో, అనురక్తిలో, భావుకతలో, భావ వ్యక్తీకరణలో ఎన్నో పోలికటలు కనిపించి మనల్ని ఆశ్చర్యపరచక మానవు. భక్తి - అనురక్తుల సూత్రం అంతర్లీనంగా ఉండి భాషా-సాహిత్యాలను నడిపించటం వలనే ప్రదేశాలు వేరైనా, సామ్యం కనిపిస్తుంది.

అష్టఛాప్ - కవులు శుద్ధాద్వైతంలో దీక్షను పొందిన వారు; శ్రీమద్భాగవత గ్రంథ ప్రభావం వారిపైన హెచ్చు. తాళ్లపాక కవులది విశిష్టాద్వైత సంప్రదాయం కావటం వలన వారిపైన 'ద్రావిడ ప్రబంధం' ప్రభావం అడుగడుగునా కానవస్తుంది. విజ్ఞులయిన విద్వాంసులు భాగవతం పైన ప్రబంధం ప్రభావం కొంతమేరకయినా ఉందని అంగీకరిస్తారు. అందుకే ఒక బిందువు దగ్గర ఉభయ క్షేత్రాలలోని కవుల భగవద్భక్తి, లీలాగానం వంటి అంశాలలో సమానత్వం కనిపిస్తుంది. చూడండి -

అ ళ్వారుల దివ్య ప్రబంధం ⟶ **భాగవత పురాణం**
↓ ↓
తాళ్లపాక కవులు **అష్టఛాప్ కవులు**
↓
భగవద్భక్తి, భగవత్ లీలాగానము

ఉభయ భాషలోని కవులూ మున్ముందుగా భక్త శిఖామణులు; తమ భక్తినీ, వేదాంతాన్నీ అభివ్యక్తీకరించేందుకు వారు సాహిత్యాన్ని భాషను సంగీతాన్ని, రకరకాల కవితా రీతులను సాధనాలుగా ఎంచుకున్నారు. అరుదైన తమ తమ ప్రతిభా పాటవాలతో, శ్రేష్ఠమైన సాధనాలతో,

మహోన్నతమైన లక్ష్యాన్ని చేరగలిగిన ఈ మహానుభావులకు శతకోటి సాహితీ వందనాలు! 'సంగీత' నీరజనాలు!!

వారికి తమ ఆరాధ్య దైవమయిన శ్రీకృష్ణుడు, శ్రీవేంకటేశ్వరుడూ వెలిసి, ఆడి-పాడి, అందరి హృదయాలనూ రంజింపజేసే వ్రజ ప్రదేశమన్నా - తిరుమల- తిరుపతి అన్నా ఎనలేని మక్కువ. వైకుంఠం కన్నా హెచ్చు గోలోకం కన్న గొప్ప. అక్కడి అడుగు అడుగునూ వారు ప్రశంసించారు. అక్కడి ప్రకృతినీ, నీటినీ, గాలినీ, చెట్లనూ- పుట్టలనూ, నదులనూ, కొండా కోనలనూ ఎన్నెన్నో పదాలలో నోరారా వర్ణించి పులకించిపోయారు. స్వర్ణముఖి తీరాన ఉన్న తిరుపతి, యమునా నదీ తీరంలో ఉన్న బృందావనం అతి ముఖ్యమైన వైష్ణవ క్షేత్రాలు. వాటికి నాలుగు దిక్కులా శైవక్షేత్రాలుండటం కాకతాళీయం.... కాదు - కాదు, అతి చక్కని సమన్వయం. ఈ రెండు క్షేత్రాలూ ఈనాడు అంగరంగ వైభోగంగా, నిత్య కళ్యాణం - పచ్చతోరణంగా వెలుగుతున్నాయంటే ఈ కవుల చలవే కదా! నిత్యమూ కొత్త - కొత్త సేవలు, ఉత్సవాలు, జాజరలు, జాతరలు, శృంగారాలు, అలంకారాలు, భోగాలు - వైభోగాలు- కైంకర్యాలు- ఆ దివ్య మంగళ స్వరూపుడైన పరమాత్మకు నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలు; హారతులు; మేలుకొలుపులు, పవళింపు సేవలు; చందన చర్చలు, నౌకా విహారాలు, డోలోత్సవాలు ఊయల సేవలు, పట్టు పీతాంబరాలు, రథాయాత్రలు, అశ్వ-గజ వాహనాలు, గరుడ సేవలు, తిరువీధులలో ఊరేగింపులు, జన్మదినాలు, కళ్యాణోత్సవాలు, ఇలా ఎన్నో - మరెన్నో ఉత్సవాలు. ఉత్సవానికొక పాట! పాటకొక ఉత్సవం. గుడిలోని దేమునితో భక్తుడు మమేకమయి చూడటానికి వేయి కనులు చాలవనిపించే అవకాశాలు దొరికే ఈ తరుణాలన్నింటిలో పాడటానికి రెండు క్షేత్రాలలోని కవులూ, ఎన్నెన్నో కీర్తనలను వ్రాసి చిత్ర- విచిత్రమైన రాగాలలో పాడి తమ భక్తినీ చాటుకున్నారు. అటు జానపద బాణీలలో- ఇటు శాస్త్రీయ ధోరణిలో సాగిన సంగీత స్వరఝరిలో నాటి నుండి నేటి వరకు అందరం మునకలు వేస్తూ పులకరిస్తున్నాం. భూర్జరీ పత్రాలూ, తాళపత్రాలూ శిథిలమయినా కొన్ని రాగిరేకులు కరిగిపోయినా ప్రజానీకం నాలుకలపైన నర్తించిన రాగాలే నేటికీ నిల్చి ఉన్నాయి. అలాగే సంగీత- సాహిత్యాలకూ శాశ్వతతను సమకూర్చారు. ఎక్కడా పునరుక్తి దోషం లేదు' అని గర్వంగా, ఘంటా పదంగా చెప్పుకోవచ్చు.

తమ దైవానికి ఇంతటి వైభోగాన్ని సమకూర్చటానికి ఉత్సాహంగా ముందుకు వచ్చిన ఈ కవులు, తమ జీవితాలను మాత్రం చాలా సాధారణంగా గడుపుకున్నారు. రాజుల్ని-

మహారాజుల్నీ, జీతాలని, గొప్ప గొప్ప జీవితాలని తృణప్రాయంగా ఎంచారు. కేవలం హరి భక్తులకు "తవదాస దాసోహం" అనీ 'తవభృత్య - భృత్యులమనీ" భావించారు. అర్థ సంపాదనకు పరుగుతీయక శ్రీహరి భక్తులు నివసించే గ్రామంలో నివసించటమూ, వారిని సేవించటమే జీవిత పరమార్థమని ఎంచారు. జీవితంలో అనురాగాన్ని నింపుకుని, పరమాత్మను లెక్కలేనన్ని రాగాలలో కీర్తించుకునే వీరి నోట. "నరుల కీర్తన" ఎంత మాత్రమూ వినిపించదు. త్రికరణ శుద్ధిగా పలకటం వలనే వీరి పలుకులు తేనెలుగా మారి ఈనాటికీ మనకు రసానుభూతిని కలుగజేస్తున్నాయి. ఈ భక్తి కవుల రచనలు సంగీతానికి, నృత్యకళకూ, చిత్రకళకూ, వాస్తు శిల్పకళకూ ఎంతో స్ఫూర్తినిస్తున్నాయన్నది మనం ఎరిగిన సత్యం.

నవరసాలకధిపతియైన శ్రీకృష్ణుని లీలలను, వెంకటపతి వైభవాలనూ అడుగడుగునా మనకు కళ్లకు కట్టినట్లు చిత్రించిన వారి సాహితీ వైభవం అమోఘం. స్థలాభావం వలన కేవలం ఒకటి, రెండు ఉదాహరణలు చెప్పుకుందాం. హిందీ భాషలో సూరదాసును 'వాత్సల్య సామ్రాట్టు' గా పేర్కొంటాం. కుటిల కుంతలాలతో, నీలమేఘచ్ఛాయతో, కమల దళాలు వంటి కన్నులతో మల్లెమొగ్గల వంటి పలువరసలతో యశోదనూ, గోపికనే కాదు, పాఠకులనూ ఆకట్టుకునే బాలకృష్ణుని చేష్టలు కళ్లకు కట్టినట్టు చిత్రించిన సూరదాసు ధన్యుడు. అలాగే అన్నమయ్య కూడా - "భావయామి గోపాల బాలం తత్పదం చింతయేయం ... " అంటూ ఆ కృష్ణుడు – "ముద్దుగారే యశోద ముంగిటముత్యమనీ, గోపికలకు అర చేతిలో మాణిక్యమనీ చెప్తూనే క్రూరుడైన కంసుని పాలిట వజ్రమని' కూడా హెచ్చరించాడు. "జో అచ్యుతానంద –జో జో ముకుందా", అనీ " జో - జో కమలదళేక్షణ...." అనీ పాడే యశోద "జోయీ సోయీ కభుగావే " (ఏదో ఒకటి పాడుతోంది) పాపం గ్రామంలో నివసించే అమాయకపు తల్లి కదా!

పిల్లల మనస్తత్వాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రించిన ఈ పదాలను చూడండి– 'నీరాటలోన తన నీడ జూసి పొంచి యున్నాడు కృష్ణుడు" – నీటిలో తన నీడను చూసి అన్నమయ్య గారు కృష్ణుడు పొంచి ఉన్నాడనీ, కనిపించగానే చేతితో తాకటం వలన నీరు కదలి నీడ మాయమయితే ఏడుపు ఆరంభించాడనీ వర్ణించారు. అష్టఛాప్ కవులూ ఇదే వర్ణిస్తూ నందునితో – 'ఆ రెండో బాలకుడిని' గురించి ఫిర్యాదు చేశాడనీ వ్రాశారు. పరమానంద దాసు తన పదాన్ని – "ఔర్ కృష్ణ్ కీ యహ్ లీలా దేఖి జసుమతి హఁసీ ముసకావత్ " – అంటే కృష్ణుని ఈ

లీలను చూసిన యశోద మెల్లగా - హాయిగా నవ్వుకుని ఆనందించిందని ముక్తాయింపు ఇచ్చి మాతా- శిశువుల సహజ వాత్సల్యాన్ని అందంగా మనముందుంచారు.

ఒక్కొక్కసారి కృష్ణుడు చంద్రుడు కావాలనీ, ఇంకా చెప్పాలంటే 'ఆకలవుతోంది తింటాననీ' ఒకటే మారాము. మరి తల్లి యశోదమ్మ చంద్రుడిని రమ్మని పిలుస్తూ - 'మధు మేవా పక్వాన్ ఖిలైహో" అని ఇక్కడి వస్తే చంద్రునికీ మిఠాయిలు తినిపిస్తానని ఆశ చూపిస్తుంది. అన్నమయ్యగారి కృష్ణుడు వెన్న ముద్ద అనుకుని చందమామను నోట పెట్టబోయాడు. మరి ఏం మాయ చేశాడో గాని, యశోదమ్మకు చంద్రుడు దిగివచ్చినట్లే అనిపించింది. కలో- వైష్ణవమాయో ఎరుగని ఆ వెర్రి తల్లి తన పుత్రుడు ఎప్పుడు పెరుగుతాడో- కోడల్ని తెస్తాడో అని భావించినట్లు హిందీ కవులు చక్కగా వర్ణించారు.

త్రిలోకాలనూ నడిపించే త్రివిక్రముడిని తల్లి యశోద వేలు పట్టుకుని అడుగులు వేయటం నేర్పిస్తోందన్న కవుల కల్పన చదివి పులకించని సాహితీ రసజ్ఞులుంటారా?

అందరి ఇళ్లలో పాలు-పెరుగు దొంగిలించి, కుండల్ని పగలగొట్టే కృష్ణుడూ, ఆయనగారి మిత్రబృందం గురించి గోపికలు 'అయ్యో! మా వీధులన్ని పాలు- పెరుగుల వరదలో మునిగిపోతున్నాయమ్మా' అని యశోదకు ఫిర్యాదు చేస్తారు. దానికి కృష్ణుడు చాలా సాదాసీదాగా, 'హౌబాలక్ బహియన్ కో ఛోటో' అని నేను చిన్నవాడిని కదా, అంతపైకి కట్టిన ఉట్టిని అందుకోగలనా'? అని ఎదురు ప్రశ్న నేర్పుగా వేస్తాడు. మరీ గట్టిగా అడిగితే, 'దేఖత్ హౌ గోరస్ మే చీంటీ" పాలకుపట్టిన చీమల్ని దులుపుతున్నానంతే అని చేతులు దులుపుకుంటాడు. కోపగించిన యశోద రోట కట్టింది. అప్పుడు గోపికలు వచ్చి ఒద్దు- ఒద్దంటే యశోదమ్మ రోషపడి - 'ఛోటామేరో తుమహి బంధాయో, తనకహిమాఖన్ ఖాత్' అంటే పిసరంత వెన్న తిన్నాడని కట్టించారు' అంటుంది. 'ఛోటా' అన్నపద ప్రయోగం 'విడవమనవో రోలు నిడుమ ఓ తల్లీ! విడువమనవో వేగ వెరచీని బాలుడు" ముందు చాడీలు చెప్పి ఆ తరువాత వగచట మెందుకన్న తల్లి హృదయం మనముందుంచారు.

శృంగార రసాన్ని ఉభయ క్షేత్రాలలోని కవులూ ఎంతో అందంగా పోషించి, రచనలు చేశారు. శరదృతువులో అందమైన శారదా రాత్రులలో వికసించిన తామరల్లాటి నాయికా- నాయకులు వారి అంగాంగాలలో అందమే అందం. బహుశా అనంగుడు కూడా

సిగ్గల్లుతాడేమో! అతిలోక సుందరుడు నాయకుడు, నాయక వారి రాచ ప్రసాదంలో దీపం వెలిగించకుండానే వేయి దీపాల కాంతితో వెలిగిపోయే అపురూప సౌందర్యరాశి. 'అతివ జవ్వనము రాయలకు పెట్టిన కోట' **"తుమ్ రసికిని, వేరసిక్ శిరోమని, తుమ్ గ్వాలిన్-వేమాఖాన్ చోర్ "** - అంటూ నాయికా- నాయకులలో అభేదాన్ని చాటి చెప్పారు. ఇలాటి వర్ణనల్లో తాళ్లపాక కవులది అందెవేసిన చెయ్యి. నాయికా - నాయకుల కలయికలోనే షడ్రుతువులూ కనిపిస్తాయిట. నాయిక బుగ్గలోని ఎరుపు వసంత రుతువునూ, కంట చిందిన ఆనందాశ్రువులు వర్షరుతువునూ, విరహాగ్నిలో పరితపించే వేళ గ్రీష్మాన్ని, ముఖం పైన కనిపించే ఆనందం శరత్కాలంలాటి సమ్మోహనాన్నీ, నాయకుడిని చూచి సిగ్గిల్లితే హేమంతాన్నీ తలపిస్తోందనీ వర్ణించారు. అలాగే నవరసాలతోనూ, నవరత్నాలతోనే కాక ఎన్నో పుష్ప జాతులతోనూ పోల్చారు. ఆమె చూపులే ఆయనకు కమలాల పూజ, చిరునవ్వు నవ్వితే మల్లెల వాన. ఉచ్ఛ్వాస- నిశ్వాసాలలో సంపంగి పూల గుబాళింపు. నాయిక ముఖం దర్పణం కదా, నాయకునికి వేరే అద్దమెందుకు? ఆమె కేశాలు నీలాల రాశి, అధరాలు ఎర్రని పగడాలు, నవ్వితే ముత్యాలురాలుతాయి. కోపగిస్తే మాణిక్యాలు జల్లుమంటాయి. అటువంటి నాయికను పొందిన ఆయన కాక 'శ్రీపతి' వేరెవ్వరు? ఇలాటి వింతపోకడలతో విడవకుండా విపులంగా చదివించే కీర్తనలూ, రచనలూ ఎన్నో! ఆస్వాదించటానికి ఒకటికాదు పది జన్మలెత్తినా చాలవనిపిస్తుంది.

ఈ విరహ వర్ణన పైకి చూస్తే నాయికా- నాయకుల విరహంలా కానవచ్చినా, లోతుగా పరిశీలిస్తే ఆత్మ - పరమాత్మల వియోగం. పరమాత్మను చేరటానికి జీవాత్మపడే ఆవేదనలు ఎన్నో పదాలలో నిబద్ధమై ఉన్నాయి. విరహంలోని దశలూ, అంతర్దశలూ దాటి జీవాత్మ చేసే సూక్ష్మ ప్రయాణాన్ని మనం గమనించగలం. ఆ కలయిక తరువాత అంతా అద్వైతమే కదా!

అనంతుడైన హరిని, హరి యొక్క గాథలనూ వర్ణించటం వేయి పడగలున్న అనంతునికే సాధ్యంకాదు. మరి మనలాటి మానవ మాత్రులమెంత ? ఎవరెంత తలిచితే అంతే - పిండి కొద్దీ నిప్పట్లు " అన్ని రీతిలో రెండు భాషల్లోని కావ్య సౌందర్య అనంతం; అగాధం. రెండు చేతులా జుర్రుకోవటమే మనం చేయగలిగేది. వీరి కావ్యాలలో కావ్య సౌందర్యం తోబాటు భక్తి యొక్క భిన్న- భిన్న రూపాలున్నాయి. గురూపదేశాలూ, గురుభక్తీ ఉన్నాయి. ఆయన

విడమర్చే వేదాంతమూ మనకు లభిస్తుంది. జీవాత్మ అనే గోపికను పరమాత్మకు చేరువ చేయగలిగే నాదమార్గమయిన సంగీతమూ ఉంది. సాహితీ ప్రియులు వీరి కావ్యాలలోని రసాస్వాదన చేసి తన్మయులయితే సంగీత ప్రియులు స్వర సాధన చేసి, మర్మాలను గ్రహించుకునీ పులకరించి పోతారు. అన్నిటికీ మించి భక్తులు చదివి- చదివించి, విని- వినిపించి బ్రహ్మానందాన్ని పొంది తరిస్తారు. సాహిత్య రసాస్వాదన బ్రహ్మానంద సహోదరమే కదా!

చిట్ట చివరిగా, ఈ కవుల పరమ లక్ష్యం భక్తి. దానిని సాధించటానికి సంగీత - సాహిత్యాలను ఆధారం చేసుకుని ముందుకు వారు ప్రయాణించారు. మందిరాలు వారికి సాధనా స్థలాలు. పురాణేతిహాసాలు వారికి మార్గదర్శకాలు. వీటన్నిటి సమాహారమే అత్యున్నతమైన భక్తి సాహిత్యం. భక్తి - భావం - ముక్తి అనే త్రివేణీ సంగమం.

***

అన్నమయ్య తూము నృసింహదాసు

డా. ఎమ్.ఎస్.కె. పూర్ణచంద్
ఎం.ఏ., (తె.సా), ఎం.ఏ..(ప్ర.పా), ఎం.ఏ.(జ్యోతిషం),
పి.హెచ్.డి., విద్వాన్ (హిందీ)

పదం అంటే పాట. యుగాల నుంచి పాట ఉంది. పాట తరువాతనే మాట పుట్టింది. మూలుగు నుంచి మూర్ఛనల దాకా అంతా పాటే. పాటలతో జరిపిన మంతనాలతో మాట మరింత మురిపెమై ఒదిగి ఎదిగింది. అదే “పదం”గా రూపుదిద్దకొన్నది.

ఇటువంటి పదాలు ప్రతి భాషలోనూ పుట్టాయి. భారతీయ భాషా వాఙ్మయంలో ‘పదాలు’ లేక ‘గీతిక’లకు ఉన్న ప్రాముఖ్యం అందరికీ విదితమే.

జానపదుల నుంచీ జ్ఞానపథుల వరకూ అందరూ విశ్వసించి ఆశ్రయించిన ప్రక్రియ పదమే అంటే అతిశయోక్తి కాదు. అతి ప్రాచీనమైన ఋగ్వేదంలోనే ఆరాధనాపూర్వకమైన, స్తుత్యాత్మకమైన గీతాలు ఋక్కులై కనిపిస్తాయి. భారతీయ వాఙ్మయంలో - భాష ఏదైనా కానివ్వండి - ఆధ్యాత్మికోన్నతి కోసం ఆలపించిన గీతికా సముచ్చయాలు శాంతిత్రయ కారణాలుగా, ఐహికాముష్మిక సాధనాలుగా, జనహితకర నికరాలుగా, మన సమున్నత సంస్కృతీ ప్రతీకలుగా నిలిచి గెలిచాయి.

ఇక - తెలుగు భాషా వాఙ్మయాన్ని పరికించి చూస్తే - పదాలు వేల సంవత్సరాల నుండి వినబడుతూనే ఉన్నాయి. జానపదుల సాహిత్యంలో ఇవి కోకొల్లలుగా కనిపిస్తాయి. వాటికి కర్తృత్వం ప్రత్యేకంగా లేదు. కానీ, జనం నోళ్ళలో నాని నాని, కాలాలు దాటి మనగలిగిన మన జానపదుల పదాలు సామాన్యమైనవేమీ కావు.

శిష్ట శిష్టేతర సాహిత్యాలలో - శిష్టసాహిత్యం పండిత ప్రకాండులకు పరిమితమైపోగా- శిష్టేతర సాహిత్యం జానపదుల ద్వారా పరివ్యాప్తమైనది.

తుమ్మెద, ప్రభాత, పర్వత, ఆనంద, శంకర, నివాళి, వాలేశు, గొబ్బి, వెన్నెల, కోలాటం, చాంగుబళా, జోల పదాలను గురించి క్రీ.శ. 12వ శతాబ్దికి చెందిన పాల్కురికి సోమన పేర్కొన్నాడు.

అనిబంధ పదకర్త కృష్ణమాచార్యుని వచన రచనలు – తరువాత వాగ్గేయకారులకు మార్గ దర్శకాలయ్యాయి. నాచన సోమన (14వ శతాబ్ది) జాజర పాటలను గూర్చి పేర్కొన్నాడు.

ఇదంతా స్థూలంగా – 15వ శతాబ్దం ముందు వరకూ పదాల తాలూకు కథ.

ఇక 15వ శతాబ్ది – పద కవిత చరిత్రలో ఒక అపూర్వమైన ఘట్టానికి అనువైన కాలం ఆరంభమైనది. అది ఎలా? తాళ్ళపాక అన్నమయ్య ఆవిర్భావంతో.

పద కవితకు రాగ నిర్దేశం చేసి దేశీ ఛందో మర్యాదలతో, చక్కని లయతో కూడిన – తీయనైన తెలుగు పదాలతో సొంపారే పదాలను దాదాపు ముప్పది రెండు వేల వరకూ రచించాడు. తాళ్ళపాక అన్నమయ్య. పదకవితల తలరాతల పెదతాత గా ప్రస్తుతింపబడినాడు.

భక్తిమయమైన పదం – సంకీర్తన అని పిలువబడుతుంది. దానినే కీర్తన అని కూడా అనవచ్చు. కీర్తనం – అంటే పొగడిక, స్తోత్రం అని అర్థం.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్ !
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్ !!

దైవం యొక్క నామ గుణ పరికర లీలలను ఈ భక్తి విధానాల ద్వారా సాధించడాన్ని భాగవతం చాలా బాగా చెపుతుంది. వీటిలో శ్రవణ కీర్తన స్మరణ భక్తి లక్షణాలు మూడు ఒకదానికొకటి పరస్పర సంబంధితాలు. ఈ సంబంధాన్ని – మూడింటిలో నడుమనున్న కీర్తనమే కల్పిస్తున్నది. భక్తుడు తన దైన్యాన్ని తెలియజేయడం – దైవం అభీష్టాన్ని నెరవేర్చడం – స్తోత్రం ద్వారా భగవంతుని రూపగుణాదులను వర్ణించడం కీర్తనాంతర్గత విషయాలు. ఇట్టి కీర్తనల వలన అంతః కరణ శుద్ధి మోక్ష కారణమౌతుంది. కాబట్టి భగవద్భక్తికి సులభ సాధనం కీర్తనమే. ఈ కీర్తనలు దేవునిపై చెప్పిన పదాలు కాబట్టి అన్నమయ్య – తనదంతర వాగ్గేయకారులలో ఎక్కువ మంది వాగ్గేయకారులు తమ గీతికలను సంకీర్తనలుగానే చాటుకొన్నారు. మధుర భక్తిమయమైన తన గీతికలను క్షేత్రయ్య "పద" మని పేర్కొనగా, త్యాగయ్య, ముద్దుస్వామి మున్నగువారి రచనలు కృతులుగా పిలువబడినాయి.

ఏది ఏమైనప్పటికీ, భక్తిమయమైన పదాలు లేక సంకీర్తనలను పాడిన అన్నమయ్య సంకీర్తనాచార్యునిగా సన్నుతింపబడినాడు.

సంకీర్తన లక్షణాలను తాను స్వయంగా రచించిన అన్నమయ్య - మలితరం వాగ్గేయ కారులకు మార్గ దర్శకుడైనాడు.

ఒక క్షేత్రయ్య - ఒక రామదాసు - ఒక త్యాగయ్య - ఇలా ఎందరో ప్రతిభామూర్తులు - అన్నమయ్య తెలుగు పదం చూపించిన వెలుగు పథంలో పయనించి తురీయాన్ని చేసి తరించారు. అటువంటి మహనీయుల శ్రేణిలో ఎన్నదగిన మరో వాగ్గేయకారకోత్తముడు తూము నృసింహదాసు.

మహాభక్తుడూ, కవీ, వాగ్గేయ కారుడూ ఐన తూము నృసింహదాసును గురించి విశేషాలను స్మరించుకోవడంతో పాటుగా, అన్నమయ్య - తూము నృసింహదాసుల వాగ్గేయ కర్తృత్వ ప్రతిభా విలాసాదులను సంతులనాత్మకంగా సందర్భోచితంగా చర్చించడానికి చేసిన పెను సాహసమే ఈ లఘు వ్యాసం.

తులనాత్మక పరిశీలనమంటే - రెండు విషయాల మధ్య వాటి సంబంధ బాంధవ్యాలు, సౌమ్య భేదాలు చర్చించడమే. ఇక్కడ ఇద్దరు మహామహులైన వాగ్గేయకారుల గురించిన తులనం - అంటే - వారిరువురి జీవితం - సంగీత - సాహిత్య తదితర అంశాలన్నీ స్పర్శనీయమౌతాయి. ఇందువల్ల అనేక నూతనాంశాలు వెల్లడి కాగలవు.

జీవితం :

అన్నమయ్య - తూము నృసింహదాసు - ఇరువురి జీవన గమనాలలో ఎన్నో పోలికలు కనిపిస్తాయి. అన్నమయ్య - తిరుమల శ్రీవేంకటపతిని సమాశ్రయిస్తే తూము నృసింహదాసు భద్రాద్రిరామ పద భక్తితో పునీతుడైనాడు. ఇరువురి జీవిత విశేషాలూ, వారి వంశీకుల రచించిన గ్రంథాల ద్వారానే లభిస్తున్నాయి.

ఇరువురూ స్మార్తులై ఉండి, వైష్ణవాన్ని స్వీకరించినవారే. ఇరువురూ గృహస్థాశ్రమాన్ని స్వీకరించి, అందులో ఉంటూనే మోక్షార్థులై భక్తి మార్గంలో పయనించారు. తిరుమలేశుని భక్తి ప్రేరణగా - అన్నమయ్య - కొండల రాయని సన్నిధికి చేరి, వేంకటపతిపై వేలాదిగా కీర్తనలను రచించి తరించగా- తూము నృసింహదాసు భద్రాద్రి రామునిపై మక్కువ ఎక్కువ

కలిగి, భద్రగిరికి తరలి వెళ్ళి భద్రాద్రి ధాముని కైంకర్యంలో జీవితాంతమూ గడిపాడు. వందలాది కీర్తనలను ఆ స్వామిపై రచించాడు. ఉభయులూ ప్రజలకనువైన భాషలో సులువైన గతులలో కీర్తనలను రచించి వ్యాప్తి చెందించడం ద్వారా ప్రజలలో భక్తి తత్పరతనూ, ధార్మిక చింతననూ ప్రోది చేసిన వారైనారు. కర్మయోగులై, వీతరాగులై విశ్వశ్రేయస్సుకై తమ శక్తియుక్తులను ధారవోసిన త్యాగధనులు వీరు.

అన్నమయ్య :

తాళ్ళపాక అన్నమయ్య నందకాంశ సంభూతుడు. క్రీ.శ. 1408 సంవత్సరం ప్రాంతంలో కడప జిల్లా తాళ్ళపాక గ్రామంలో – నందవర వైదిక బ్రాహ్మణ వంశంలో నారాయణ సూరి లక్కమాంబ దంపతులకు జన్మించాడు. వీరు ఋగ్వేదులు, ఆశ్వలాయన సూత్రులు. భరద్వాజస గోత్రులు. తాళ్ళపాక ఇంటి పేరైనది.

స్మార్తుడై ఉండి – ఘన విష్ణువనే యతీంద్రుని వలన అన్నమయ్య ఒక్క తిరుమల దివ్యక్షేత్ర మాత్రమే కాక, అనేక దివ్య తీర్థక్షేత్రాలను సందర్శించి, ఆయా దేవతామూర్తులపై – శ్రీవేంకటేశ్వరుని అభేదంగా – ఆశువుగా కీర్తనలను ఆలపించాడు. ప్రధానంగా – రాయలసీమలోని అనేక క్షేత్రాలనూ, కర్ణాటకలోని కలశాపురం, మతంగాద్రి, విజయనగరం, తమిళనాడులోని కంచి, శ్రీరంగం, చిదంబరం – ఇత్యాది అనేక క్షేత్రాలను దర్శించాడు. అహోబలం, కదిరి, సింహాద్రి, వేదాచలం, కనకగిరి, బొమ్మరెడ్డి చెర్లలో వెలసిన నారసింహ మూర్తులను దర్శించి ఆయా మూర్తులను విపులంగా తన కీర్తనలలో వర్ణించాడు. రాముడైనా, కృష్ణుడైనా, నృసింహుడైనా – ఏ దైవమైనా తన యిష్టదైవం శ్రీవేంకటేశ్వరునితో అభేదం కల్పించుకొని తృప్తి చెందాడు.

శ్రీరంగ క్షేత్రాన్ని దర్శించినప్పుడు ఆ స్వామిని చూచి .... (ధన్యాసి రాగం)

బ్రహ్మపూజించె రఘుపతి విభీషణున కిచ్చె ।
బ్రహ్మణ్యుడీ రంగపతి గొలువరో॥

కావేరీ మధ్య రంగ క్షేత్రమదివో
శ్రీ విమాన మదివో శేష పర్యంకమదే
దేవుండల్లదే వాడే దేవీ శ్రీలక్ష్మి అదే

సేవించరో నాభిం జిగురించె నజుండు ॥

– అంటూ కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు.

భజన కూటాల ద్వారా అన్నమయ్య సంకీర్తన ఆయన జీవించిన కాలం నాటి నుంచి నేటివరకూ వినిపిస్తూనే ఉంది. భజన సంప్రదాయ పద్ధతికి కుదురు కల్పించిన ఘనత అన్నమయ్యకే దక్కుతుంది. ఆ తరువాత కాలంలో రామదాసు, తూమునృసింహదాసు మున్నగు వాగ్గేయకారులు ఈ భజన సంప్రదాయ పద్ధతిలోనే తమ కీర్తనలను రచించి, ప్రజల భక్తి చైతన్యం తీసుకురాగలిగారంటే – అన్నమయ్య సంకీర్తన ఇచ్చిన స్ఫూర్తి కారణమని చెప్పవచ్చు.

అన్నమయ్య – పురందరదాసు సమకాలికులు కావడం – పురందరదాసు అన్నమయ్యను దర్శించడం – ఇరువురు మహావాగ్గేయకారులు తమ భావాలను ఒండొరులతో పంచుకోవడం కూడా చారిత్రక సత్యమే!

సమకాలీకులైన వీరిద్దరి సమాగమం తలచుకొంటేనే ఒక మధురానుభూతి. పదకవితా పితామహుని ఆశీర్వాదమే పురందరదాసుకు కర్ణాటక సంగీత పితామహత్వాన్ని కల్పించిందేమో!

తూము నృసింహదాసు :

"భాసురమైనది భద్రాద్రీశుని కొలువిది
మోసములేనిది భక్త మోక్షప్రద"

మంటూ భద్రాద్రి రాముని నిర్మలమైన భక్తితో కొలిచి, వందలాదిగా రచనల నందించిన భాగవతోత్తముడు తూము నృసింహదాసు.

1790–1833 సం. మధ్య జీవించిన ఈ వాగ్గేయకారుని జీవితం కూడా ఎంతో ఆదర్శవంతమైనదీ, వాగ్గేయకారులైన వారందరికీ స్ఫూర్తి దాయకమైనదీ. నృసింహదాసు మహాభక్తుడు. కవి, మంచివక్త, సంగీత విశారదుడు. గుంటూరులో, వెంగమాంబ అప్పయ్య దీక్షితులు దంపతులకు మంగళాద్రి లక్ష్మీ నృసింహ వరప్రసాదిగా జన్మించాడు నృసింహదాసు. గోల్కొండ వ్యాపారులు అనే బ్రాహ్మణ ఉపశాఖ వీరిది. ఆపస్తంబ సూత్రము. యజుర్వేదాధ్యయనులు. వశిష్ట శక్తి పరాశరాఖ్యత్రయార్షేయులు. తూము అనేది ఇంటి పేరు.

తూము నృసింహదాసు, చిన్న వయసులోనే ఉద్యోగ విరమణ కావించి, రామ సద్యోగమే మేలని యెంచి, భజనాదికాలు నిర్వహిస్తూ, విస్తృతంగా భారతదేశంలోని తీర్థక్షేత్రాలనెన్నింటినో సేవించిన భక్తుడు. ఆయా క్షేత్రాలలో దర్శించిన దేవతా మూర్తులపై ఆశువుగా కీర్తనలను పద్యాలను చెప్పిన గొప్పకవి.

గుంటూరులోని స్వగృహంలో పట్టాభి రామమూర్తి పటాన్ని నెలకొల్పి, భజనాదులను నిర్వహిస్తూ, ప్రజలలో ఆస్తిక్య భావనోద్దీపనాన్ని కలిగించాడు. భద్రాద్రి రాముడు స్వప్నంలో సాక్షాత్కారించి భద్రాద్రి దర్శింపుమని ఆజ్ఞాపించగా భద్రాద్రి వెళ్ళి శ్రీరామచంద్రుని దర్శించుకొన్నాడు. నృసింహదాసు కూడా దామోదరం కేశవదాసు అనే యతీంద్రుని వలన పంచ సంస్కార దీక్షను పొంది విశిష్టాద్వైత మతాన్ని స్వీకరించాడు. ఎన్ని కష్టాలు పడినా, రామభక్తియే పెన్నిధిగా భావించి కడకు దారిద్ర్య బాధలను సైతం లెక్కచేయక తన జీవితాన్ని శ్రీరామపద సేవకై అంకిత మొనర్చిన మహాత్ముడు. దేశంలోని ప్రసిద్ధమైన తీర్థక్షేత్రాల నెన్నింటినో దర్శించి, ఆయా దేవతా మూర్తులపై కీర్తనలను ఆలపించాడు.

కంచి, శ్రీరంగం, తిరుపతి, శోభనాద్రి వంటి క్షేత్రాలు ఆయన దర్శించినవాటిలో ఉన్నాయి. అన్నమయ్యవలెనే, ఏ క్షేత్రంలోని ఏ దేవతామూర్తిని దర్శించినా - భద్రాద్రి రామునితో అభేదం కల్పించుకొని కీర్తించడం కనిపిస్తుంది

శ్రీరంగంలోని రంగనాథస్వామిని దర్శించి నృసింహదాసు కూడా:

ప.॥ *కావేటి రంగా - నను కావవేరా*

అ.॥ప.॥ *కావేటి రంగ నను గావుమనుచు వేద*
రావేమి సేతురా రాకుమారా *॥ కావేటి రంగా ॥*

చ.॥1 *కోమలాంగులెల్ల చామర లిడుచుండ*
నా మొరాలింపరో కామ జనకా *॥ కావేటి రంగా ॥*

చ.॥2 *కోరిక తోడ తూము నారసింహ దాసుని*
జేరి రక్షింపవే ముథారి శౌరి *॥ కావేటి రంగా ॥*

అంటూ ప్రస్తుతించాడు. శ్రీరంగనాధుని పై చెప్పిన ఇటువంటి కీర్తనలేకాక -

కంచిలో వరదరాజస్వామిని దర్శించినపుడు :

వరదుని గంటిని - కంచి

వరదుని గంటిని -

అంటూ - *"భద్రాచలంబున భూసుత సహితుడైన రాముని పోల్కి"* - ఉన్నాడీ వరదరాజస్వామి అని భద్రాద్రి రామునితో కంచి వరదయ్యకు అభేదాన్ని కల్పించాడు.

తిరుపతి క్షేత్రాన్ని దర్శించినప్పుడు - అక్కడి దేవాలయంలో పూజారుల దౌష్ట్యాన్ని - ఆలయ నిర్వహణ లోపాలను ఎత్తి చూపుతూ ఒక పద్యం చెప్పాడు.

" శ్రీపాద రేణువు చిన్నంవరా యంచు

బల్కువైష్ణవ పరిభాష వింటే !

స్వామి ప్రసాద సంప్రాప్తంబు గోరిన

వెల చాల హెచ్చను విధంబుగంటి

భక్తి ఎంత యున్న ఁ బైకంబు లేదని

సర్వసాక్షియైన సామికెరుక ఁ

గాన నతడె నన్నుఁ గనిప్రోల్చు వేల్పని

యారంబు దాఁటి యవలి కరిగి " - ఇలా చురకలతో సాగుతుంది పద్యం.

అన్నమయ్య - పురందరదాసుల మధుర సమాగం వలెనే తూము నృసింహదాసు - త్యాగరాజస్వామి సందర్శనం కూడా ఒక మధురమైన ఘట్టం. 1821వ సంవత్సరంలో దాసుగారు దక్షిణ దిగ్యాత్రకై తరలివెళ్ళిన సమయంలో తిరువయ్యారులో త్యాగరాజస్వామిని సందర్శించారు.

త్యాగయ్య నిర్వహించే భజన గోష్టిలో పాల్గొన్న దాసుగారు త్యాగయ్య కోరికపై ఆశువుగా ఒక కీర్తన కూడా ఆలపించారు. ఆ కీర్తన పల్లవి ఇది -

ప.॥ *"పోరే మీ ఇండ్లకు - ప్రొద్దున లేచి*

రారే రాముని సేవకు " *(అహిరి - మిశ్రచాపు)*

త్యాగయ్య భజన పద్ధతి, శిష్య పరివారము, పూజావిధానము, సంగీత పద్ధతులు - అన్నింటినీ పరిశీలించే అవకాశం దాసుగారికి ఈ యాత్రలో లభించింది.

అన్నమయ్యవలెనే దాసుగారు కూడ, భగవద్భక్తితో పాటుగా భాగవతుల యెడ భక్తి భావం కలిగిన నిజమైన భక్తుడు.

"భాగవతుల పాదరజము పైని చల్లు కోవలె

వారి సేవ మన భాగ్య మనుకోవలె " - అంటూ బిలహరి రాగం - ఆదితాళ కీర్తనలో హరిసేవకుల పట్ల ఎనలేని గౌరవాన్ని ప్రకటించాడు.

నృసింహదాసు గొప్ప సద్గురువు. వరదరామదాసు, అల్లూరి వేంకటాద్రి స్వామి వంటి గొప్ప భక్తులు దాసుగారి శిష్యులే. దేశమంతటా విస్తృతంగా పర్యటించిన దాసుగారు జాతివర్ణ విచక్షణ పాటించక, కోరిన వారెల్లరికీ తారకమంత్రోపదేశం చేసిన సమబుద్ధి బలుడు. నాటి నిజాం సర్కార్‌లో మంత్రిగా పనిచేసిన చందూలాల్ మాధర్‌లాల్ సేఠ్‌ను కూడా తారక మంత్రోపదేశం చేసి రామభక్తునిగా తీర్చిదిద్దిన దేశికోత్తముడు దాసుగారు. రామదాసు తరువాత భద్రాద్రి ఆలయ పునర్వైభవానికై ఎనలేని కృషిసల్పిన ఆస్తిక్యభావ సంపన్నుడు. అన్నమయ్య దాదాపు ఎనిమిది పదుల సంవత్సరాలు జీవించగా, తూము నృసింహదాసు కేవలం 43 సంవత్సరాలు మాత్రమే జీవించాడు. అయినప్పటికీ వాగ్గేయ కారకోత్తములుగా వారు ఉభయులూ కృతకృత్యులే! ఆప్తమిత్రుడూ, ప్రియశిష్యుడూ ఐన వరదరామదాసు అకాల మరణం పొందడంతో, వ్యధచెందిన నృసింహదాసు మిత్రునితో పాటుగా ప్రాణత్యాగం చేశాడు. అంతటి సున్నితమైన మైత్రీభావం కలిగిన సౌమనస్వి. సమతత్వ చింతన కలిగిన సమాజ కవి - త్యాగమూర్తి. వెరసి దాసుగారు ఒక నిండు మనిషి.

సాహిత్యం :

అన్నమయ్య, తూము నృసింహదాసు - ఇరువరి కీర్తనలలోని సాహిత్యం శిష్టేతరమై పామరజనులు సైతం సులభంగా గ్రహించేందుకు వీలవుతుంది.

"భావములోనా బాహ్యమునందున " శ్రీవేంకటపతి దివ్య చరణారవిందములను విడువక కొలిచిన అన్నమయ్య తన కీర్తనలలో కొన్నింటిని ఆధ్యాత్మ భావ గాంభీర్య సంపన్నంగా

తీర్చిదిద్దితే, మరి కొన్నింటిని మధుర భక్తి మయ సరస శృంగార కలితంగా మలచాడు. రెంటిలోనూ హరిభక్తియే వస్తువు.

నృసింహదాసు కీర్తనలలో రాముని నామరూప గుణాదులను కీర్తించడం, ఆర్తిగా ప్రార్థించటం కనిపిస్తుంది. కొన్ని వేదాంతతత్త్వ ధోరణిలో రచించినవీ ఉన్నాయి. కాని, వాటిలోనూ రామభక్తియే వస్తువు. శరణాగతియే ఇరువురి భక్తి మార్గం.

అన్నమయ్యగానీ - దాసుగారు గానీ - వీరు అచలవాదులు కారు. సాధారణంగా తత్త్వాలలో కనబడే అచలవాదానికి ప్రతిగా, ఆస్తిక్యాన్ని బోధించారు వీరు. ప్రసిద్ధ పండితులు శ్రీబాలాంత్రపు రజనీకాంతరావు గారు నృసింహదాసు, రామదాసు మున్నగువారల భక్తితత్త్వాన్ని "రామాద్వైతం" అని అనవచ్చునేమో అంటారు. అన్నమయ్య "తేకువ హరినామమే దిక్కు మరిలే" దంటూ స్పష్టంగా ప్రకటించగా, నృసింహదాసు "రామనామమే జీవన" మంటూ తన లక్ష్యాన్ని అంతే స్పష్టంగా ప్రకటించాడు.

అన్నమయ్య :

కేవలం శ్రీ వేంకటేశ్వరుని దివ్య రూప నామ గుణ వైభవాలనే కాక, శ్రీవారి దివ్యక్షేత్రాన్ని కూడా : ***"అదివో అల్లదివో శ్రీహరి వాసము....***

పదివేలు శేషుల పడగల మయము ...." - అంటూ ఎంతో రమ్యంగా వర్ణించగా;

నృసింహదాసు : (ధన్యాసి- రూపకం)

"దర్శనమదిగో భద్రాచల దర్శనమదిగో....

అ.ప.॥ : *దర్శనమదిగో శ్రీ హరికి మందిరమై*
సిరిగలిగి వెలసెడి గిరి సత్తముని యొక్క ॥*దర్శనమదిగో*॥

చ॥ : *ధరణిలోపల తూము నరసింహదాసుని*
దొరయేలు శ్రీభద్రగిరి యుత్తముని యొక్క ॥*దర్శనమదిగో*॥

- అంటూ గౌతమీ నదీ తీరంలో - ఆవలివైపు నుండి భద్రగిరి రమణీయ దృశ్యం కాంచినప్పుడు కలిగిన పారవశ్యంతో గానం చేశాడు.

అన్నమయ్య - నృసింహదాసు - ఇరువురూ - సంస్కృతాంధ్ర ఉభయ భాషా విశారదులు. అందుకే వీరువురి కేవల సంస్కృత రచనలు కూడా మనకు లభిస్తున్నాయి.

అన్నమయ్య రచించిన సంస్కృత కీర్తన : *నాదనామ క్రియ :*

ప.॥ : *సకలం హేసఖి జానామి - తత్*
ప్రకట విలాసం - పరమం దధసే

నృసింహదాసు సంస్కృత రచన : (నాటరాగం - ఆదితాళము)

ప.॥ : *నమోస్తుతే రఘునాయక ! నమోస్తుతే*

1. *నమూస్తుతే రఘునాధ పరాత్పర*
రమా మనోహర రణ జయశూర ॥*నమోస్తుతే*॥

2. వారణ దుఃఖ నివారణ శుభకర
నారసింహదాసావనలోల ॥ నమోస్తుతే ॥

అన్నింటి కంటే దివ్యమైనదీ, మధురమైనదీ భగవంతుని నామ సంకీర్తనమే. భగవంతుని దివ్యనామం పాదాంతంలో గానీ, పాదం మొదట్లోగానీ, చరణాంతంలో గానీ ఉంచి భక్తులందరూ కలసి పాడుకోవడానికి అనువుగా సరళమైన కూర్పుతో సాగే రచనలే "దివ్యనామ సంకీర్తనలు". ఇటువంటి దివ్యనామ కీర్తనలు అన్నమయ్య, నృసింహదాసూ - ఇరువురూ రచించారు.

అన్నమయ్య :

ప.॥ : నిగమ నిగమాంత వర్ణిత మనోహర రూప
నగరాజధరుడా శ్రీ నారాయణా ॥

నృసింహదాసు :

ప.॥ : *నారాయణ శ్రీమన్నారాయణ*
నారాయణాచ్యుత నగధర ॥
నారసింహ నామా - అనంత శౌరి *॥ నారాయణ ॥*

చ.॥ *కోరికలిచ్చు తూము నరసింహుని చేరి* ॥
కాచి రక్షించు శ్రీమన్నారాయణ॥ *॥ నారాయణ ॥*

వాత్సల్య భక్తి :

ఆర్ద్రమైన మనసులో నిండారిన ప్రేమ వాత్సల్యభక్తిగా రూపొందుతుంది. ఈ వాత్సల్యభక్తి లోని విశేషమేమంటే భగవంతుని సర్వేశ్వరత్వం గుర్తిస్తూనే. అతని శిశువుగా భావించి ఊయల

ఊపడం, ఉగ్గుపెట్టడం, దిష్టితీయడం, బువ్వతినిపించడం, పిల్లచేష్టలను తెల్పడం, మందలించడం, శిశువు సంక్షేమానికై తపనపడడం, ఎక్కడో దాగినాడని అన్వేషించడం, దొరికినాడని సంబరపడడం – ఇలాగ ఎన్నో విధాలుగా వాత్సల్యభక్తి ప్రకటితమౌతుంది.

అన్నమయ్య : వేంకటేశ్వరుని బాలకృష్ణునిగా సంభావించి చెప్పిన కీర్తన :

ఆనందభైరవి – ఆది :

ఇట్టి ముద్దులాడి బాలుడేడ వాడు వాని
పట్టితెచ్చి పొట్టనిండ పాలు పోయరే ॥

నృసింహదాసు : నాదనామ క్రియ : మిశ్రచాపు

ప.॥ ఎవరేమన్నారురా రాఘవ నిన్నెవరేమన్నారురా

అ.ప ఎవరేమన్నారు యినకుల తిలక నా
చెవిలోన దెల్పు మావల వారి దండింతు ॥ ఎవరే ॥

బాలురతో నాడి చాలయలసినావు
పాలిత్తు రమ్మన్న పరుగెత్తి దాగేవు ॥ ఎవరే ॥

పిలచిన పలుకవు నిలచి మాట్లాడవు
అదీకలు చేసెదవు ఆర్తశరణ్య ॥ ఎవరే ॥

ధరణి నరసింహదాసుని వెంట నీ
వర లేక యున్నావాడవననుచు నోర్వలేక ॥ ఎవరే ॥

నరసింహదాసుని వెంట భగవంతుడున్నాడని ఓర్వలేక ఎవరన్నా ఏమన్నా అన్నారేమోనని దాసుగారి అనుమానం.

అన్నమయ్య – తూము నృసింహదాసు – ఇరువురూ ఆయా సందర్భాలలో జరిగే ఉత్సవాలు – అంటే నిత్యోత్సవ వారోత్సవ పక్షోత్సవాది సకల ఉత్సవాలకు సంబంధించిన విశేషాలను తమ కీర్తనలలో పేర్కొన్నారు. నృసింహదాసు భద్రాద్రి రాముని నిత్యోత్సవానికి సంబంధించి – ప్రబోధాది ఏకాంత సేవా పర్యంతమూ – అన్ని సేవలకు కీర్తనలను రచించి – శ్రీరంగంలో వలె – భద్రాద్రి ఆలయంలో కూడా మంత్ర సహితార్చనలతో పాటుగా గానార్చన

సేవా సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు. ఈ గానార్చన సంప్రదాయం భద్రాద్రి ఆలయంలో నేటికీ కొనసాగుతున్నది. ఈ కీర్తనలతో పాటుగా, దర్బారుసేవ, ఏకాంతసేవ మొదలైన సందర్భాలలో దాసుగారు రచించిన పద్యాలను కూడా గానం చేస్తారు.

దేశకవితారూపాలు :

మేలుకొలుపు - అన్నమయ్య :ఎందాక నిద్ర తెల్లవారినదె – యిందిరా రమణ నీవిదే మేలుకొనవె.

నృసింహదాసు : మేలుకో కరుణాలవాల జానకిలోల.

ఉయ్యాల - **అన్నమయ్య** : ఉయ్యాలా బాలునూచెదరు కడు నుయ్య నుయ్య నుయ్యనుచు

నృసింహదాసు : ఉయ్యాలో జంపాలో మా ఒప్పుల కుప్పనికి కురికు య్యాలించిన గోపాలునకు.

లాలి - **అన్నమయ్య** : లాలనుచు నూచేరు లలనలిరుగడల బాల గండవర గోపాల నినుజాల

నృసింహదాసు : లాలి శ్రీరఘువర రాజా శిరోమణి లాలి లాలి –
మా పాలిట శ్రీనివాస భక్త మందార! లాలి లాలి.

మంగళం - **అన్నమయ్య** : మంగళము గోవిందునకు జయ మంగళము గరుడధ్వజునకు
మంగళము సర్వాత్మునకు – ధర్మస్వరూపునకు జయ
జయమంగళం

నృసింహదాసు : జయ మంగళం నిత్య శుభ మంగళం
మా తల్లి సీతమ్మకు జయ మంగళం

జోల - **అన్నమయ్య** : జో అచ్చుతానంద జో జో ముకుంద
రావె పరమానంద రామగోవిందా ....

నృసింహదాసు : జో...జో.. రఘూత్తంస జో పద్మనాభా
జో మైథిలీనాథ జో రామచంద్రా......

ఇంకా దిష్టి, విరిబంతులాట మొదలైన దేశకవితా రూపాలలో ఇరువురి కీర్తనలూ లభిస్తున్నాయి.

విషయాన్ని దృశ్య చిత్రణం (పెరస్పెక్టివ్) గా మలచి అందించే అద్భుతశక్తి ఈ ఇరువురి వాగ్గేయకారులకూ ఉంది.

అన్నమయ్య : పల్లవి : ***అలరులు కురియగ నాడెనదే***

అలకల కులుకుల అ లమేల్మంగ...... ॥***అలరులు***॥

.... కందువ తిరువేంకటపతి మెచ్చగ

అందపు తిరుపుల నలమేలుమంగ ॥***అలరులు***॥

అలమ్మేలుమంగ ఆటను - అలా కళ్ళకు కట్టినట్టుగా వర్ణిస్తుంది ఈ కీర్తన.

నృసింహదాసు : ఇలాంటి అద్భుతమైన దృశ్య చిత్రాన్ని చేసిన కీర్తన భైరవి, ఆదితాళం.

ప.॥ దొరవలె కూరుచున్నాడు - భద్ర
గిరినాధుడితడేమో చూడు ॥ దొరవలె॥

అ.ప॥ మెరుపైన చేమంతి విరుల దండలు చాల
మురియుచు ధరియించి ముదిత సీతను గూడి ॥ దొరవలె ॥

1. పురుమంజి ముత్యాల సరులు కెంపుల తాళి
మెఱయుచు నుండగ చిరునవ్వు మొగముతో ॥ దొరవలె ॥

2. కాంచన చేలము కనక కిరీటము
లాంఛనములు గల లక్ష్మణాగ్రజుడిదె ॥దొరవలె ॥

3. విరుల చప్పరమున పరమభక్తులు కొల్వ
నరసింహదాసుని నరసిప్రోచుటకు ॥ దొరవలె ॥

దొరతనం ఉట్టిపడేలా సకల రాజలాంఛనాలతో సర్వాంగభూషితుడై, పీతాంబరధరుడై విరుల చప్పరమున కొలువు తీరిన భద్రాద్రి రాముని ఎంతో మనోహరంగా వర్ణించారీ కీర్తనలో.

యిరువురు వాగ్గేయకారులు వ్రాసిన భాష శిష్ట వ్యావహారికమూ సామాన్య ప్రజల వ్యవహారంలో ఉన్న భాషా - రెంటినీ ఉపయోగించారు. అయితే అన్నమయ్య కాలం నాటి భాషారూపం 4 శతాబ్దాల తరువాత నృసింహదాసు వద్దకు వచ్చేసరికి కొంత మారడం సహజమే కదా! ఏది ఏమైనా, పామరజనులే లక్ష్యంగా గల యీ యిరువురి సంకీర్తనలలోనూ పెద్ద పెద్ద బరువైన గ్రాంధికం ఏ మాత్రం కనిపించదు. కొన్ని సంస్కృత సమాసాలను అనివార్యమైన సందర్భాలలో ప్రయోగించినా, అవి కీర్తనలకు గ్రాంథిక వాసన పట్టించలేదు.

అన్నమయ్య - తూము నృసింహదాసు సృజించిన కీర్తనేతర సాహిత్యం కూడా ఉంది. మార్గ కవితా సంప్రదాయాన్ననుసరించి, వేంకటేశ్వర శతకాది పద్య రచనలను అన్నమయ్య చేస్తే యాత్రానుభవాలను ఆశువుగా పద్యాలలో పలికించాడు అంతేకాక నరసింహదాసు సంస్కృతంలో చూర్ణికలు, శ్లోకాలు కూడా రచించాడు. అన్నమయ్య - నృసింహదాసు ఇరువురి సాహిత్యం ప్రజల కోసం సృష్టించబడినట్టిది.

***

ఆళ్వారులు - అన్నమయ్య

డా. టి.యస్.గిరిప్రకాశ్

ప్రొఫెసర్, తెలుగుశాఖ,

మధురై కామరాజ్ యూనివర్సిటీ, మధురై.

భారతదేశంలో మొట్టమొదటి శైవ, వైష్ణవ సాహిత్యాలు తమిళ దేశంలోనే ప్రారంభమయ్యాయి. శైవ నాయన్మారుల భక్తిగీతాలు (క్రీ.శ. 6వ శతాబ్దం) వైష్ణవ ఆళ్వారుల పాశురాలు (క్రీ.శ. 6వ శతాబ్దం) ప్రజలలో భక్తి భావాన్ని ఇనుమడింపజేశాయి.

భారతదేశం పలు భాషల పుట్టినిల్లు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ మూల సూత్రం తులనాత్మక పరిశోధనల మూలంగా భారతీయ సాహిత్యాలలోని పరిణామాలు మార్పులు దాదాపు ఒకే విధంగా పరిణమించాయని తెలుస్తున్నది. తులనాత్మక పరిశోధనలు జాతీయ సమైక్యతకు, సాహిత్య ప్రక్రియల పుట్టు పూర్వోత్తరాల అవగాహనకు దోహదకారి కాగలవు.

హెన్రీ హెచ్.హెచ్. రీమాక్ అనే తులనాత్మక శాస్త్ర పరిశోధకుడు తన వ్యాసం "Comparative Literature" లో ఒక ప్రాంతానికీ, మరొక ప్రాంతానికీ, ఒక దేశానికీ, మరొక దేశానికీ సంబంధించిన సాహిత్యాలను తులనాత్మకంగా పరిశీలించడమే కాకుండా, ఒక సాహిత్యానికీ యితర సంబంధిత కళలను (శిల్పం, సంగీతం, మనస్తత్వ శాస్త్రం, చరిత్ర, ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలు తులనాత్మకంగా పరిశోధించడమే తులనాత్మక సాహిత్యమనబడుతుందని చెప్పాడు. తులనాత్మక పరిశోధనలో ఒక అంశమే "Influential Study" (ప్రభావ అధ్యయనము).

ప్రస్తుత వ్యాసం వైష్ణవ ఆళ్వారుల పాశురాలు అన్నమయ్యను ఏవిధంగా ప్రభావితం చేశాయనే విషయాన్ని తెలియజేస్తుంది.

ఆళ్వారులు పన్నిద్దరు సంస్కృతంలో ఒక సుప్రసిద్ధ శ్లోకం మనకు కానవస్తున్నది.

"భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖర యోగి వాహాన్
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్ పరాంకుశమునిం ప్రణతోస్మి నిత్యం"

పై శ్లోకంలో చెప్పబడిన ఆళ్వారులు వరుసగా సరోయోగి, భూతయోగి, మహాయోగి, భట్టనాథుడు, భక్తిసారుడు, కులశేఖరుడు, మునివాహనుడు, భక్తాంఘ్రిరేణువు, పరకాల యోగి, శ్రీమద్రామానుజులు, శఠకోపముని, ఆండాళ్. పైన చెప్పబడిన శ్లోకంలో 'శ్రీ' అనగా ఆండాళ్ (భూదేవి అంశం) అని అర్థం చెబుతారు విజ్ఞులు. వీరినే తమిళంలో పొయ్‌గై ఆళ్వార్, పూదత్తాళ్వార్, పేయాళ్వార్, పెరియాళ్వార్, తిరుమళిశైయాళ్వార్, కులశేఖరాళ్వార్, తిరుప్పాణాళ్వార్, ఉడయవర్, నమ్మాళ్వార్, ఆండాళ్ అని అంటారు.

ఈ పన్నిద్దరాళ్వారులు కారణజన్ములే. దైవాంశ సంభూతులే.

పొయ్‌గై ఆళ్వారు	-	పాంచజన్యాంశము
పూదత్తాళ్వారు	-	గదాంశము
పేయాళ్వార్	-	ఖడ్గాంశము
పెరియాళ్వార్	-	గరుత్మంతుని అంశము
తిరుమళిశై ఆళ్వార్	-	సుదర్శన చక్రాంశము
కులశేఖరాళ్వార్	-	కౌస్తుభరత్నాంశము
తిరుప్పాణాళ్వార్	-	శ్రీవత్సలాంచనాంశము
తొండరడిప్పొడి ఆళ్వార్	-	వైజయంతీ వనమాలాంశము
తిరుమంగై ఆళ్వార్	-	శార్ఙ్గాంశము
శ్రీమద్రామానుజులు	-	ఆదిశేషావతారము
నమ్మాళ్వార్	-	విష్వక్సేనుని అంశము
మధురకవి ఆళ్వార్	-	కుముదుని అంశము
ఆండాళ్	-	భూదేవి అవతారము

ఈ పంద్రెండుగురు పాడిన పాశురాలు మొత్తం 4,000. వీటినే తమిళంలో 'నాలాయిర

దివ్య ప్రబంధ' మని పేరు. తమిళంలో నాలు అంటే నాలుగు, 'ఆయిరం' అంటే వెయ్యి. నాలుగు+ ఆయిరం = నాలాయిరం - నాలుగువేలు.

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల గురువుగారు అహోబల మఠాన్ని స్థాపించిన శ్రీమాన్ శఠకోపమునీశ్వరులే. ఈయన అన్నమాచార్యులకు వైష్ణవ దీక్షనిచ్చినవారు. అన్నమాచార్యులు ఆయన వద్ద సకల వైష్ణవ గ్రంథాల రహస్యాలను కూలంకుషంగా నేర్చుకొని ఆళ్వారుల ప్రభావానికిలోనై ఉంటారనడంలో ఎలాంటి సందేహమూలేదు. అన్నమయ్య సంకీర్తనలను పరిశీలిస్తే మనకీ విషయం అవగతమవుతుంది.

ఆళ్వారులందఱి యుద్దేశమొక్కటే. శ్రీమన్నారాయణుడే ఆదిదేవుడన్నది వాళ్ళ గట్టి నమ్మకము. తమ పాశురాలలో చాలామంది ఆళ్వారులు ఈ విషయాన్ని చాలా సార్లు పేర్కొన్నట్లు తెలియవస్తున్నది.

పొయ్‌గై ఆళ్వారు - (ఇయ్యుఱ్పా - ముతల్ తిరువన్తాది- 15)

'ముదలావార్ మూవరె అమ్మూవరుళ్ళుం
ముదలావాన్ మూరినీర్ వణ్ణన్ ముదలాయ
నల్లానరుళల్లాల్ నామనీర్ వైయగత్తు
పల్లారరుళుం పళుదు' - అన్నాడు.

ముఖ్యులు ముగ్గురే వారిలో ప్రధానమైనటువంటివాడు నీలవర్ణశ్యాముడే. కరుణాసింధువు అయిన అతని దయ ఉంటే చాలు. మిగిలినవారి దయకు ప్రాకులాడడం అనవసరమని తెలిపాడు.

అన్నమయ్య -

మొదల జగములకు మూలమయిన వాడు
తుద ప్రళయము నాడు తోచేవాడు
కదిసి నడుమనిండి కలిగి వుండెడివాడు
మదన గురుడే కాక మఱి వేరె కలడా?
పరమాణువైనవాడు బ్రహ్మాండమైనవాడు

సురులకు నరులకు జోటయిన వాడు
పరమయినవాడు ప్రపంచమయినవాడు
హరి యొక్కడే కాక అవ్వలను గలరా!

అన్న సంకీర్తనలో ఆది, అంతము, సర్వము అయినవాడు శ్రీమహావిష్ణువే కాక మరి వేరే వాడెవ్వడూ లేడని తెలుపుతున్నాడు.

" పేయాళ్వార్ (మున్నాన్తిరు వన్తాదిలో)
తాళ్ జెడైయుం నీళ్ ముడియుమ్
ఒణ్ మళవుం చక్కరముయ్
శూళరవుమ్ పొన్నానుమ్ తోన్రుమాల్ చూళుమ్
తిరండరువి పాయుమ్ తిరుమలై మేల్ ఎన్దైక్కు
ఇరండురువుం ఒన్రాయ్ ఇశైన్దు "

జటాధారియై,పెద్ద కిరీటము, గొడ్డలి, చక్రము, చేతులకు చుట్టబడిన పాములు, బంగారు మొలతాడు మొదలగు వానిని ధరించి మనోహరమయిన సెలయేళ్ళతో నిండియున్న. తిరుమలకొండ మీద నెలకొన్న నా స్వామి హరిహర స్వరూపుడుగా కానవస్తున్నాడు.

"నమ్మాళ్వార్ (తిరువాయ్ మొళిలోను)
అవరవర్ తమ తమదు, అఱివు, అఱివగైవగై
అవరవర్ ఇఱై యవరెన, అడి అడైవర్గళ్
అవరవరిఱై యవర్, కుఱై విలరిఱైయవర్
అవరవర్ విదివళి, అడైయనిన్రనరే."

తమ బుద్ధికి తెలిసిన విధంగా ప్రతివారు వాళ్ళ వాళ్ళ ఇష్టదైవాన్ని భావించి పాదాభివందనం చేసి ఆశ్రయిస్తారు. ఆ ఇష్టదైవాల వలె వారి వార యోగ్యతను అనుసరించి, ఏడుకొండలవాడు ఫలితాలను వాళ్ళకు కలిగిస్తాడని చెప్పారు.

అన్నమయ్య స్పష్టంగా : (2-393) బౌళి రాగం

ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడ పిండంతే నిప్పటియన్నట్లు ॥ పల్లవి ॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు ॥ ఎంత ॥

అన్ని దేవతల స్వరూపమే శ్రీనివాసుడని స్పష్టీకరించాడు.

వాగ్గేయకారులలో చాలామంది మరియు ఆళ్వారులు కుల ప్రస్తావన చేసి యున్నారు. అన్ని కులాలు సమానమయినవని తెలిపినవారే. ఆళ్వారులలోను చాలామంది హెచ్చు కులజులు, నీచకులజులన్న భేదాలులేవని, భగవంతునికి అందరూ సమానమనే నొక్కి వక్కాణించారు.

తొండరడిప్పొడి ఆళ్వార్ (మొదలాయిరం - తిరుమాలై - 42)
తమ పాశురంలో

"పఴుదిలా వొழுగలాఱ్ఱు పలచదప్పేది మార్గళ్
ఇఴి కులత్తవర్ గళేనుం ఎమ్మడియార్ కళాగిల్
తొழுమినీర్ కొడుమిన్ కొన్మిన్ ఎన్ఱు నిన్నొడుం ఒక్క
వఴిపడ అరుళినాయ్ పోల్ మదిల్ తిరువరంగత్తమ్మానే." - అని చెప్పియున్నారు.

దోషరహితమయిన చతుర్వేదాలను అధ్యయనం చేసిన ఓ బ్రాహ్మణులారా! నీచకులజులయినా భక్తులై భగవంతుని దాసులయితే వాళ్ళను మీరు సేవింపుడు. వారికి కావలసినవి ఇవ్వండి. మీకు కావలసినవి అడిగి తీసుకోండి అని హితబోధ చేసితివి కదా! ఓ రంగనాథా! అని తెలుపుతున్నారు.

అన్నమయ్య తమ సంకీర్తనలో..... (లలిత; 2-383)

విజాతులన్నియు వృథా వృథా
అజామిళాదుల కదియే జాతి ॥ పల్లవి ॥

కాతి బేధములు శరీర గుణములు
జాతి శరీరము సరిదోడనే చెడు

ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరి విజ్ఞానపు దాస్యంబిది యొక్కటే పో సుజాతి ॥ విజా ॥

భగవంతుడికి అందరూ సమానమని తెలిపి, ఎవరు భగవంతునికి దాసులవుతారో వారిదే సుజాతియని, అందరిలోను అంతరాత్ముడా దేవదేవుడయిన వేంకటేశ్వరుడని, జాతి భేదములెంచినట్లయిన, అది పరమయోగులకు కూడ మంచిది కాదని, మదము కలిగినటువంటి వారవుతారని, పరతత్త్వజ్ఞానాన్ని ఎవరు పొందినా వారిదే సుజాతి అని అన్నమయ్య చాటి చెప్పాడు.

ఆళ్వారులందఱు శ్రీమన్నారాయణుడొక్కడే పాపరహితుడని, మోక్ష ప్రదాతయని, అన్నిటికీ సర్వాధారమాతడేయని స్పష్టీకరించారు.

నమ్మాళ్వార్ (తిరువాయ్ మొళి - 1-7)

తిడవిశుమ్బు ఎరి వళినీర్ ఇవై మిశై

పడర్ పొరుళ్ ముళువదుమాయ్ అవై అవై దొఱుమ్

ఉడల్ మిశై ఉయిర్ ఎనకరన్దు ఎఙ్గుమ్ పరన్దు ఉళన్

శుడర్ మిగు శురుదియుళ్ ఇవై ఉణ్డశురనే !

ఆకాశము, అగ్ని, గాలి,నీరు, భూమి - అనేవి స్థిరములే. వాని మీద వ్యాపించిన వస్తువులో జీవాత్మయై వ్యాపించియున్నవాడు విష్ణువే అని చెబితే -

అన్నమయ్య 'నిత్యాత్ముడై' అన్న కీర్తనలో (1.75)

ఏమూర్తి లోకంబులెల్ల నేలెడు నాత

దే మూర్తి సర్వాత్ముదేమూర్తి పరమాత్మ

డామూర్తి తిరువేంకటాద్రి విభుడు, అని చెప్పి అంతటితో ఆగకుండా....

యే దేవు దేహమున నన్నియును జన్మించె

నే దేవు దేహమున నిన్నియును నణగెమరి

నే దేవు విగ్రహంబీ సకల మీతయును

యే దేవు నేత్రంబు లిన చంద్రులు

యే దేవుడీజీవు లన్నింటిలో నుండు

నే దేవు చైతన్య మిన్నిటికి నాధార

యే దేవు డవ్యక్తుడే దేవుదద్వంద్యు

డా దేవుడే వెంకటాద్రి విభుడు - అని వెంకటేశ్వరుడే సర్వ ప్రాణి కోటికి మూలమని తన నిశ్చితాభిప్రాయాన్ని తెలిపాడు.

కులశేఖరాళ్వార్ 'ముకుందమాలా' లో

దివినా భువినా మమాస్తు వాసో
నరకేవా నరకాంతక ప్రకామమ్
అపధీరత శరదార విందౌ
చరణౌతే మరణే పి సంశ్రయామి

స్వర్గంలో కాని, భూమిలో కాని, చివరకు నరకంలో ఉన్నా నీ చరణార విందాలను ఆశ్రయించే ఉండాలని కోరుకున్నవాడు కులశేఖరాళ్వార్.

అన్నమయ్య -

ఇహమే కాని యిక పరమే కాని
బహుళమై హరి నీపై భక్తే చాలు
యెందు జనించిననేమి యెచ్చటనున్ననేమి?
కందువ నీ ధ్యానము కలిగితే చాలు
అంది స్వర్గమే కాని అల నరకమే కాని
అందపు నీ నామము నా కబ్బుటె చాలు
దొరయైన జాలు కడుతుచ్ఛపు బంటైన చాలు
కరిగి నిన్ను దలచ గలిగితే చాలు - అని చెప్పుకొన్నాడు.

వాగ్గేయకారులందరూ కలియుగంలో హరినామ స్మరణ చాలా గొప్పదని, సూక్ష్మంలో మోక్షం చూపగలిగే ప్రభావం దానికున్నదని విపులీకరించి యున్నారు. నామస్మరణ వల్ల కలిగే లాభాలను పట్టికగా కట్టి తరువాతి తరాల వారికి చూపించిన వారే.

తిరుమంగై ఆళ్వార్ (పెరియ తిరుమొళి 1-9)

కులం తరుమ్ శెల్వమ్ తన్దిడుమ్
అడియార్ పడుతుయ రాయిన వెల్లాం
నిలన్ తరన్ సెయ్యుమ్ నీళ్ విశుమ్బరుళుమ్
అరుళొడు పెరు నిల మళిక్కుమ్
వలమ్ తరుమ్ మట్రుం తన్దిడుమ్
పెత్తా తాయిన మాయిన చెయ్యుం
నలమ్ తరుమ్ చొల్లై నాన్ కండుకొండేన్
నారాయణా వెన్నుమ్ నామమ్

"నారాయణా" అనే నామం పెక్కులాభాలను కలుగజేస్తుంది. ఒక మహత్తరమయిన కులాన్నిస్తుంది. అదే భాగవతుల కులం. సంపదల నిస్తుంది. దాసుల దుఃఖాలన్నిటినీ నేల మట్టం చేస్తుంది. వైకుంఠ పదవినిస్తుంది. సేవా భాగ్యాన్ని కలుగజేస్తుంది. ఇంతటి మహదానందాన్నిచ్చే 'నారాయణా' అనే నామాన్ని నేను కనుగొన్నాను" అని పరవశం చెందాడు తిరుమంగై ఆళ్వారు.

అన్నమయ్య తన సంకీర్తనలో **'వేంకటేశు'** నామవైశిష్ట్యాన్ని ఎలా పేర్కొన్నాడో పరిశీలించండి.

ముఖారి : (సంపు. 1-158)

అకటివేళల నలపైన వేళలను
తేకువ హరి నామమే దిక్కు మరిలేదు ॥ ***పల్లవి*** ॥

కొరమాలి ఉన్నవేళ కులము చెడిన వేళ
చెరవడి వొరులచే జిక్కినవేళ
వొరపైన హరినామ మొకటే గతిగాక
వేంకటేశు నామమే విడిపించ గతిగాక ॥ ***అకటి*** ॥

వాగ్గేయకారులందరు తమ తమ జీవితాలలో అనేక కష్టాలనుభవిస్తున్నా, భగవంతుని శతవిధాల కీర్తిస్తూ, తమ జన్మమే వ్యర్థమైపోయిందని చింతిస్తూ శ్రీమన్నారాయణుని నామోచ్చారణ చేసే భాగ్యం చాలా ఆలస్యంగా లభించిందని వాపోతుంటారు.

ఇంతే కాక, తిరుమంగై ఆళ్వార్ ఆండాళ్ మొదలయినవారు తెలిపిన నాయకీ నాయక భావం అన్నమయ్యలోను కోకొల్లలుగా కనబడుతుంది. 'పురుషోత్తముడు' నారాయణు డొక్కడే అని ఆళ్వారులు అన్నమయ్య సుస్పష్టంగా తెలియజేశారు.

ఈ విధంగా పరిశీలిస్తూపోతే ఆళ్వారుల ప్రభావం అన్నమయ్య మీద ఎంతో బలంగా హత్తుకుపోయిందన్న విషయం తేటతెల్లమవుతుంది.

***

అన్నమాచార్య - సూఫీ కవులు

జి.బి. శంకరరావు
శాంతా బయోటెక్నిక్స్

" ఏకం సత్ విప్రా బహుధా వదంతి "

భగవత్ సామ్రాజ్యమైన ఈ విశాల విశ్వావరణంలో ఉన్న సత్యమొక్కటే! భగవంతుడూ ఒక్కడే ! అంతటా వ్యాపించియున్న చైతన్యమొక్కటే ! భౌతిక శాస్త్ర నియమాలలో శక్తిని అనేక రూపాల్లో చూడవచ్చు. కాని ఆధారభూతమైన, మౌలికమైన (మూల) శక్తి నుండే మిగిలిన రూపాలన్నీ ఉద్భవిస్తాయి. ఆ మూల శక్తియే ఏకేశ్వరుడైన భగవంతుడు.

"బ్రహ్మమొక్కటే - పరబ్రహ్మమొక్కటే"

ఇదే అన్నమయ్య సిద్ధాంతం! పరబ్రహ్మ తత్త్వాన్ని శ్రీవేంకటేశ్వరునితో దర్శించి తరించిన మహనీయుడు అన్నమాచార్య.

అన్నమయ్య తత్త్వాన్ని సూఫీ తత్త్వంతో సంక్షిప్తంగా తులనాత్మక అధ్యయనం చేయటం ఈ పత్ర ఉద్దేశం! సూఫీ మూలసారాన్ని తెలియజేస్తూ, జహన్నీయన్ శాఖకు చెందిన సూఫీ యోగులు హజ్రత్ సాయి కుతాబ్ అలీషా, హజ్రత్ సాయి రోషన్ అలీ షా, హజ్రత్ సాయి హాదీబక్షల రచనలలో ఉన్న సారాన్ని అన్నమయ్య రచనల సారాన్ని పరిమిత పరిధిలో ఇందులో తులనం చేయడం జరుగుతుంది.

మతాలు మార్గాలు వేరైనా చరమ లక్ష్యం, గమ్యం ఒక్కటే! అదే పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొని, అందు లీనమవ్వడం! హైందవమైనా, క్రైస్తవమైనా, మహ్మదీయమైనా, మరే మతమైనా ఈ పరమార్థ సూత్రానికి కట్టుబడుతున్నాయి, కట్టుబడతాయి. పవిత్ర ఇస్లాం మతం నుండి 'ధ్యాన' మరియు 'దైవిక ప్రేమ' భావనతో ఆవిర్భవించినదే 'సూఫీ సిద్ధాంతం' మరియు 'సూఫీ తత్త్వం'

సూఫీ :

'సూఫీ' అనుపదం అరబిక్ భాషా జన్యం! ఈ పదానికి 'కంబళి బట్ట' అని ఒక అర్థం. ప్రాచీన కాలంలో సూఫీ తత్త్వవేత్తలు భౌతిక సౌఖ్యాలకు లోనుకాక, నిరాడంబరమైన కంబళిబట్టలు ధరించుట చేత ఈ మతానికి 'సూఫీ' అని పేరొచ్చిందని అంటారు. అంతే కాక తాత్త్వికార్థంలో 'సూఫీ' అనగా పవిత్రతకు, స్వేచ్ఛకు (భౌతికబంధాల నుండి) సంకేతం! సూఫీ యోగి అంతర్దృష్టితో ధ్యాన తత్పరుడై సత్యాన్వేషకుడై ఉంటాడని సూఫీ సిద్ధాంతం తెలియజేస్తుంది.

సూఫీ ఆరంభకాలం మరియు పరివ్యాప్తి :

'సూఫీ' ఆరంభ కాలం క్రీ.శ. 9వ శతాబ్దమని కొంతమంది తెలియజేస్తుండగా, మరికొంతమంది క్రీ.శ. 620-1100 మధ్య కాలంలో ఉద్భవించినదని తెలియజేస్తున్నారు. అరబ్బుషేకుల ద్వారా వ్యాప్తమైనదని పరిశోధన గ్రంథాలు తెలియజేస్తున్నాయి. క్రీ.శ. 1200-1500 మధ్యకాలాన్ని 'సూఫీ స్వర్ణయుగం' గా పేర్కొంటారు. ఈ కాలంలో సూఫీ తత్త్వం ఎక్కువ ప్రచారమై ఆదరణ పొందినది. ఇక అన్నమయ్య కాలాన్ని (1408-1503) 'సంకీర్తన స్వర్ణయుగం' గా మనం భావిస్తాం.

సూఫీ - మధురభక్తి

భారతీయ వాఙ్మయంలో 'మధురభక్తి'ని తొట్టతొలుతగా 'కృష్ణావతారం'లో దర్శిస్తాం! పరమాత్ముడైన శ్రీకృష్ణుని పతిగా తలచి, జీవాత్మలైన గోపికలు అతడిని విడిచి మనలేక, తమ మాన, ప్రాణములను అర్పించి కృష్ణుని సాన్నిధ్యాన్ని పొందుతారు. అందువల్ల ఇది మధుర భక్తియని పిలువబడినది. పవిత్ర ఖురాన్‌లో భగవంతుడు ఇలా పేర్కొంటాడు. "నేను మానవుని సృజియించి, ఆతని శ్వాసలో నా చైతన్యాన్ని నింపాను." ఇక్కడ చైతన్యమనగా జీవాత్మ! అది పరమాత్మ అనగా భగవంతుని నుండి ఉద్భవించినది. మరల అది చివరకు భగవంతునినే చేరవలసినది. అందువల్ల ఇక్కడ భగవంతుడు పరమాత్మ కాగా, భక్తుడు (జీవి) జీవాత్మ. ఈ రెండింటి అనుసంధానం జరిగేది భక్తితో! అదీ మధురమైన భావనతో! 'సూఫీ'లో నిగూఢమై ఉన్న సత్యమిదే! దీనిని 'సూఫీ' యోగులు 'ఇష్క్ హక్కికీ' అంటారు. భారతీయ భక్తి సంప్రదాయంలో జయదేవుడు, మీరాబాయి, అన్నమాచార్య, తులసీదాసు, చైతన్యమహాప్రభు, క్షేత్రయ్య ఈ కోవకు చెందినవారే!

ఇస్లాం నుండి ఆవిర్భవించి ప్రపంచ వ్యాప్తంగా పరివ్యాప్తమైన 'సూఫీ' తత్త్వం కేవలం ఒక మతం కాదు. అది మత పరిధులను దాటి విశ్వ చైతన్యాన్ని, భగవత్తత్త్వాన్ని నింపుకున్న విశాల మధుర భక్తి సిద్ధాంతంగా సూఫీ కవులు వర్ణిస్తారు. మూల సూఫీ సిద్ధాంతం పరివ్యాప్తమవుతున్న దశలో ప్రపంచంలోని ఇతర మతాలలోని కొన్ని అంశాలను తనలో విలీనం చేసుకొని ఆయా దేశాలలో వర్ధిల్లినది.

సూఫీ కవులు :

'సూఫీ' ఆవిర్భవించిన కాలం నుండి అనేక మంది యోగులు, కవులు ప్రపంచ వ్యాప్తంగా అవతరించి 'సూఫీ'ని ప్రచారం చేశారు. అల్ హల్లాజ్ (ఇరాక్), రబియా బస్రీ, జునైద్, ఇబ్రహీం ఏదీం, హసన్ బస్రీ, అల్ గజాల్లీ (సిరియా), అబ్దుల్ ఖాదీర్, జిలానీ (ఇరాక్), జలాలుద్దీన్ రూమీ, (ఇరాక్), సుహార్ వార్దీ (ఆసియా మైనర్) మున్నగు సూఫీ యోగులు వివిధ దేశాలకు చెందినవారు.

భారతదేశం (అవిభక్త పాకిస్తాన్)లో సూఫీ తత్త్వం సుమారుగా 12వ శతాబ్దంలో ఆరంభమైనదని చెప్పవచ్చు. క్రీ.శ. 1173-1265ల మధ్య కాలంలో జీవించిన షేక్ ఫరీదుద్దీన్ మధురభక్తితో గానం చేసి సూఫీ తత్త్వాన్ని ప్రచారం చేశాడు. ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీ, షా హుస్సేన్ (1538-1599), సుల్తాన్ బాహు (1629-1691), సయ్యద్ బుల్‌షా (1680-1758), సయ్యద్ అలీ హైదర్ (1690-1785), ఫర్ద్ ఫకీర్ (1729-1790), హసీం షా (1735-1843), సయ్యద్ గులాం జిలానీ (1749-1819), మౌల్వీ గులామ్ రసూల్ (1813-1874), సయ్యద్ మీరాన్ షా (1830-1913) వంటి వారు ప్రముఖ భారతీయ సూఫీ యోగులు. సయ్యద్ కరమ్ ఆలీషా అను సూఫీ కవి విశేషించి సూఫీ తత్త్వంలో లాలి పాటలు కూడా వ్రాశాడు.

ఆధునిక భారతీయ సూఫీ యోగుల (19-20 శతాబ్దాలు) విషయానికొస్తే, జహనీయన్ శాఖకు చెందిన ఖలందర్ హజ్రత్ సాయి ఖుతాబ్ ఆలీషా, హజ్రత్ సాయి రోషన్, అలీషా, హజ్రత్ సాయి హదీబక్ష్, భాయి గోవిందరామ్ సింగ్, డా. సాయి రోచల్‌దాస్‌లు ముఖ్యులు. వీరి సూఫీ కవిత్వం ఆధారంగానే ఈ పత్రం సంక్షిప్త తులనాత్మక అధ్యయనం గావించబడుతున్నది.

సూఫీ ఖలందర్ హ(జత్ సాయి కుతాబ్ ఆలీ షా :

జహనీయన్ శాఖలో పూర్ణ సద్గురువుగా, తరువాతి సూఫీ కవులకు ఆరాధ్య గురువుగా మార్గదర్శకుడుగా సాయి కుతాబ్ ఆలీషా గుర్తింపబడుతున్నాడు. హిందూ తత్త్వంలో వలెనే సూఫీ తత్త్వంలో కూడా గురువుకు విశిష్టమైన ప్రాధాన్యత కలదు. అన్నమాచార్యుల వారు విశిష్టాద్వైత సిద్ధాంతకర్త రామానుజుల వారిని గురువుగా స్వీకరించి, ఆ తత్త్వాన్ని ఆచరించి ఇలా గానం చేశారు.

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యీతఁడే చూపె ఘన గురు దైవము. - అన్నమయ్య భగవన్నామ సంకీర్తన విశిష్టతను అనేక సంకీర్తనల్లో తెలియజేశాడు.

హరినామము కడు నానందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా
నలినాక్షుని శ్రీ నామము
కలిదోష హరము కైవల్యము
ఫలసారము బహు బంధమోచనము
తలఁచవో తలఁచవో తలఁచవో మనసా...

నగధరు నామము నరక హరణము
జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా.....

ఇక కుతాబ్ అలీ షా రచన చూద్దాం! సింధ్ భాషలోని సూఫీ రచనకు శ్రీ ఎస్.ఎల్. గజ్వానీ గారి ఆంగ్ల అనువాదం.

Life without *nam* has been a waste,
I fail to make it purposeful,
Ego has overpowered me.
kindly bestow grace on Qutab, O Master,
Let not a breath be lost without *nam*,

అన్నమాచార్యుల వారు వైష్ణవ మత ప్రచార నిమిత్తమై కొంతకాలం రాజాశ్రయంలో ఉన్నారు. కాని రాజ ప్రలోభాలకు లొంగక 'హరినామాన్నే' నమ్మి సంకెళ్ళను సైతం ఛేదించుకుని రాజుకు జ్ఞానోదయం కలిగించిన భక్తాగ్రగణ్యుడు ఈ మహనీయుడు.

సాయి కుతాబ్ అలీషా కూడా భగవంతుని పై అపార నమ్మకంతో రాజులు, నవాబులు అందించిన కానుకలను తిరస్కరించాడు. అన్నమయ్య **'నానాటి బదుకు నాటకము / కానక కన్నది కైవల్యము'** – అంటూ జీవితమనే నాటకంలో మనం పాత్రధారులము. ఇక్కడ మన పాత్రలు అశాశ్వతము! కాబట్టి శాశ్వత తత్త్వమైన భగవంతుడిని తెలుసుకోండని ఉద్బోధించాడు. కుతాబ్ షా తన సిద్ధాంతంలో చరమ లక్ష్యం సత్య స్వరూపుడైన భగవంతుడేనని, దానిని సూఫీ మధురభక్తితో సాధించవచ్చునని తెలియజేశాడు. సమాధి స్థితి, తుర్యావస్థలను అంగీకరించాడు. ఆత్మను జాగృతం చేయడం ఆధ్యాత్మిక సాధనలో ముఖ్యమైనది. యోగులందరూ ఈ విషయంలో ఎన్నో ఉద్బోధలు చేశారు.

'లెండో లెండో మాటాలించరో మీరు
కొండలరాయని పేర్కొన్నదిదే జాలి' – అని అన్నమాచార్యుల వారు గానం చేస్తే, కుతాబ్‌షా ఇలా గానం చేస్తున్నారు

"Arise, O the sleeping one,
They who sleep gain nothing
you peeped not within,
Nor tried to please the Lord.
you did not remember,
Our stay here is temporary..."

విశ్వమాయను అన్నమయ్య, కుతాబ్ అలీ షా ఇద్దరూ అంగీకరించారు. అన్నమయ్య

"ముంచిన జగమిది మోహినీ గజము
పొంచిన యాస పుట్టించే దిది
వంచనల నిజము వలెనే వుండును
మంచులు మాయలే మరునాఁడు" – అని అంటే కుతాబ్ షా ఇలా అంటున్నాడు.

"The world is a false play,
The seekers are not pleased with that
Life is ephemeral,
Remember Lord in every breath.
without the Beloved, the world is a misery,

మాయను అంగీకరిస్తూనే అది తొలగే మార్గాలను కూడా ఈ యోగులు తెలియజేశారు.

హజ్రత్ సాయి రోషన్ అలీ షా :

సాయి కుతాబ్ అలీ షా కుమారుడైన సాయి రోషన్ అలీషా తండ్రి మార్గాన్ని అనుసరించి సూఫీ యోగి అయ్యాడు. అన్నమయ్య కుమారుడు పెద తిరుమలయ్య అన్నమయ్య మార్గాన్ని అనుసరించినట్లు మనందరకూ తెలిసిన విషయమే!

సత్సంగం : అన్నమయ్య 'సహజ వైష్ణవాచార వర్తనుల సహవాసమే మా సంధ్య' అంటూ వైష్ణవాచార వర్తనుల సాన్నిహిత్యాన్ని కోరుకున్నాడు. సాయి రోషన్ అలీ షా కూడా యోగుల సత్సంగాన్ని కోరుకున్నాడు.

Nectar is offered in the company of saints,
Surrender your mind at their feet,

వైష్ణవంలో 'శరణాగతి' (*surrender*) అతి ముఖ్యమైనది. రోషన్ అలీ షా 'శరణాగతి' ని నమ్మాడు.

Pleasant are the paths
In the country of the beloved
kindly protect me, O Lord,
I may reach the beloved.

యోగి లక్షణాలు :

"వాసి వంతు విడిచిన వాడే యోగి యీ
ఆసలెల్ల విడిచిన అతడే యోగి "

అని అన్నమయ్య అంటే రోషన్ అలీ షా 'యోగి' గురించి ఇలా గానం చేస్తున్నాడు.

If you wish to be a Yogi,
Bind your heart to the guru.....

ధ్యానం : 'నిచ్చలు సుఖమియ్య నీ ధ్యానమే చాలు' అని కదా అన్నమయ్య భావన! సూఫీ యోగులు ధ్యానాన్ని అమితంగా ఆచరించేవారు.

హజ్రత్ సాయి హదీ బక్ష్: హజ్రత్ సాయి హదీ బక్ష్ సాయి రోషన్ అలీ షా కుమారుడు. తండ్రి తత్త్వ వార సత్వాన్ని అందుకున్నాడు. పెద తిరుమలయ్య కుమారుడు చిన తిరుమలయ్య తన తండ్రి, తాతల సంకీర్తన మార్గాన్ని తాను అనుసరించినట్లు, సాయి హదీ బక్ష్ కూడా తాత, తండ్రుల తత్త్వాన్ని జీర్ణం చేసుకుని సూఫీ ప్రచారాన్ని విస్తృతం చేశాడు.

నిరాడంబరత : యోగులు నిరాడంబర జీవనం సాగించడమే కాక, ఆ మార్గంలో ఉన్న వారందరికీ దానిని బోధించారు. వైష్ణవుడైన అన్నమయ్య అసలు సిసలు వైష్ణవుడు ఇలా ఉంటాడని తెలియజేస్తున్నాడు.

మదమత్సరము లేక మనసు పేదైపో
పదరిన యాసల వాఁడు వో వైష్ణవుఁడు

నిజమైన 'సూఫీ' సాధకుని లక్షణాలను హదీబక్ష్ ఇలా తెలియజేస్తున్నాడు.

He is called a Sufi
Who speaks not in anger....

కృష్ణగానం : అన్నమయ్య నాయిక అనేక కీర్తనల్లో విశ్వ మోహనుడైన మురళీధరుని కోసం విరహిణియై గానం చేస్తుంది. మానస చోరుడైన ఆ వేణుగోపాలుని కోసం –

వలచి వచ్చితి నేను వానికి cగాను
నెలవై మీ గొల్లవాడనే తానుండునంటా ...

అంటూ కృష్ణుని వర్ణిస్తూ వాడవాడలా గాలిస్తుంది. సాయి హదీ బక్ష్ కూడా సమ్మోహనుడైన కృష్ణుడు తన మదిని కొల్లగొట్టాడని మధురభక్తితో గానం చేసిన దృశ్యాన్ని ఈ పాటలో వీక్షిద్దాం!

By the music of His flute,
He has captured my heart
with the locks of hair a flutter,
Sweet divine words.
Moving lips with graceful smiles,
He has captured my heart.

యోగత్వ సిద్ధిని సాధించిన భక్తుడు కేవలం భగవంతుడినే ఆశ్రయిస్తాడు. భగవత్ సాన్నిధ్యాన్ని కోరుకుంటాడు. అన్నమయ్య అందుకే –

"ఇహమే కాని యిక పరమే కాని
బహుళమై హరి నీపై భక్తే చాలు
యెందు జనించిననేమి యెచ్చోటనున్న నేమి
కందువ నీ దాస్యము కలిగితే చాలు
అంది స్వర్గమే కాని అల నరకమే కాని
అందపు నీ నామము నా కబ్బుటే చాలు....

అని ఆనందపడతాడు. ఇంచు మించు ఇదే భావం ఒక సూఫీ గీతంలో –

See my broken state,
kindly grant me love,
Delay not a moment, my Lord,
Bestow anguish upon me
I desire not heaven,
Nor am afraid of hell,
I want nothing but your ***nam*** only.

(Translation by S.L.Gajwani)

జహనీయన్ శాఖకు చెందిన ఈసూఫీ యోగులు వర్తమాన ప్రపంచానికి అంతగా తెలియదు. కాని వారి తత్త్వం విశిష్టమైనది. ఆ విశిష్టతను రేఖామాత్రంగా చూపిన ప్రయత్నమే ఈ పత్ర సారాంశం.

***

అన్నమయ్య - జయదేవుడు

డా. ఆకెళ్ళ విభీషణ శర్మ
తి.తి.దే. తిరుపతి

శ్రీ వేంకటేశ్వరస్వామి పై అనన్య భక్తితో 32వేల పద పుష్పాలతో శ్రీవారి సమారాధనలో తరించిన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులకు, రాధానాథుడైన శ్రీ కృష్ణస్వామిపై అమలిన భక్తితో 24 అష్టపదులను రచించిన జయదేవునికి ఎన్నో సామ్యాలు గోచరిస్తాయి.

శతాబ్దాలకాలం మధ్యలో తెరలుపడుతున్నా, వారి జీవితాలను - లభిస్తున్న విశేషాంశాలతో వింగడించుకొంటే - ప్రాయికంగా అటు జీవనంలో, ఇటు రచనా దృక్పథంలో, రచనలలో - సమానధర్మాలు ఎన్నో స్పష్టమవుతాయి. సంస్కృత సాహిత్యంలో నిర్దిష్టమైన రాగతాళాలతో, సంగీతసుమానికి సాహిత్య పరీమళాన్ని అందించిన ఘనుడు జయదేవుడు. తెలుగులో పదకవితకు ఆద్యుడు, ఆరాధ్యుడు, అనవద్యుడైన అన్నమయ్య సంగీత సాహిత్యాలకు దేశిగేయ కవిత్వాల్లో ఆదరాన్ని కలిగించిన ఘనుడు.

జయదేవుని జీవితవిశేషాలను తెలుసుకోవడానికి, చంద్రదత్త విరచితమైన భక్తమాల, వనమాలదాసు విరచిత జయదేవచరితం, సేకశుభోదయం, జయదేవుని అష్టపదులనూ, ఆ కాలం నాటి శాసనాలనూ, ఆకరాలుగా గ్రహించ వచ్చును. అన్నమయ్య జీవిత విషయాలకై - తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన అన్నమాచార్యచరిత్ర, అన్నమయ్య కాలం నాటి శాసనాలు, తాళ్ళపాక వంశీయుల సంకీర్తనలు ఆధారమవుతున్నాయి.

అన్నమయ్య తల్లి లక్కమాంబ, తండ్రి నారాయణసూరి - వీరి నివాసం కడప జిల్లా రాజంపేట మండలంలోని తాళ్లపాక. జయదేవుని తల్లి రమాదేవి. తండ్రి భోజదేవుడు.

వీరు ప్రధానంగా ఒరిస్సా రాష్ట్రంలోని జగనాథ క్షేత్రానికి దగ్గిరలోని "బిందుబిల్వ" ప్రాంతంవారని అత్యధికుల అభిప్రాయం. జయదేవుని కాలం 1090 - 1153, అన్నమయ్యది 1408 - 1503. అయితే వీరిరువురి జన్మ సంవత్సర విషయంలో వివాదమున్నా, కైవల్య ప్రాప్తి విషయంలో సందేహాలు లేకపోవడం ఒక సామ్యం.

ఈ మహానుభావులిద్దరూ ఆనుకూల్య దాంపత్యాన్ని గడిపిన వారనడంలో సందేహం లేదు. 'పద్మావతీచరణ చారణ చక్రవర్తి' గా చెప్పుకొన్న జయదేవుడు - తిమ్మక్క అక్కాంబలతో సంసారం నెరపిన అన్నమయ్య, సహధర్మచారిణిలతో అన్యోన్యంగా జీవించిన గృహస్థులే. కనుకనే శృంగార సంకీర్తనలు రసవత్తరంగా రచించగలిగారు. (ఈ సందర్భంలో ఆదరీశంకరులు 'అమరకవి' శరీరాన్ని ఆశ్రయించిన విషయం స్మరిస్తే, స్వానుభవం లేకపోతే శృంగారరస తత్త్వం వంటబట్టదని స్పష్టమవుతుంది).

జయదేవ అన్నమయ్యలకున్న రాజాశ్రయం జారుముడివంటిది. జయదేవునికి ఆశ్రయించినవాడు వంగదేశీయుడైన లక్ష్మణసేనుడు. అన్నమయ్య ఆశ్రయం కోరినవాడు సాళువ నరసింహరాయులు. జయదేవునిలాగ తాను 'గీత గోవిందం' వ్రాసి పరాభవం పొందినవాడు లక్ష్మణసేనుడు. తనమీద పాటపాడమనికోరి భంగపడినవాడు పెనుగొండ ప్రభువు. ఇరువురిలోను పశ్చాత్తాపం కలగడం, తదనంతర కాలంలో భక్తి శ్రద్ధలతో కవులను ఆదరించడం ఒక విశిష్ట సామ్యంగా చెప్పవుచ్చు.

జయదేవకవి ఇతర రచనలుగా చెప్పబడేవి - చంద్రాలోకం, రతిమంజరి, కారకవాదం, తత్త్వ చింతామణి, అన్నమయ్యవి - శృంగారమంజరి, వేంకటేశ్వరశతకం లభిస్తున్నా, లభించనవి 11 శతకాలు, ద్విపద రామాయణం, వేంకటాచల మహాత్యం (సంస్కృతం) సంకీర్తన లక్షణం (సంస్కృతం) - ఈ ఇతర రచనలు ఇరువురి రచనలకు ముడిసరుకు వంటిదనడంలో సందేహంలేదు.

జయదేవుడి కీర్తనలు పూరీలోని జగన్నాథస్వామివారి ఆలయంలో ప్రతిరోజూ కనీసం రెండు అష్టపదులను గానం చేస్తారు. ఇక అన్నమయ్య "తిరుమల ఆలయకవి". సుప్రభాతం సేవ నుండి అన్ని సేవలపై అన్నమయ్య కీర్తనలు రచించాడు. తిరుమలేశుని సేవలలో ప్రతిధ్వనించే ప్రతి అన్నమయ్య కీర్తన, అమృత మాధుర్యంతో శ్రీవారి మనసు పరవశింపజేస్తుంది.

నేటికీ 'కెందుబిల్వం'లో జయదేవ ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అదే విధంగా అన్నమయ్య ఆరాధనోత్సవాలు, తిరుమలలో, తాళ్ళపాకలో వైభవంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్నది.

గీత గోవిందం ఎన్నో అష్టపదులకు పునాదిరాయి అయ్యింది. రామకవి రామాష్టపదులకు, వేంకటమఖి త్యాగరాజేశ్వరాష్టపదులకు, చంద్రశేఖర సరస్వతి శివాష్టపదులకు ఎంతో ప్రసిద్ధి ఉన్నది. తరువాత కాలంలో స్కంద అష్టపది, గీతాసుందరం లాంటి ప్రబంధాలు వెలువడ్డాయి. కళువె వీరరాజు సంగీత గంగాధరం రచించి గీతగోవింద స్ఫూర్తిని కలిగించారు. ఇక ద్రావిడాగమ సార్వభౌముని మార్గంలో తాళ్ళపాక కవులు 2 శతాబ్దాలకు పైగా సారస్వత యజ్ఞాన్ని కొనసాగించారు. నేడు 13వ తరం వారు శ్రీవారి సేవలో తరిస్తున్నారు. అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనల ప్రభావం 'త్యాగయ్య' పై శృంగార సంకీర్తనల ప్రభావం 'క్షేత్రయ్య' పై ఇక క్షేత్ర అనురక్తి తత్పరత ప్రభావం రామదాసుపై స్పష్టంగా కనిపించడాన్ని పూర్వ పరిశోధకులెందరో సోదాహరణంగా వివరించారు. అలాగే తెలంగణా తిరునామకవులపై తాళ్ళపాక కవుల ప్రభావం కంఠదఘ్నం ఉన్నది. జయదేవుని ఖచ్చితమైన రచనా ప్రణాళికలో 24 అష్టపదులు, 72కు పైగా శ్లోకాలలో, 12 సర్గల గేయ ప్రబంధంగా రెండురోజుల రాధాకృష్ణుల విరహ, విహారాదులను అభివర్ణిస్తున్నాయి. ముందుగా శ్లోకాలలో ప్రోదుచేసిన భావాలనే అష్టపదులలో విస్తారంగా వర్ణించడం జరిగింది. అన్నమయ్య కూడా 12 శతకాలు చెప్పినట్లు తెలుస్తున్నది. అందులో 'అలమేలుమంగా శతకం'లోని భావాలన్నీ శృంగార సంకీర్తనలలో విస్తారంగా కనిపిస్తున్నాయి. కనుక అలభ్యశతకాలలోని అంశాలు, అన్నమయ్య-శృంగార, యోగ, ఆధ్యాత్మ కీర్తనలలో విశాల స్వరూపాన్ని పొంది ఉండవచ్చనడం సాహసం కాదు.

జయదేవుడు గేయ ఛందస్సులో కావ్యం వ్రాసి- సంస్కృత సారస్వతంలో గొప్ప ప్రయోగం చేస్తే, అన్నమయ్య దేశి కవితా ఫణితిలో పదకవితకు పట్టాభిషేకం చేసిన పదకవితా పితామహుడు.

జయదేవుని గీతాగోవిందం ప్రధానంగా రాధామాధవ భక్తి శాఖకు వెలసిన సుధాకళిక. గీతగోవిందంలోని మధురభక్తి తత్త్వాన్ని ఆకళింపు చేసుకొన్న అన్నమయ్య ఆ భక్తి తత్త్వాన్నే

కాకుండా హనుమత్సంప్రదాయాన్ని, వితల సంప్రదాయాలని గోరఖ్ సంప్రదాయాలను కూడా ఆదరించాడు. ద్రావిడ వైష్ణవానికి అభిన్నంగా "రాధామాధవభక్తి" ని, పసిడితునకల వంటి పదబంధాలతో సంకీర్తనలు చేసిన శ్రీవైష్ణవాచార్యుడు. విశేషించి సంస్కృతంలో వ్రాసిన (1) అతిశోభితేయం రాధా, (2) రాధామాధవ రతిచరితమితి, (3) అహోసురతవిహారోయం, (4) జానామ్యహం, (5) హరిరసమవిహారీ వంటివి పూర్తిగా జయదేవకవి ప్రభావంతో రచింపబడినవే.

జయదేవ సరస్వతి రచనలకు స్థూల స్వరూపం ఇలా ఆవిష్కరించబడినది -

యది హరిస్మరణే సరసం మనో
యది విలాస కళాసు కుతూహలం
మధుర కోమలకాంత పదావళీం
శ్రుణుతదా జయదేవ సరస్వతీమ్

ఇక అన్నమయ్య రచనా స్వరూపాన్ని సాక్షాత్కరింపజేస్తూ తాళ్ళపాక చిన తిరుమలాచార్యుడు ఇలా పేర్కొన్నాడు.

పావనములు హరిభకిత వి
భావనములు సర్వమంత్ర పరమరహస్యో
ద్భావములు గాయక నిక
రావములు తాళ్ళపాక యన్నయ పదముల్

ఈ రెండు కవితా స్వరూపాలకు మూలం - హరిస్మరణ, కోమలమైన పదాలతో గాయకులకు ఉపకరించే తత్త్వంతో కూడి ఉండటమే.

జయదేవుని అష్టపదులలో సంగీత, సాహిత్యాలు సమపాళ్ళలో నిలిచి అభినయానికి అనుగుణంగా భాసిల్లుతున్నాయి. అన్నమయ్యలో సంగీతం కన్న, సాహిత్య ప్రాధాన్యత మిన్నయని సంగీత విశారదులు పేర్కొంటున్నారు. అయినా అన్నమయ్య కీర్తనలెన్నో అభినయాత్మకమైనవిగా కూడా శ్లాఘించబడుతున్నాయి. ఉదా: (1) అలరులు కురియగ ఆడెనదే (శృ.సం. 12-24) ఉపచరింపగరాదా (శృ.సం.30-555) సంస్కృతంలో యోగిభోగి నటనంకుర - ఇత్యాదులు.

జయదేవ నామక కవులున్నట్లే, అన్నమయ్య నామక కవులున్నారు. యధావాక్కుల అన్నమయ్య ఇత్యాదులు. కారణం ఇద్దరూ కారణజన్ములే - వ్యాసుడు భాగవతరననే తృపర్తిని పూర్తిగా పొందలేదని, తిరిగి జయదేవుడిగా అవతరించాడని కొందరు సంప్రదాయజ్ఞులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక అన్నమయ్య సాక్షాత్తూ శ్రీనివాసుని దివ్య ఖడ్గమైన నందకాంశ సంభూతుడని చిన్నన్న చాటిచెప్పాడు. అంత్య ప్రాసలతో శోభిల్లుతున్న 'గీతగోవిందం' రచన ఇతి వృత్తంలో భక్తి శృంగారాల చెలిమి - ధారలో రాగతాళల కలిమితో పరిపుష్టిమయ్యింది. గీతగోవింద కావ్యంలో ప్రధాన వస్తువు హరిస్మరణ. ఇది ఆధ్యాత్మిక తత్త్వ సౌందర్యంతో కూడా బాగా రంగరించబడినది. ప్రాపంచిక రాగములను, బాధలను విసర్జించి శ్రీకృష్ణస్థితిని పొందినవాడు జయదేవుడు. అవధూతస్థితి పరమత్యాగాన్ని నిర్దేశించడమే కాకుండా రాగాదులను అతిక్రమించిన పరమభూమిక. ఇట్టి స్థితిలో ఏ నియమనిబంధనలు ఉండవు.

"నిస్త్రైగుణ్యే పథి విచరతాం కోవిధః కో నిషేధః" ఈ నిస్త్రైగుణ్య పథములో విది నిషేధములు లేకుండా, రాధికాదేవి విహరించినట్లు గీత గోవిందంలోని పరమభూమిక ప్రభోదిస్తున్నది. ఉదా: (1) విగళిత వసనం, పరిహృతరసనం, (2) ఉరసి మురారేరుపహితహారే, (3) సరసఘనే జఘనే, (4) దోర్భ్యాంసంయమితః (5) వామాంకే రతికేళి సంకుల సమారంభే - ఈ విధమైన సంభోగ శృంగార కీర్తనలలో అవధులుదాటిన రతి పారవశ్యం గోచరిస్తుంది. అదే విధంగా అన్నమయ్య కీర్తనలలో కేవలం అమేలుమంగే కాక, ఇంకా పరకీయలు, భోగకాంతలు, చెంచెతలు బోయస్త్రీలు, నాయికలై శ్రీనివాసునితో శృంగార స్వభావంతో దర్శనమిస్తున్నారు. ఇక్కడ అంతరార్థం - నాయికా స్వభావం ఎటువంటిదైనా - ఆమె పరమేశ్వరాధనకు ఆత్మార్పణకు అర్హురాలనే దృష్టితోనే అన్నమాచార్యులీ విధమైన మార్గం అవలంభించి సూక్ష్మమైన వాస్తవిక దృష్టితో ఆయా నాయికా చిత్రణకు ఉపక్రమించాడని భావించాలి. అందుకే రసగంగాధర కర్త జగన్నాథరాయలు -

"జయదేవాదిభిస్తు గీతగోవిందాది ప్రబంధేషు సకల సహృదయ సమ్మతోయం సమయః; మదోన్మత్త మతంగజైరివ భిన్నః ఇతి న తన్నిదర్శనేన ఇదానీంతనేన తథా వర్ణయితుం సాంప్రతమ్" అని స్పష్టంగా మదించిన ఏనుగులకు శృంఖలాబంధనాలు ఉండనట్లు మహాకవులైన జయదేవాదుల విషయంలో విలక్షణ ప్రతిభను దృష్టిలో ఉంచుకొని వారి స్వతంత్రతకు తలవంచాలన్నాడు.

అదే విధంగా అన్నమయ్య కీర్తనలకు కూడ చిన తిరుమలాచార్యుడు ఔచిత్యాన్ని ఆపాదిస్తూ -

వైరాగ్య వృద్ధికర గం
భీర పద(శేణి పొసగఁబెనుపుచు న(గా
మ్యారమ్య విష్ణు చరితో
దారములై యున్నఁ జాలుధరణినెల్వయున్ " - (సం. ల. 60)

ఆధ్యాత్మిక కీర్తనలలో గ్రామ్యోక్తులు లేశమైనా, అన్నమయ్య శృంగార పదాలలో వాటికున్న మర్యాదను తెలియజేశాడు. అన్నమయ్య జయదేవుల రచనా శైలిలో సాదృస్యాలను స్థూలంగా చూచినా స్ఫుటంగా గోచరిస్తాయి. ఉదాహరణకు కొన్ని అంశాలను పరిశీలిద్దాం -

రాధామాధవ రతిచరితం :

అన్నమయ్య కీర్తనలలో అతిపెద్ద నిడివికల కీర్తన "రాధామాధవ రతిచరితమితి" అన్నది. ఇది సంభోగ శృంగార కీర్తన. చాలా స్పష్టంగా ఈ కీర్తనలో జయదేవ సరస్వతి రచించిన ఈ క్రింది శ్లోకంలోని భావ సామ్యత గోచరిస్తున్నది.

మేఘైర్మేదుర మంబరం వనభువ శ్యామాస్తమాలద్రుమైః
నక్తం భీరురయం త్వమేవ తదిమం రాధే! గృహం ప్రాపయ !
ఇత్థం నందనిదేశతశ్చలితతోః ప్రత్యధ్వకుంజద్రుమం
రాధామాధవ యోర్జయంతి యమునాకూలే రహః కేళయః (గీత గోవిందం 1-1)

ఈ శ్లోకంలోని భావానికి 'రాధామాధవ' అన్న కీర్తనలో -

గహనే ద్వా వపి గత్వాగత్వా
రహసి రతిం ప్రేరయతి సతి
విహరత స్తదా విలసం తౌ
విహత గృహాశౌ వివశౌ తౌ

పల్లవిలో రాధామాధవుల "రతికథ" అధికజ్ఞానావహమని, శ్రవణభూషణమని అన్నమయ్య పేర్కొన్నాడు. ఇక మొదటి చరణంలో -ఏకాంతం రతిని ఉద్దీపింపజేస్తుండగా, వారిరువురూ అడవిలో, లోపలి ప్రదేశానికి చేరుకొన్నారు. ఉల్లాసంతో నిండి, ఇతర చింతలను విడిచి పరవశులై విహరిస్తున్నారు.

"వభువశ్శామాస్తమాలద్రుమైః" - అరణ్య ప్రాంతాలు కానుగచెట్ల చేత మరింత నల్లనివై ఉన్నాయి. ఇక్కడ ఆకాశం మేఘం చేత కప్పబడి ఉండటంవల్ల, చీకటిచేరి మరింత నల్లదనం సంతరించుకొన్నది. ఈ భావాన్ని అంతా అన్నమయ్య 'గహనే' అన్న శబ్దప్రయోగంతో వ్యక్తంచేశాడు.

'ప్రత్యధ్వకుంజద్రుమం' అన్న ప్రయోగం రాధామాధవుల పరిపూర్ణమైన ప్రణయ భావనా స్థితిని సూచిస్తున్నది. అన్నమయ్య ఈ భావస్థితిని స్ఫుటంచేయడానికి 'ద్వావపి గత్వా గత్వా' అని రెండుసార్లు ఒకే శబ్దాన్ని ఉచ్చరించాడు. ఇక రహస్యకేళిని వర్ణిస్తూ జయదేవకవి – "రాధామాధవయోః యమునాకూలే రహః కేళయః జయంతి" అని గానం చేశాడు. అన్నమయ్య ఆ భావనాస్ఫూర్తితోనే –

"రహసి రతిం ప్రేరయతి సతి
విహరతస్తదా విలసంతౌ
విహత గృహేశౌ విపశౌ తౌ " – అన్న రచనను చేసి –

లజ్జా శబల విలాస లీలయా
కజ్జల నయన వికారేణ
హృజ్జావ్యవహిత హృదయారతి
సజ్జా సంభ్రమ చపలాజాతా –

అంటే " రాధ సిగ్గుతో ముడివడిన విలాసముల యొక్క లీలతో, కాటుక వంటి కొత్తదనంతో, హృదయుజ్జుడైన మన్మధునితో ఎడమలేని హృదయంతో రతిసన్నాహ సంభ్రమంలో చంచరితమయ్యింది". ఈ చరణ భావం జయదేవుని 'కజ్జల మలిన విలోచన చుంబన విరచిత నీలిమరూపమ్' అన్న పదసందర్భాన్ని స్ఫురింపజేస్తున్నది. (జయదేవ అ.ప. 17)

విధుముఖ దర్శన విగళ లజ్జా
తధరబింబ ఫల మాస్వా ద్య
మధురోపాయ న మార్గేణ కుచౌ
విధి వర్ధత్వా నిత్య సుఖమితా ఈ చరణమందలి పదబంధం కూడా గీతా గోవిందమందలి పద సౌందర్యాన్ని గుర్తుచేస్తున్నది –

"భవతి విలంబిని విగలిత లజ్జా
విలపతి రోదిత వాసక సజ్జా" అన్న పంక్తులే కాకుండా,

వచన విలాసైర్వశీ కృత్య తం
నిచుల కుంజ మానిత దేశే
ప్రచుర సైకతే పల్లవశయనే
రచిత రతికళా రాగేణాస – ఈ అన్నమయ్య రచనకు పూర్వరూపమా అన్నట్లుగా జయదేవ కవి హరివల్లభాశోక పల్లవము అన్న పేరుతో రచించిన (8వ) అష్టపదిలో –

కుసుమ విశిఖ శరతల్ప మనల్ప, విలాసకలా కమనీయమ్ ।

వ్రతమివ తవ పరిరంభ సుఖాయ, కరోతి కుసుమ శయనీయమ్ ॥

ఇలా కీర్తనలలోని పదబంధ సౌందర్యం – శృంగార విలాస వర్ణన, గీతగోవింద కావ్య ప్రభావంతో అన్నమయ్య రచించినట్లు స్ఫుటమవుతున్నది. జయదేవకవి శబ్ద లాలిత్యం మనస్సులోని రసాత్మలో మాధుర్యాన్ని, తేజస్సునీ నింపుతాయి – ఇక లలిత లవంగలతా పరిశీలన కోమల మలయ సమీరే" వంటి జయదేవ కని పదచిత్రణలను – "లలనా జనాపాంగ లలిత సుమచాప జలజలోచనదేవ సద్గుణ కలాప, తలపులోపల మెలగు తత్త్వ ప్రదీప" వంటి – కీర్తనలలో అన్నమయ్య ప్రోదుచేశాడు.

దశావతార వర్ణనల్లో అన్నమయ్య – జయదేవుడు :

వైదిక వాఙ్మయం దశావతారాల్లోని అవతారాలను ప్రస్తావించింది. ఇక పురాణాల్లో విష్ణు, భాగవత, పాద్మ బ్రహ్మాండాలు విశేషంగా వర్ణించాయటి. ఇక కావ్యాల్లో కిరాతార్జునీయం శిశుపాల వధ, కావ్యాల్లో దశావతార వర్ణన సూచింపబడినది. జయదేవుడు గీతగోవింద కావ్యారంభాన్ని దశావతార స్తుతితో ప్రారంభించాడు.

అంతేకాదు ప్రత్యేకంగా దశావతార కీర్తివ ళాన్ని విలక్షంగా జయదేవుడు రూపొందించాడు. ఉద్దర, నివహ, ఉద్భ్రుత్ర, ధారయ, ఛలయ, క్షయం, జయ, కలయ, కారుణ్య, కుర్వతే, మూర్ఛయ అనే క్రియాపదాల్లో దశాతవతారాల కార్యనిర్వహణా ధర్మాన్ని సూచించాడు.

జయదేవుడు దశాకృతిని దాల్చిన శ్రీకృష్ణ పరమాత్మను సాక్షాత్తు శ్రీహరిగానే భావించాడు. అన్నమయ్య కూడా దశాకృతిని దాల్చిన శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్తూ భగవంతుడైన శ్రీమన్నారాయణునిగా కీర్తించాడు. పైగా "డోలాయాంచల" కీర్తనలో కృష్ణుని అవతారమూర్తిగా కాక పరిపూర్ణమైన శ్రీమన్నారాయణ స్వరూపంగా అన్నమయ్య కీర్తించడం, జయదేవ కవితో భావసామ్యాన్ని సూచిస్తుంది. అన్నమయ్య కూడా అనేక రకాలుగా విన్నూత్న పద్ధతిలో దశావతార కీర్తనలను గానం చేశారు. ఉదా :

1) ఇందరికి అభయమ్ము ఇచ్చు చేయి : ఈ దశావతార కీర్తనలో శ్రీవారి వరదహస్తాన్ని వర్ణిస్తూ దశావతార గాధలను విశ్లేషించడం జరిగింది.

2) ఏమిసేయవచ్చు కర్మ మిచ్చినంతేకాని : ఈ కీర్తనలో పది అవతారాలను వ్యాజంగా చేసుకొని సామాన్యుల బతుకుల్లో వెతలని గుర్తు చేస్తూ, ఇహపర సుఖాలకై వేంకటేశ్వరుని ఆశ్రయించాలని పేర్కొన్నాడు.

3) పదియు పదియుగాదు పరమాత్ముడితనికి : వివిధ ఉత్సవాలలో శ్రీహరి స్వరూపాన్ని అవతారాలతో సమన్వయిస్తూ లక్ష్మీ వల్లభుడిగా ఈ కీర్తనలో కీర్తించాడు.

4) ఎవ్వడోకాని యెరుగరాదు కడు/దవ్వులనేవుండు తలపులో నుండు: ప్రహేళికా రూపంలో ఉన్న ఈ కీర్తనలో దశావతారాలను అందమైన తెలుగుపదాలతోవివరించాడు. ఈ ధోరణిలోనే " తెప్పగామఱ్ఱాకు మీద తేలేటివాడు" అనే మరో సంకీర్తన కూడా చాలా ప్రసిద్ధమైనది.

5) ఇతనికంటే మరి దైవము కానము ఎక్కడ : సర్వాంతర్యామిగా పరమాత్మను వర్ణిస్తూ దశావతార కీర్తనం చేశాడు ఈ కీర్తనలో.

6) తలపు లోపలి తలపు దైవమితడు : తలపులను నిలిచే పరమాత్ముని వర్ణిస్తూ, దశావతార వర్ణనచేశాడు ఈ సంకీర్తనలో.

7) తానెకామాకు దాతయు దైవము : ఈ కీర్తనలో శరణాగత రక్షకుడని తెలుపుతూ దశావతార కీర్తనం చేశాడు.

8) ఏమీ ననకురే యెప్పుడు మీరు - గానుడియై కాలి సన్నంగదలీని బిడ్డడు : వాత్సల్య భావనతో దశావతారాలకు ఉపలక్షకాలుగా ఉన్న మానవసహజాలైన చర్యలను తప్పవట్టవద్దని సుద్దులు చెపిప శ్రీహరిపై తన భక్తిని అన్నమయ్య ప్రకటించాడు.

9) ***అమ్మమ్మ ఏమమ్మ అ లమేల్మంగ నాంచారమ్మ -***
తమ్మియింటలరు కొమ్మ ఓయమ్మ, అనీ
శిరుత నవ్వులవాడు శిన్నెక, వీడు
వెఱపెఱగడుచూడవె శిన్నెక...... అంటూ, మధురభక్తి భావనతో మహోజ్జ్వలంగా శ్రీహరిని కీర్తిస్తూ, అమ్మవారిని కీర్తిస్తూ దశావతారాల సంసూచనం చేసిన కీర్తనలెన్నో ఉన్నాయి.

10) "పుడమినిందరి బట్టె భూతము, కడు
పొడవైన నల్లని భూతము, - అనీ
కొంగు వట్టుకంత నీవు గొల్లబోయీుదా" - వంటి కోలాటం, భజనలతో కూడుకొని బృందంగా పాడే పాటల్లో కూడా దశావతార వర్ణన కల పదబంధాలు దర్శనమిస్తాయి.

ఇలా జయదేవునితో ఆరంభమైన దశావతార వర్ణనావైచిత్రం, అన్నమయ్యతో అనేక విలాసాలను సంతరించుకొని విరాజిల్లుతున్నది. అసలు అన్నమయ్య సంకీర్తనకే

చినతిరుమాలాచార్యుడు, విష్ణువుకు దశావతారాలున్నట్లుగా పది దివ్య లక్షణాలను ఆపాదించి సంకీర్తనం చేశాడు.

మ. శ్రుతులై, శాస్త్రములై, పురాణకథలై, సుజ్ఞాన సారంబులై
యతి లోకాగమ వీధులై, వివిధ మంత్రార్థంబులై, నీతులై
కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళులపాక యన్నయ వచో నూత్న క్రియల్ చెన్నగున్,

(సంకీర్తన లక్షణం - 12)

స్థూలంగా గీత గోవిందంలోని విషయ నిర్మాణం :

సర్గ : 1: అష్టపది (1) దశావతార వర్ణన (2) కృష్ణుని స్వరూప గుణ విభూతుల నిరూపణం, (3) వసంత ఋతువులో కృష్ణునితో గోపికల విరహ వర్ణన - (సఖి అని సంబోధించి చెప్పినట్లుండును) (4) పై అష్టపదిలోని వర్ణనయే ఇందులో కొనసాగుతుంది. అయితే, మూడవ అష్టపదిలో ప్రకృతి వర్ణన ఉండగా ఇందులో వివిధ గోప స్త్రీలతో శ్రీకృష్ణుని చేష్టలు వర్ణించబడినవి.

సర్గ:2 : అష్టపది (1)5 రాధ కృష్ణుని గురించి రకరకాలుగా స్మరించుట. ఈ స్మరణ సఖితో చెప్పినట్లుగా స్ఫురిస్తుంది. (2)6 కృష్ణుని తనకు చేకూర్చమని చెలితో రాధ చెప్పడం.

సర్గ:3: అష్టపది (1) 7 రాధ గురించి కృష్ణుని యనుతాపం

సర్గ:4: అష్టపది (1)8 కృష్ణునితో రాధ విరహం గూర్చి దూతిక చెప్పడం. (2)9 ఇందులో కూడా రాధా విరహవస్థను చెప్పడం

సర్గ: 5: అష్టపది (1)10 రాధతో కృష్ణుని విరహదశను చెప్పడం. (2) 11 రాధను కృష్ణుని దగ్గరకు తొందరగా పొమ్మని చెప్పడం.

సర్గ :6 : అష్టపది (1) 12 కృష్ణునితో దూతి రాధయొక్క ఆశక్తతను చెప్పడం.

సర్గ :7: అష్టపది (1)13 రాధ విరహ విలాపము, (2) 14 కృష్ణుడు రాక పోవడము బట్టి అతను అన్యాసక్తుడని, ఇతర గోపికలతో విహరిస్తున్నాడని రాధ భావించడం, (3) 15 పూర్వ అష్టపదిలోని విషయమే మరింతగా సాగుతుంది. (4) 16 కృష్ణునితో క్రీడించుట- కృష్ణుని విరహమును పొందు నాయికల స్థితిని ఊహించి చెప్పడం.

ఈ సర్గతో రెండవ రోజు మొదలవుతుంది.

సర్గ:8: అష్టపది (1) 17 తన దగ్గరకు వచ్చిన శ్రీకృష్ణుని రాధ ఖండిత నాయికగా అతన్ని నిరసిస్తుంది.

సర్గ :9: అ.ప (1) 18 కలహాంతరిత అయిన రాధకు కోపము వదలమని సఖి హితవచనం చెప్పడం,

సర్గ :10 (1) 19 రాధతో శ్రీకృష్ణుని అనునయ వాక్యాలు.

సర్గ :11 (1)20 కృష్ణుని అనునయ వాక్యాలతో రాధ తేరుకొని, శ్రీకృష్ణుని కలుసుకొన బోవుటకు ముందు ఒక చెలి చెప్పిన మాటలు. (2) 21: రాధ కృష్ణుని సేవించుట.

సర్గ: 12 (1) 23 రాధతో కృష్ణుని మధుర వాక్యాలు; (2) 24:రాధ తనను రకరకాలుగా అంకరించమని కృష్ణునితో చెప్పడం -

ఇదీ జయదేవుని గీతాగోవింద విధానము. ఇంచుమించుగా ఈ విషయాలన్నీ అన్నమయ్య కీర్తనల్లో శ్రీవేంకటేశ్వరునికీ వివిధ నాయికల మధ్య దర్శనమిస్తాయి. అయితే జయదేవుడు రాధాకృష్ణులకే పై అంశాలన్నీ సమన్వయింపజేశాడు.

జయదేవ - అన్నమయ్యల రచనల్లో విభిన్నత్వం కూడా ఉన్నది :

జయదేవుని గీతగోవిందం కావ్యజ్ఞ శిక్షకు, రస పరతంత్రతకూ నిధానంగా నిల్చింది. విభావ, అనుభావ, సంచారీ విభావాలను అలంకారాలను, ధ్వనిని ఆయా స్థానాలకు తగినట్లుగా అలంకార శాస్త్ర సమ్మతంగానే సంస్కృత కవిత్వంలో నిర్వహించాడు. అయితే అన్నమయ్య కావ్య ధర్మాలకు లక్ష్య భూతంగా కాకుండా శ్రీవేంకటేశ్వర భక్తికి పరమావధిగా తన సంస్కృతాంధ్ర రచన సాగించాడు.

జయదేవుని సంస్కృత రచన వ్యాకరణ శాస్త్రానికి సర్వాత్మనా సమ్మతమైనది. కానీ అన్నమయ్య అటు తెలుగులో ఇటు సంస్కృతంలో విలక్షణమైనరీతిలో విభక్తి ప్రయోగాలను, అంకారాలను, పద చిత్రాలను తనదైన శైలిలో ప్రయోగించడం జరిగింది. పైగా మణి ప్రవాళ శైలిలో అన్నమయ్య అద్వితీయుడు.

అన్నమయ్య రచనలు రాగిరేకుల కెక్కడం మరో ప్రత్యేకత. తిరుమల శ్రీవేంకటేశ్వరాలయంతో అన్నమయ్య నుండి నేటి వరకు తాళ్ళపాక వంశీయుల సంబంధాలు కొనసాగుతున్నాయి. ఇదొక అపూర్వ విషయం.

జయదేవుడు తన ముద్రతో రచనలుచేశాడు, అన్నమయ్య పల్లెల్లో, పట్టణాల్లో ఎంతో సంచారం చేసి, అనేక దేవతా మూర్తులపై పాటలను అల్లినా అన్నింటిలోను వేంకటేశ్వర ముద్రను ఉంచడం ప్రశంసనీయం. జయదేవుని సారస్వతం శాస్త్రీయ పద్ధతిలో కూడి నృత్యమర్యాదలకు కాణాచి అయితే, అన్నమయ్య సాహిత్యం అటు పండిత పరిషత్తులకు, ఇటు జానపద ధోరణులకు విస్తరించిన తత్త్వం కలది.

జయదేవుని కవిత్వాన్ని శ్లాఘిస్తూ ఎందరో పూర్వకవులు తన కృత్యాదిలో విలక్షణ స్తుతుల్లోకి ముంచెత్తారు. కానీ అన్నమయ్యని కేవలం తరిగొండ వెంగమాంబ తప్ప ఎవరూ పూర్వకవుల స్తుతుల్లోకి చేర్చకపోవడం గమనార్హం.

గీతగోవిందానికి వివిధ భాషల్లో అనువాదాలు ఉన్నాయి. కానీ అన్నమయ్య సంస్కృత కీర్తనలను ఎవరూ అనువదించకపోవడం ఆశ్చర్యకరం.

నిత్య జీవితంలో హృదయేశ్వరికి పూర్వకాలంలో కావ్యరూపాన్నిచ్చి (ఆత్మాశ్రయత్వం) ఆదరించడం, ఎక్కడా గోచరించదు. కానీ ప్రాచీన సాహిత్యంలో “పద్మావతీచరణచారణ చక్రవర్తి” యైన జయదేవుడు ఇందుకు అపవాదంగా కనిపిస్తాడు. జయదేవుని భార్య పద్మావతి శ్రీకృష్ణుని సన్నిధిలో అభినయాత్మక నృత్యం చేసేది. తనవంతుగా భగవదారాధనలో తరించేది. జయదేవ కవి సారస్వతం పై తాళ్ళపాక కవులకున్న ఆదరం, ప్రభావం అపారమైనది. అన్నమయ్య, జయదేవుడు భక్తి కవితాజగత్తులో సూర్య చంద్రుల వంటివారు. వారి యశశ్శరీరాలు ఆ చంద్రతారార్కం సాహితీ జగతిలో విరాజిల్లుతుంటాయి.

“శ్రీవేంకటేశ చరణౌ, శరణం ప్రపద్యే”

***

అన్నమయ్య - పురుషోత్తం చౌదరి

ఆచార్య టి. జయా మనోహర్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు.

మనిషి ఉన్నచోట భగవంతుడు ఉంటాడు - భగవంతుడు లేడు అనే మనుషులు కొందరు ఉన్నా సంఖ్యాపరంగా తక్కువే. అధిక సంఖ్యాకులైన మానవులు భగవంతుణ్ణి ఆరాధిస్తారు. భగవంతుడు 'ఉన్నాడు' అనే నమ్మకంలో జీవిస్తారు.

భారత, భాగవత రామాయణాలైనా, బైబిలు, ఖురాను వంటి యితర తమ గ్రంథాలైనా భక్తుడికి భగవంతుడికి సాన్నిహిత్యాన్ని పలుమార్లు వెలిబుచ్చాయి.

మతానికి, సంగీతానికీ మనదేశంలో విశిష్ట స్థానం ఉంది. ప్రపంచంలో అన్ని మతాలకు సంగీతమైనా, కీర్తన సాహిత్యమైనా జీవకర్రలాంటివి. పరమేశ్వరుణ్ణి కీర్తనల ద్వారా ప్రసన్నం చేసుకునే పద్ధతి మన దేశంలో ప్రాచీన కాలం నుంచీ ఉంది. పరమాత్మను గూర్చి, పరమాత్మ తత్త్వాన్ని గూర్చి ఎక్కడ గానం చేయబడుతుందో అక్కడే పరమాత్మ ఉంటాడని నారద సంహితలో ఉంది.

"నాహం వసామి వైకుంఠే నయోగి హృదయరపి
మద్భక్తా యత్ర గాయంతే తత్ర తిష్ఠామి నారద"

"నేను వైకుంఠంలోగాని యోగుల హృదయాల్లోగాని నివసించను. నా భక్తులు ఎక్కడ నన్ను గూర్చి గానం చేస్తారో అక్కడే ఉంటాను." - అని ఈ శ్లోకం అర్థం. భక్తితో చేసే గానం యోగం అవుతుంది. ఆ యోగం చేత పురుషుడు పరమాత్మలో లీనం అవుతాడనే భావాన్ని తెలిపే శ్లోకమిది.

"గీతిగానేన యోగాస్స్యాత్ యోగాదేవ శివైక్యతా
గీతాజ్ఞే ఉ_య యోగీన సయాతి పరమేశ్వరః ॥

భక్తితో చేసే గానమే ప్రాణంగా బ్రతికిన వారు అన్నమయ్య తదితర వాగ్గేయ కారులందరూ.

భారతదేశంలోని వాగ్గేయ కారులంతా వైష్ణవ భక్తులే. అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య, పురంధరదాసు, కనకదాసు, శ్రీచైతన్య లాంటి వారందరూ వైష్ణవ భక్తులే.

తెలుగు వాఙ్మయంలో భక్తి సాహిత్యానికి గొప్ప స్థానం ఉంది. భక్తిని ఒక రసంగా పేర్కొంటూ రస సిద్ధాంతాల్లో దీన్ని చేర్చేందుకు మధుసూదన సరస్వతి ప్రతిపాదన చేశాడు. తన రూపంలో పరమాత్మను చూసుకోవడం అనే భావమే భక్తి అని మధుసూదన సరస్వతి ఉవాచ.

భక్తిని వ్యక్తీకరించే మార్గాలు తొమ్మిది ఉన్నట్లు నారద భక్తి సూత్రాల ద్వారా తెలుస్తోంది. కొందరు భక్తులు నవవిధ భక్తి విధానాల్లో ఏదో ఒక విధానాన్ని ఆశ్రయిస్తారు. నవవిధ భక్తి విధానాల్లో 'కీర్తనం' ద్వారా అన్నమయ్య తన భక్తిని చాటుకున్నాడు.

సాహిత్య ప్రక్రియల్లో పద వాఙ్మయానికి విశిష్ట స్థానం ఉంది. లయాత్మకమైన భావనా పద్ధతి పద వాఙ్మయంలో ఉండే ప్రత్యేక ఆకర్షణ. పదకర్త అంతర్దర్శనాన్ని స్పష్టంగా పదవాఙ్మయంలో చూడగలుగుతాం. పదకర్త బహుముఖీన ప్రతిభా విశేషాలన్నీ పదవాఙ్మయంలో కనిపిస్తాయి. పద వాఙ్మయం ఒక ఉదాత్త ప్రక్రియ.

పదకర్త ధ్యానానికి కేంద్రబిందువైన వస్తువు యొక్క ఉదాత్తానుదాత్తాలను బట్టి ఆ పదకర్త రచనా కౌశలాన్ని బట్టి అతను వ్యక్తపరచిన భావతత్త్వాన్ని బట్టి ఆయా పదకర్తల స్థాన నిర్ణయం జరుగుతుంది. అంతటి విశిష్ట స్థానాన్ని శాశ్వతంగా ఆక్రమించుకున్న పదకర్త అన్నమాచార్యులవారు. అందుకే ఆయన పద కవితా పితామహుడయ్యాడు.

భారతదేశంలో ఇతర మతాలతో పాటు ఆయా మత సంబంధ సాహిత్యం కూడా భాగస్వామ్యం పొందింది. అలా భాగస్వామ్యాన్ని పొందిన మతపరమైన సాహిత్యాల్లో క్రైస్తవ సాహిత్యం ఒకటి తెలుగు సాహిత్యంలో అధికారికమైన భాగస్వామ్యం ఉండకపోయినా క్రైస్తవ సాహిత్యం కూడా తెలుగు సాహిత్యంలో భాగంగా గుర్తింపు పొందింది. తనదైన శైలిని, ప్రత్యేకతను కలిగిన క్రైస్తవ తెలుగు సాహిత్యంలో సింహభాగం పొందిన సాహితీ ప్రక్రియ క్రైస్తవ తెలుగు పద వాఙ్మయం.

తెలుగులో సంకీర్తనా వాఙ్మయానికి అన్నమయ్య ఎలాగో క్రైస్తవ తెలుగు సంకీర్తనా వాఙ్మయానికి పురుషోత్తమ చౌదరి అలాగ.

పురుషోత్తమ చౌదరి :

పురుషోత్తమ చౌదరి బెంగాల్ బ్రాహ్మణ కుటుంబంలో 1803 సెప్టెంబరు 5న జన్మించాడు. తల్లి సుభద్రాదేవి, తండ్రి కూర్మనాథచౌదరి. స్వస్థలం బెంగాల్. స్థిరపడిన ప్రాంతం ఒరిస్సా. పురుషోత్తం చౌదరి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. బహు భాషా కోవిదుడు. మహాభారతం, భాగవతం, రామాయణాలే కాక వేదాలు కూడా చదివాడు. బ్రాహ్మణోత్తముడిగా గణించబడ్డాడు. మంత్ర పఠనం, తిరునామ కీర్తన గానం అతని నిత్యకృత్యం.

మోక్ష మార్గాన్వేషణ, సత్యాన్వేషణలో భాగంగా తీర్థయాత్రలు చేశాడు. కాని ఫలితం లేకపోయింది. శాంతిలేక మోక్షమార్గమేదో తెలీక, పురుషోత్తం చౌదరి చింతించాడు.

విగ్రహారాధన, కులాచారం, సాంఘిక దురాచారం - వంటి వాటిని పురుషోత్తం చౌదరి నిరసించాడు. సామాన్య ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పూజారులు చేస్తున్న దురాగతాల్ని ఎదిరించేవాడు. వారి వైఖరిపట్ల కేవలం విముఖతే గాని హిందూమతం పట్ల పురుషోత్తం చౌదరికి ద్వేషంలేదు.

విదేశీ మిషనరీ ఉద్యమానికి ఆకర్షితుడై దానిలో చేరాడు. ఆయన తలపెట్టిన సంస్కరణల అమలుకు విదేశీ మిషనరీ ఉద్యమంలో వీలుకలిగింది. ఈ సమయంలో బైబిలులోని నూతన నిబంధన గ్రంథాన్ని చదివాడు. అది ఆయనలోని ఆత్మ తృష్ణను తీర్చింది.

1833లో యజ్ఞోపవీతాన్ని స్వచ్ఛందంగా త్యజించి, తన జాతిని ఆస్తిని వదిలి బహిరంగంగా క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు. రెండేళ్ల తరువాత అతని ధర్మపత్ని కూడా భర్తనే అనుసరించి క్రైస్తవ మతాన్ని స్వీకరించింది.

పురుషోత్తం చౌదరి సహజంగా కీర్తనాకారుడు. క్రైస్తవం స్వీకరించాక కీర్తనల్ని గానం చేసి రాయడం ప్రారంభించాడు. క్రైస్తవ వాఙ్మయ సమాజంవారు 1893లో మొట్టమొదట ప్రచురించిన 'ఆంధ్రక్రైస్తవ కీర్తనలు' అనే కీర్తనల పుస్తకంలో ఎనభైశాతం కీర్తనలు పురుషోత్తం చౌదరి రాసిన కీర్తనలే. అన్నమయ్య ఆధ్యాత్మిక కీర్తనలతో పాటు శృంగార కీర్తనల్నీ రాశాడు.

కాని పురుషోత్తం చౌదరికి శృంగార కీర్తనల్ని రాసే అవసరంలేదు. పురుషోత్తం చౌదరి తన జీవితాన్ని అంకితం చేసి భక్తితో కొల్చిన దేవుడు యేసుక్రీస్తు. ఆయన అవివాహితుడు. కనుక పురుషోత్తం చౌదరి కేవలం ఆధ్యాత్మిక సంబంధమైన కీర్తనలు, క్రైస్తవ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన కీర్తనలు మాత్రమే రచించాడు. దైవస్తుతి, ఆరాధన, ఉదయారాధన, సాయంకాల ఆరాధన, యెహోవా స్తుతి, యేసుక్రీస్తు స్తుతి, క్రీస్తు జననం, క్రీస్తు జీవితం, క్రీస్తు ఉపదేశాలు, క్రీస్తు ప్రేమ, క్రీస్తు కృప, క్రీస్తు మరణ సూచనగా జరిగిన ప్రభురాత్రి భోజనం, క్రీస్తు మరణానికి ముందు అనుభవించిన శ్రమలు, క్రీస్తు మరణం క్రీస్తు మరణానంతరం జరిగిన పునరుత్థానం, ఆరోహణం, పునరాగమన నిరీక్షణం లాంటి అంశాల్లో కీర్తనలు రాశాడు. సువార్తను ప్రకటించడం అంటే క్రీస్తును గురించిన విషయాల్ని అందరికీ తెలియబరచడం అనేది క్రైస్తవ మతంలోని అనేక ప్రధానమైన అంశాల్లో ఒకటి. అందుకే సువార్త ప్రకటన, పశ్చాత్తాపం, పాపక్షమాపణ, నూతన జన్మలాంటి అంశాల మీద కీర్తనల్ని రాశాడు. క్రైస్తవ జీవితం ఒక ప్రత్యేకతను కలిగి ఉండాలనేది బైబిలు శాసనం. అందుకే రక్షణానందం, క్రైస్తవ సాక్ష్యం, శోధనలు, పోరాటాలు, ప్రార్ధన నమ్మిక, నెమ్మది, దైవ సహాయం, నడిపింపు, సహవాసం, పరిశుద్ధత, సమర్పణ, సేవ- ప్రతిఫలం, క్రైస్తవ జీవిత యాత్ర, క్రైస్తవ నిరీక్షణ, ఆనందం, పరలోకానందం, క్రైస్తవ కుటుంబం, క్రైస్తవ యువజనులు, క్రైస్తవ బాలలు వంటి క్రైస్తవ జీవన విధానాన్ని తెలిపే మార్గదర్శక సూత్రాల సారాన్ని వివరించే కీర్తనల్ని కూడా పురుషోత్తం చౌదరి రచించాడు.

సంఘం ఏమతానికైనా పట్టుగొమ్మ. సంఘం లేనిదే మతంలేదు. బైబిలులో సంఘానికి చాలా పెద్ద పీట వేశారు. భారతదేశంలో మత ప్రచారానికి పూనుకున్న విదేశీయులు కూడా సంఘ సేవే పరమావధిగా భావించి భారతీయుల్లో కొన్ని వర్గాలవారిని తమవైపు త్రిప్పుకోగలిగారు. క్రైవస్తవ పాఠశాలలు, క్రైస్తవ వైద్యశాలలు, సంవత్సరాద్యంతాలు, జాతీయోత్సవాలు, ఆశీర్వాచనాలు మితానుభవం, లాంటి అనేక సాంఘికాంశాల్ని తన కీర్తనల్లో చౌదరిగారు ఇమిడ్చారు. ఇన్ని రకాలైన వైవిధ్యభరితాలైన అంశాల మీద పురుషోత్తం చౌదరి గారు కీర్తనల్ని రచించారు. అందుకే పురుషోత్తం చౌదరిగారి కీర్తనల్లో చరణాలు పదికంటే ఎక్కువే ఉంటాయి. విస్తృతాంశాల్ని పొందుపరచడానికి చరణాల సంఖ్య పెంచడం ఒక్కటే మార్గం.

అన్నమయ్యకు, పురుషోత్తం చౌదరికి వందల ఏళ్లు తేడా ఉన్నా అన్నమయ్య ప్రభావం పురుషోత్తం చౌదరి మీద చాలా స్పష్టంగా కన్పిస్తుంది. ముక్తికి, మానవ జన్మ నుండి విముక్తికి కీర్తనలకున్న శక్తిని ఇరువురు నిరూపించారు. ఆ దేవుళ్లు వీరి కీర్తనల్ని విని తరించారు.

దైవలీలలు వీరి పాటల్లో అవలీలుగా యిపిడిపోయాయి. దేవుళ్లు ఎవరైనా దైవార్చనకు భాష ఎప్పుడూ సిద్ధమేనని రుజువయింది. వీరిరువురి భక్తి పారవశ్యానికి భావం కూడా ప్రభావితమైపోయి కీర్తనగా వెలువడింది. అన్నమాచార్యులు, పురుషోత్తం చౌదరి ఇరువురూ రాసిన శంకరాభరణం, ముఖారి, కేదారగౌళ రాగాల్లోని పాటల్ని ఉదాహరణకు చూద్దాం.

అన్నమాచార్యులు రాసిన శంకరాభరణం కీర్తన :

పల్లవి : *అలరులు గురియఁగ నాడెనదే*
అలకులఁ గులుకుల నలమేల్మంగ

పురుషోత్తం చౌదరి రాసిన శంకరాభరణం కీర్తన :

పల్లవి : *యెహోవ నా మొఱలాలించెను*
దీన మహోదయను నను గరుణించెను
అహర్నిశల దీనహీనుడగు నా
దుహోయనెడు ధ్వని గ్రహించిమనిపెను...

అన్నమాచార్యులు రాసిన ముఖారి రాగం కీర్తన :

పల్లవి : *బ్రహ్మ కడిగిన పాదము*
బ్రహ్మము తానెనీ పాదము ...

పురుషోత్తం చౌదరి రాసిన ముఖారి రాగం కీర్తన :

పల్లవి : ఉన్న పాటున వచ్చుచున్నాను నీ పాద
సన్నిధికోరక్షకా - యెన్న శక్యముగాని
పాపములన్ని మోపుగ వీపుల పై బడి
యున్న విదే నడవలేక తొట్రిలు
చున్నవాడను నన్ను దయగను *!!ఉన్న!!*

అన్నమాచార్యులు రాసిన కేదార గౌళరాగం కీర్తన :

పల్లవి : *అడుగరే యాతనినే అంగనలాలా*
గుడిగొని తానే వట్టి గౌరబాయగాక !

పురుషోత్తం చౌదరి రాసిన కేదార గౌళరాగం కీర్తన :

పల్లవి : *దేవా దివ్యానంత ప్రభావ మాం*
పాహి ఘన యెహోవా స్థావర
జంగమ సహిత నిఖిల జగ
దావన పావన భావ నిరంతర !!దేవా!!

రాగంలోనే కాకుండా వీరిరువురూ రాసిన కీర్తనల్లోని భావానికి సంబంధించిన సామ్యత ఎంతో ఉంది.

అన్నమయ్య రచించిన 'బ్రహ్మమొక్కటే' అనే కీర్తనకు దగ్గరి సంబంధం కలిగిన పురుషోత్తం చౌదరి రాసిన 'పరమాత్ముడితడే మన ప్రభు యేసు' అనే కీర్తన ఉంది.

అన్నమయ్య : పల్లవి : *తందానాన ఆహి తందానాన పురే*
తందనాన భళా తందనాన

ఈ కీర్తనలో అన్నమయ్య పరమాత్మ ఒక్కడే అనే భావాన్ని స్ఫురింపజేశాడు. మానవులందరిలో ఆత్మ రూపంలో భగవంతుడు ఉన్నాడని చెప్పాడు. ఇలాంటి భావాన్ని వ్యక్తపరిచే కీర్తనను పురుషోత్తం చౌదరి కూడా రాశారు.

పల్లవి : *పరమాత్ముడితడే మన ప్రభుయేసు*
పరమాత్ముడితడే సోదరులారా
పరమాత్ముడితడే - పరమాత్ముడితడని
పరికించి మదిగాంచు పరమభక్తులకు
క్షేమకరమానందము గల్గు !! పర!!

చరణం : *జననమద్భుతము - ఈతడు సేయు పనుల త్యద్భుతముత*
మృతిబొంది లేచినదేం ఘనము నమ్మినవారి కిన నిత్య సుఖము

అన్నమయ్య : పల్లవి : ***అదివో అల్లదివో శ్రీహరి వాసము***
పదివేల శేషుల పడగల మయము

–అనే కీర్తనలో అన్నమయ్య భక్తజనులందరికీ ఆ ఏడుకొండల వేంకటేశ్వర నివాసాన్ని చూపిస్తూ దాని ఔన్నత్యాన్ని భక్తులకు వినిపించారు.

అదే భావాన్ని పలికిస్తూ పురుషోత్తం చౌదరి గారు కొన్ని కీర్తనలు రచించారు ఉదాహరణకు

పల్లవి : *పరిశుద్ధం పరిశుద్ధం పరిశుద్ధమని*
వినబడు పురమదిగో పదపదరే
ప్రియులారా పరమేశ్వరుని చేత
పరిపాలనము గల్గి చిరమై భాసురమై
సుస్థిరమై సుందరమైన.....

చరణం: *రవియైనా గుముద బాంధవుడైనా*
మరి దీప ఛ్ఛవియైనా దాని
కవసర మింతలేదు అవిరతమును క్రీస్తుదానంద
ప్రభతో సరిస్తవమై వైభవమై
యుత్సవమై తానే వెలుగు ॥ పరిశుద్ధ॥

ఇలా చెప్పుకుంటూ పోతే భావంలోని సామ్యత, భాషలోని సామ్యత, వస్తువులోని సామ్యత ఇరువురి కీర్తనల్లో మనకు చాలా కనిపిస్తుంది. ఉదాహరణకు అన్నమయ్య రాసిన 'నమనారసింహా నమో నమో' అనే పాట, శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ నీ పాదమే శరణు' అనే పాటలకు, పురుషోత్తం చౌదరి రాసిన 'త్రాహిమాం క్రీస్తునాథ దయజూడరావే నేను దేహియనుచు నీ పాదములేదిక్కుగా చేరితి నిపుడు' – అనే పాటకు, అన్నమయ్య రాసిన 'ఆకటివేళల నల పైన వేళలను వేకువన హరినామమే దిక్కుమరి లేదు' – అనే కీర్తనలోని భావాన్ని ప్రస్ఫుటం చేస్తూ పురుషోత్తం చౌదరి 'తెల్లవారిన వేళ తెలివంది మన క్రీస్తు దివ్య నామము పాడరే' – అనే కీర్తన మనకు కన్పిస్తుంది.

ఇలా అన్నమయ్య ప్రభావం పురుషోత్తం చౌదరి మీద ఎంతో ఉంది. నవవిధ భక్తి విధానాల్లోని కీర్తనం వీరిరువురూ ఆశ్రయించిన పద్ధతి.

మనల్ని సృష్టించే దేవుడికి, మనకు సర్వస్వాన్ని అందించే భగవంతుడికి మనం ఏమివ్వగలం? ఒక్క స్తుతించడం తప్ప, మొరపెట్టుకోవడం తప్ప, వేనోళ్ళ కొనియాడడం తప్ప, ఆడిపాడి పారవశ్యం పొందడం తప్ప. యిది కూడా మన తృప్తి కోసమే. మనల్ని మనం సంతృప్తి పరచుకోవడం కోసమే.

మనం భగవంతుణ్ణి స్తుతించడం వల్ల భగవంతుడికి అదనంగా బలం ఇనుమడించదు. భగవంతుడికి మనం చేసే స్తుతి జన్మ సాఫల్యానికే.

ఆ దేవదేవుడు స్వయంగా అన్నమయ్య పల్లకిని మోసి రుణం తీర్చుకున్నాడు. అన్నమయ్య రాగాలకు ఆ దేవదేవుడు అనురాగ భరితుడయ్యాడు. అన్నమయ్య కూర్చిన పదబంధాలకు పద్మావతీ శ్రీనివాసులు ఆత్మీయ బంధువులైపోయారు. అలాంటి గొప్ప మహానుభావుడైన అన్నమయ్య ప్రభావం వందల ఏళ్ల తరువాతి కాలంలో జన్మించిన పురుషోత్తం చౌదరిపై ఉండడానికి వారి మధ్య కొన్ని సామ్యతలు ఉండడం కూడా కారణం కావచ్చు. అన్నమయ్యకు పురుషోత్తం చౌదరికి ఉన్న పోలికను నాకు తెలిసినంతలో వివరించేందుకు ప్రయత్నిస్తాను.

సామ్యత :

- ఇరువురూ నిష్టాగరిష్టులైన బ్రాహ్మణ కుటుంబాల్లో జన్మించినవారు.
- ఇద్దరూ తెలుగువారు కారు.
- అన్నమయ్య హైందవ మతానికి సంబంధించిన దేవుడిపై భక్తి పారవశ్యంతో గానం చేస్తే, క్రైస్తవ మతానికి సంబంధించిన దేవుడిపై భక్తి పారవశ్యంతో గానం చేసినవారు పురుషోత్తం చౌదరి.
- ఇద్దరూ రాగ, తాళ, లయ, తెలిసినవారు. సంగీత పరిజ్ఞానం ఉన్నవారు.
- గీతాలకు స్వరకల్ప చేయగలిగిన సమర్థులు.
